www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
బుధవారం 16 ఏప్రిల్ 2025
సంపుటి :06 సంచిక : 315 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

## గల్ఫ్ లో హత్యగావించబడ్డ నిర్మల్ జిల్లా వాసీ కుటుంబానికి అండగా బిజెపీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

- విదేశాంగ మంత్రిత్వ శాఖ, కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.
- మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చే దిశగా చర్యలు.



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:
సౌన్ మండల కేంద్రానికి చెందిన ఆష్టం ప్రేమ్ సాగర్ దుబాయ్ లో మృతి చెందడంతో, కుటుంబ సభ్యులు మరియు మండల నాయకులు 2 లో..

# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు

- మంత్రివర్గ విస్తరణ అధిష్ఠానం పరిధిలో ఉంది
- సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- హైదరాబాద్ వీడి గ్రామాలకు తరలి వెళ్లాల్సిందే
- సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండండి
- విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- పార్టీ ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ సూచన





హైదరాబాద్,ఏప్రిల్15( వెలుతురు):
రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ...ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ రెడ్డి సున్నితంగా హెచ్చరిక చేశారు. ఎవ్వరు కూడా పాటీ లైన్ దాటి మాట్లాడవద్దని అన్నారు. మంత్రివర్గ విస్తరణ అన్నది అదిష్టానం నిర్ణయమని కూడా స్పష్టం చేశారు. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనభాపక్ష సమావేశంలో సిఎం రేవంత్ మాట్లాడారు. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్ళు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేశారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా 2 లో..

# దుబాయిలో తెలంగాణ వాసుల హత్యపై కేంద్ర మంత్రి ఆరా

- ప్రేమ్ సాగర్ కుటుంబ సభ్యులకు బండి సంజయ్ ఫోన్
- స్వదేశానికి త్వరగా భౌతిక దేహాలను తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడి
- విదేశాంగ శాఖ కార్యాలయ అధికారులతో మాట్లాడిన కేంద్ర మంత్రి



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:
పాకిస్తానీ చేతిలో దుబాయిలో దారుణంగా హత్యకు గురైన ప్రేమ్ సాగర్ కుటుంబ సభ్యులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం ఫోన్





చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ప్రేమ్ సాగర్ తోపాటు హత్యకు గురైన 2 లో..

# ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్లు విడుదల

- లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు ,హైదరాబాద్ బ్యూరో. ఏప్రిల్ 15:
బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందనిరాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల 2 లో..

## ప్రభుత్వాన్ని కూలుస్తామంటే ఊరుకోం

- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ హెచ్చరిక



హైదరాబాద్,ఏప్రిల్15( వెలుతురు):
కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ 2 లో..

## భూముల అమ్మకంలో బిఆర్ఎస్‌తో పోటీ

- అప్పులు, భూముల అమ్మకంతో నడుస్తున్న ప్రభుత్వం
- పార్టీ జాతీయ అధ్యక్షుడి రేసులో లేను
- తెలంగాణలోనూ ఎన్‌డిఎ కూటమి ఏర్పాటు
- మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్15( వెలుతురు):
తెలంగాణలో భూములు, మద్యం విక్రయాలు, అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. భూముల అమ్మకంలో భారాసతో కాంగ్రెస్ పోటీ-పడుతోందన్నారు. హెచ్‌సీయూ అంశంలో తనపై కేసు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధమని తెలిపారు. అర్ధరాత్రి 2 లో..

## మహాత్మా జ్యోతిబా పూలే, మాత సావిత్రి భాయి పూలే దంపతులు మానవతా మూర్తులు

- వి.హనుమంత రావు (విహెచ్)



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:
హైదర్ గూడా చౌరస్తా, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ ,మహాత్మా జ్యోతిబా పూలే, మాత సావిత్రి భాయి పూలే విగ్రహాలకు నివాళులు అర్పించిన మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు వి,హనుమంతరావు మాట్లాడుతూ మహనీయులు మహాత్మా పూలే దంపతుల వారి పోరాటం వల్లనే బలహీన వర్గాలకు విద్య అందుబాటులోకి వచ్చిందని ఆయన అన్నారు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి,బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ చైర్మెన్ చిరంజీవులు పూలే దంపతులకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.. పూలే మార్గం అనుసరణీయం అన్నారు, హైదర్ గూడ కూడలిలో పూలే దంపతుల విగ్రహాలు నెలకొల్పడం చాలా గొప్ప విషయం అని వ్యవస్థపకులు మేకపోతుల నరేందర్ గౌడ్ కి ధన్యవాదాలు తెలిపారు,బీసీ కుల సంఘాల చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ 2 లో..

## ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ

- ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో ఆర్థిక వ్యవస్థ పురోగతి
- ఇతర నగరాలకన్నా హైదరాబాద్‌లో 56శాతం వృద్ధిరేటు
- సిటిజన్‌గ్లోబల్ కేపబిలిటీసెంటర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఏప్రిల్15 ( వెలుతురు):
గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించిన సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. దిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. ఈ క్రమంలో తెలంగాణ దేశంలో 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదిగేందుకు చేస్తున్న ప్రయత్నానికి దోహదపడుతుందని 2 లో..




## పింక్‌బుక్‌లో బెదిరింపు నేతల పేర్లు

- ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని వదిలిపెట్టం
- రజతోత్సవ సభకు రాకుండా బెదిరింపులు
- వేధించే నాయకులు, అధికారులను వదలబోం
- సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు


2 లో..

## నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి ఛార్జ్‌షీట్

- ఛార్జ్ షీటులో సోనియా, రాహుల్ పేర్లు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్



న్యూఢిల్లీ,ఏప్రిల్15( వెలుతురు):
'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటు-చేసుకుంది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి 2 లో..

# ఎస్సీ వర్గీకరణ ముసాయిదాకు కేబినేట్ ఆమోదం

- 30 మెగావాట్ల సామర్థ్యంతో 2 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం
- రూ.617 కోట్లతో అసెంబ్లీ నిర్మాణం
- రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణం
- నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగింత
- విశాఖలో ఐటి విస్తరణకు పెద్దపీట
- టిసిఎస్‌కు 21.66 ఎకరాల కేటాయింపు
- ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు




అమరావతి,ఏప్రిల్15( వెలుతురు):
ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగిం చాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విశాఖ లోని ఐటీ-హిల్ -3 పైన టీసీఎస్‌కి 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 3.5 ఎకరాలు 8 లో..

## అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం

- మే 2న రానున్న ప్రధాని మోడీ
- మంత్రులు పనితీరు మార్చుకోవాల్సిందే
- కేబినేట్ భేటీ తరవాత మంత్రులతో చంద్రబాబు

అమరావతి,ఏప్రిల్15( వెలుతురు):
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి పునఃనిర్మాణంపై పరత్యేక దృష్టిసారించింది.. ఇప్పటికే పలు రకాల పనులకు సీఆర్డీఏ అథారిటీ, ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాయి.. అయితే, గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ.. ఇప్పుడు, అమరావతి పునఃనిర్మాణానికి కూడా రాబోతున్నారు.. మే 2వ తేదీన అమరావతిలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన కొనసాగనుంది.. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మోడీ పర్యటన ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులకు తెలిపారు.. మూడేళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ , హైకోర్టు, రహదారులు పూర్తి చేయడమే లక్ష్యంగా 8 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు

మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానందే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు.అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని సీఎం తేల్చి చెప్పారు. మంత్రి పదవులపై ఒకరికి మించి మరొకరు లీకులు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసిన సీఎం.. ఇష్టం వచ్చినట్లు- మాట్లాడితే మంత్రి పదవులు రావన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా పని చేసుకోవాలని సూచించారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై కొందరు ఆశావహులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏకంగా హుకుం జారీ చేశారు. మరోవైపు.. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇలా మంత్రి వర్గ విస్తరణపై ఆశవహులు బహిరంగంగ మాట్లాతుండటంతోనే తాజాగా జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం, పిసిసి చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దుబాయిలో తెలంగాణ వాసుల హత్యపై కేంద్ర మంత్రి ఆరా

నిజామాబాద్ కు చెందిన శ్రీనివాస్ మృత దేహాలను వీలైనంత తొందరగా స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు కేంద్ర మంత్రి ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే విదేశీ వ్యవహారాల మంత్రి కార్యాలయంతో మాట్లాడారు. వెంటనే దుబాయిలో హత్యకు గురైన ప్రేమ్ సాగర్, శ్రీనివాస్ మృత దేహాలను స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ కార్యాలయ అధికారులు సైతం దుబాయి అధికారులతో మాట్లాడారు. వీలైనంత తొందరలో ఆయా మృత దేహాలను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ఎప్పటికప్పుడు విదేశాంగ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని హోంమంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించారు. దుబాయి పోలీసులను సంప్రదించిన విదేశాంగ శాఖ కేంద్ర మంత్రి బండి సంజయ్ జోక్యం చేసుకోవడంతో విదేశాంగ శాఖ అధికారులు దుబాయిలోని భారత ప్రతినిధులు దుబాయిలోని భారతీయ విదేశాంగ శాఖ ప్రతినిధులు బుర్ దుబాయ్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి వివరాలను సేకరించారు. అష్టపు శ్రీనివాస్, ప్రేమ్ సాగర్ ఇద్దరూ దుబాయిలోని అల్ కోజ్ ఇండస్ట్రియల్ ఏరియాలోని మోడరన్ బేకరీలో పనిచేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఉద్దేశపూర్వక హత్యా అభియోగం కింద ఈ నెల 11నే కేసు నమోదు చేసినట్లు బుర్ దుబాయ్ పోలీస్ స్టేషన్ నేర పరిశోధన విభాగం అధిపతి పేర్కొన్నారు. కేసును అదే రోజున ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేశామని చెప్పారు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక కీలకమన్నారు. హత్య కేసు కావడంతో మృతదేహాలను భారత్ కు పంపే విషయంలో ప్రాసిక్యూషన్ ఆమోదం అవసరమని ఈ సందర్భంగా పోలీసు అధికారులు తెలిపారు. లాంఛనాలను వేగవంతం చేసి వీలైనంత త్వరగా మృతదేహాలను భారత్ కు పంపిస్తామని తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్లు విడుదల

రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 12 మంది లబ్దిదారులకు మంగళ వారం నాడు లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసు కుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్ ఎఫ్ టి కి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు.అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## ప్రభుత్వాన్ని కూలుస్తామంటే ఊరుకోం

ఊరుకోం అని.. ఇక్కడ ఎవరూ చేతులు కట్టుకుని కూర్చోలేదంటూ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు హెచ్చరించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత అవినీతి చేసిందో.. ఎంత దోచుకుందో.. కాంట్రాక్టర్ల పేరుతో తెలంగాణ జనం సొమ్మును ఏ విధంగా లూటీ చేసిందో అనటానికి.. కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం అంటూ దుమ్మెత్తిపోశారు. దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు- మంత్రులు, ఎమ్మెల్యే స్పందించారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మంత్రులు, నేతలు కౌంటర్ ఇచ్చారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ స్పందిస్తూ.. చోటామోటా కాంట్రాక్టర్లు కూల్చితే కూలే ప్రభుత్వం కాదని, ఎమ్మెల్యేల సంపూర్ణ మద్దతు తనకు ఉందని చెప్పారు. చోటామోటా బ్యాచ్‌కి భయపడమని, బీఆర్ఎస్ పదేండ్లు యథేచ్ఛగా దోచుకుందని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ కు అమ్ముడు, కొనుగోలుపై అనుభవం ఉందని, ఎమ్మెల్యేలు సంతలో పశువులు కాదని పీసీసీ చీఫ్ కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ నేతలకు కనీస గౌరవం లేదని, డబ్బులకు అమ్ముడు పోయే ఎమ్మెల్యేలని బీఆర్ఎస్ అంటోందని, ప్రభుత్వ పెద్దలతో చర్చించి కొత్త ప్రభాకర్ వ్యాఖ్యలపై తగిన నిర్ణయం తీసుకుంటామని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు.

## గల్ఫ్ లో హత్యగావించబడ్డ నిర్మల్ జిల్లా వాసి కుటుంబానికి అండగా బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారికి విన్నవించుకోగా, మంగళవారం రోజున విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో మరియు - రాష్ట్ర ప్రభుత్వ NRI సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ప్రేమ్ సాగర్ మృతదేహం స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధికారులకు సూచించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని, వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, కుంటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# భూముల అమ్మకంలో బిఆర్ఎస్‌తో పోటీ

ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లను నరికిన ప్రభుత్వాలను చూశామా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు తొందరేమీ లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికకు మరో వారం రోజుల సమయం పట్టే అవకాశముందని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రతిపాదనల్లో తన పేరు లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్డీఏను పునరుద్ధరించామని.. తెలంగాణలోనూ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ తమ పార్టీ నేత అని.. ఆయన అంశంపై అంతర్గతంగా చర్చించుకుంటామని తెలిపారు. మీడియాతో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా పలు కీలక అంశాలపై స్పందించారు. తనను జాతీయ అధ్యక్షుడిగా నియమించనున్నట్టు వస్తున్న ప్రచారాలను ఖండిస్తూ.. ఇప్పటి వరకు దక్షిణాదిలో కేవలం రెండు రాష్ట్రాలకే అధ్యక్షుల నియామకం జరిగిందని, నన్ను జాతీయ అధ్యక్షుడిగా చేయాలన్న ప్రతిపాదన ఎక్కడా లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశం ప్రస్తుతం పార్టీలో కానీ, కేంద్ర ప్రభుత్వంలో కానీ చర్చలో లేదని తెలిపారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలను అనుసరించి భవిష్యత్తులో బీజేపీ తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో భూముల అమ్మకం ద్వారా ప్రభుత్వాన్ని నడపాలనే పద్ధతికి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. భూములు అమ్మడం, అప్పులు చేయడం, మద్యం అమ్మకాలు... ఇవే ఆదాయం సమకూర్చే మార్గాలుగా ఈ ప్రభుత్వం భావిస్తోంది అంటూ ఆరోపించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే పని చేసింది.. ఇప్పుడు కాంగ్రెస్ అదే మార్గాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని చెట్ల కొట్టడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఒక్క చెట్టును కొట్టాలన్నా అనుమతి అవసరం. కానీ, ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘిస్తూ హెచ్‌సీయు భూముల్లో చెట్లను కూల్చుతోందని విమర్శించారు. అటవీ ప్రాంతంలో జంతువులు ఉన్నాయని, తాను ట్విట్టర్‌లో పెట్టిన పోస్ట్‌కు కట్టు-బడి ఉన్నానని స్పష్టం చేశారు. అక్కడ జంతువులు ఉంది అవాస్తవమా అంటూ ప్రశ్నించారు. అలాగే, ఈ భూముల వెనుక మా ఎంపీ ఉంటే ఆ పేరును బయటపెట్టండని, ఎవరు అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే అంటూ ఘాటుగా వ్యాఖ్యా నించారు. యూనివర్సిటీ- అధికారులు కూడా ఈ భూములు హెచ్‌సీయువే అని స్పష్టంగా చెబుతున్నారని గుర్తు చేశారు. అలాగే హైదారాబాద్ లో ఉన్న పలు బిల్డింగ్ ల్లో ఎ÷-లాట్ లు ఖాళీగా ఉన్నాయి.. వాటిని కొనేందుకు ఎవరు రావడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేము పోరాడడం లేదు.. అక్కడ గ్రీనరీ అలానే ఉండాలని మా పోరాటమని అన్నారు. ఐఈ÷ఖ లో జంతువులు ఉన్న మాట వాస్తవం.. నా మీద కేసు పెట్టిన ఎదుర్కోవడానికి నేను సిద్ధం, ఎప్పుడు ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందని అన్నారు. వేరే రాష్ట్రం వ్యాపారస్తులు ఇక్కడ ప్రభుత్వాన్ని కూల్చుతారు వారికేమి పని.. వక్ఫ్ చట్టం పై ఆందోళన చేయడం అంటే భూ బకాసురులకు వత్తాసు పలికినట్టే అని వ్యాఖ్యానించారు. ఎంఐఎం కబ్జా దారులను పోగేసి ఆందోళన చేస్తుందని, కాకపోతే పేద ముస్లిములకు మాత్రమే ఆందోళన చేసే హక్కు వాళ్లకు ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం వల్ల ఏమీ నష్టమో చెప్పాలని.. ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరగదని, వక్ఫ్ చట్టం పైన మేము మా మేనిఫెస్టోలో పెట్టే చేశామని తెలిపారు. ఇక్కడ కూడా మైనారిటీ- వర్గాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ఈ నెల 17న సన్నాహక సమావేశం ఉందని తెలిపారు. ముస్లిం ప్రార్థన మందిరాలకు వక్ఫ్ బోర్డు కు సంబంధం లేదని, మజీదుల ద్వారా వచ్చే ఆదాయంతో వక్ఫ్ బోర్డు నడవదన్నారు. ఎన్నికలన్నప్పుడు ఓటర్లందరిను కలుస్తాం.. బిఆర్ఎస్, కాంగ్రెస్, ఈ పార్టీ.. ఆ పార్టీ.. అని కాకుండా అందరినీ ఓట్లు- అడుగుతామని అన్నారు. ఏ పార్టీ అధికారం లోకి వచ్చిన ఆ పార్టీ పక్కన చేరి ఎంఐఎం ప్రాభల్యం పెంచుకుంటు-ందని అన్నారు. ఎంఐఎం చిన్నగా న్యూ సిటీ- లోకి వచ్చిందని.. ఎర్రగడ్డ, బోరబండ లాంటి చోట్ల ఆ పార్టీ కార్పొరేటర్ లు గెలిచారని అన్నారు. భవిష్యత్ లో హైదారాబాద్ ను కబ్జా చేసే ప్రయత్నం ఆ పార్టీ చేస్తుందని కీలక వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ లకి బిగ్ బాస్ అసదుద్దీన్ ఒవైసీ అని కామెంట్ చేసారు.

## మహాత్మా జ్యోతిబా పూలే, మాత సావిత్రి భాయి పూలే దంపతులు మానవతా మూర్తులు

గౌడ్ మాట్లాడుతూ.. పూలే సేవలను కొనియాడారు, బీసీ జేఏసీ కో ఆర్డినేషన్ చైర్మన్ సుధాగాని హరి శంకర్ గౌడ్ మాట్లాడుతు నేటి తరం పూలే మార్గాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు.. జాతీయ బీసీ మేధావుల ఫోరమ్ అధ్యక్షులు,ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ.. మానవ జాతి ఉన్నత వారకు పూలే దంపతుల పూజింప బడుతారన్నారు.. రామన్ గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,మేకపోతుల నరేందర్ గౌడ్ మహాత్మా పూలే దంపతుల విగ్రహాల వ్యవస్థాపక చైర్మన్,అయిలి వెంకన్న గౌడ్ రాష్ట్ర కన్వీనర్ గౌడ సంఘాల సమన్వయ కమిటీ, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాట్లాడుతు.. ప్రతి మండలం కేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే, మాత సావిత్రి భాయి పూలే విగ్రహాలను నెలకొల్పుతామని పేర్కొన్నారు, మేకపోతుల వెంకట రమణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎలికట్టె విజయ్ కుమార్ గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ,అంబల నారాయణ గౌడ్ గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షులు , దుర్గయ్య గౌడ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు, నగేష్ గౌడ్ రాష్ట్ర బీసీ నాయకులు, బడేసాబ్ ఎంబిసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు,,,ఎర్ర శ్రీహరి గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,బీసీ సంక్షేమ సంఘం, నగిరి ప్రవీణ్ కుమార్ ఓయూ జాక్, బొంగు వెంకటేష్ గౌడ్ బీసీ మేధావుల ఫోరం వైస్ చైర్మన్,శివ కుమార్ అధికార ప్రతినిధి బీసీ సంక్షేమ సంఘం,గిరగాని భిక్షపతి గౌడ్, పేదల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు,తాళ్ళపల్లి శేఖర్ గౌడ్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు,

# ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ

మంత్రి అన్నారు. ప్రస్తుతం బలమైన ప్రభుత్వ ప్రైవేటు-భాగస్వామ్యంతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. అమెజాన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటు-ంది. పెట్టు-బడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని శ్రీధర్‌బాబు అన్నారు. అమెరికాకు చెందిన ఫైనాన్షియల్ సేవల దిగ్గజం సిటిజన్ ఫైనాన్షియల్ గ్రూప్ తాజాగా హైదరాబాదులో టెక్ కంపెనీ కాగ్నిజెంట్ తో జతకట్టి తన గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాదులోని కాగ్నిజెంట్ క్యాంపస్ లోపలే ఉంటుందని కంపెనీ పేర్కొంది. వాస్తవానికి ఇదొక ఇన్నోవేషన్ హబ్ మాదిరిగా వర్క్ చేస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ జీసీసీ ఏర్పాటు- ద్వారా మార్చి 2026 నాటికి కొత్తగా 1000 హై వ్యాల్యూ కలిగిన ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని వెల్లడించాయి. ఈ సెంటర్ బ్యాంకింగ్ సంస్థలకు రానున్న కాలంలో థర్డ్ పార్టీ సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని జీసీసీ పేర్కొంది. హైదరాబాద్‌లో దాదాపు 57,000 మంది సిబ్బందిని కలిగి ఉన్న కాగ్నిజెంట్, దాని ప్లాట్‌ఫార్మ్‌లైన న్యూరో, ఎ÷-లోసోర్స్‌లను ఉపయోగించి సిటిజన్స్ జీసీసీకి అదనపు శక్తిని ఇవ్వనుంది. అలాగే క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ-, ఇంటెలిజెంట్ ఆటోమేషన్ రంగాల్లో భవిష్యత్తు అవసరాలకు తగిన ఉత్పత్తులను కంపెనీ అందించనుంది. అమెరికా చెందిన సిటిజన్స్ సంస్థ, కాగ్నిజెంట్ చేతులు కలపటంపై తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగంలో ఆవిష్కరణలకు ప్రపంచ ప్రధాన కార్యాలయంగా మారిందని కాగ్నిజెంట్ ప్రతినిధి నాగేశ్వర్ చెరుకుపల్లి అన్నారు. పైగా అనేక జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ డెస్టినేషన్ గా మారింది. ప్రస్తుతం హైదరాబాదులో అత్యుత్తమ టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటమే ప్రపంచ దేశాలకు చెందిన దిగ్గజ కంపెనీలను ఆకట్టుకోవటానికి కారణంగా నిపుణులు చెబుతున్నారు.

# పింక్‌బుక్‌లో బెదిరింపు నేతల పేర్లు

(మొదటి పేజీ తరువాయి..)

కామారెడ్డి,ఏప్రిల్15( వెలుతురు):

ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం.. బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో కవిత పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు- తెలిసింది. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు ఇక్కడ అని ఎమ్మెల్సీ కవిత తేల్చిచెప్పారు. మాట తప్పడం... మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు- అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టు-కున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలని కవిత విమర్శించారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలి. తెలంగాణ గడ్డ మీద అగ్గిపెట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నలిగిపోయిన ఆత్మగౌరవాన్ని రెపరెపలాడించింది బీఆర్ఎస్ పార్టీ. స్వతంత్ర దేశంలో లక్ష్యాన్ని చేరిన ఏకైక పోరాటం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమం మాత్రం. వీరులు మాత్రమే లక్ష్యం చేరే వరకు పోరాటం చేస్తారు... అది కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమైంది. ప్రజాస్వామ్య పంథాను నమ్ముకొని హింసాయుతంగా పోరాటం చేసి తెలంగాణ సాధించాము. త్యాగాలతో తెలంగాణ కోసం కేసీఆర్ మొదటి అడుగు వేశారు. కేంద్ర మంత్రి పదవిని సైతం గడ్డిపోచలా వదిలేసిన ఘనత కేసీఆర్‌ది. ఎవరో భిక్షపెడితేనో, ఎవరో దయదలచి ఇస్తే తెలంగాణ రాలేదు. కేసీఆర్ త్యాగం, కృషి, పోరాటపటిమ వల్ల తెలంగాణ సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో కటిక చీకటి వస్తుంది, నక్సలైట్ల రాజ్యం వస్తుందని అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత వెలుగు జిలుగుల తెలంగాణను తయారు చేసుకున్నాం. కోటి ఎకరాల మాగాణను తయారు చేసుకున్నాం. సాగు నీళ్ల పన్ను మాఫీ చేసిన వ్యక్తి కేసీఆర్. రైతు బంధు, రైతు బీమా వంటి అనేక కార్యక్రమాలను కేసీఆర్ చేపట్టారని వివరించారు. చివరి గింజ వరకు వడ్లు కొని కేసీఆర్ చరిత్ర సృష్టించారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు- అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం అదే పార్టీ అని కవిత విమర్శించారు. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి ఛార్జ్‌షీట్

పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై ఏప్రిల్ 25న దిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనుంది. మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. హరియాణాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటు-చేసుకోవడం గమనార్హం. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీ-వల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. తాజాగా దిల్లీ ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. తదుపరి విచారణను కొనసాగిస్తున్నట్లు- తెలిపింది. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడమనేది చట్టబద్ధమైన పాలన ముసుగులో ప్రభుత్వ ప్రాయోజిత నేరంగా కాంగ్రెస్ పేర్కొంది. తమ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర నేతలపై ఛార్జిషీట్ దాఖలు చేయడం.. ప్రధాని, హోంమంత్రి ప్రతీకార రాజకీయాలు, బెదిరింపులకు పాల్పడటం తప్ప మరొకటి కాదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ, నాయకత్వం మౌనంగా ఉండబోవన్న ఆయన.. 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కాంగ్రెస్ అగ్రనేతల పేర్లతో ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడంపై ఆ పార్టీ ఎంపీ అఖిలేశ్ ప్రసాద్ సింగ్ స్పందించారు. ప్రతీకారంతో, విపక్ష నేతలను ఉచ్చులో పడేసేందుకు భాజపా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కానీ, ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ భయపడదన్నారు.

## నోవాటెల్ హోటల్ లిఫ్ట్‌లో టెక్నికల్ సమస్య

- ఓవర్‌లోడ్‌తో కిందకు దిగిపోయిన లిఫ్ట్
- లిఫ్ట్‌లో సిఎం తదితరులతో ఓవర్‌లోడ్
- ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న సిబ్బంది

హైదరాబాద్,ఏప్రిల్15( వెలుతురు):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో రేవంత్ రెడ్డి ఎక్కిన లిఫ్ట్ ఓవర్‌లోడ్ కారణంగా సాంకేతకి సమస్య ఏర్పడింది. ఓవర్ వెయిట్‌తో ఉండాల్సిన ఎత్తు కంటే లిఫ్ట్ లోపలికి దిగిపోయింది. సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తు కంటే లోపలికి దిగిపోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, సెక్యూరిటీ- సిబ్బంది లిఫ్ట్‌ను ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో సీఎంను కిందకు పంపించారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి సహా అధికారులు, సిబ్బంది ఆందోళన చెందారు. ఏం జరుగుతుందో అర్థంకాక కాసేపు అయోమయానికి గురయ్యారు. అనంతరం పెద్ద ప్రమాదం ఏమీ లేదని తెలుసుకుని లిఫ్ట్ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం మరో లిఫ్ట్‌లో ముఖ్యమంత్రిని అధికారులు తరలించారు. సీఎల్పీ సమావేశం సందర్భం హోటల్ వద్దకు సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ విప్‌లు, కొంతమంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి ఆహ్వానం పలికి హోటల్ లోపలికి తీసుకెళ్లారు. అయితే పైఅంతస్తుకు వెళ్లే క్రమంలో 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో రేవంత్ రెడ్డితోపాటు 13 మంది ఎక్కారు. దీంతో లిఫ్ట్ ఉండాల్సిన స్థానం కంటే కిందికి కుంగిపోయింది. వెంటనే అలారం మోగడంతో అధికారులు, హోటల్ సిబ్బంది అప్రమత్తం అయ్యారు. హుటాహుటిన లిఫ్ట్ వద్దకు పరుగులు పెట్టారు. అనంతరం సీఎం సహా అందరినీ లిఫ్ట్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అనంతరం మరో లిఫ్ట్‌లో సమావేశం జరుగుతున్న సెకండ్ ఫ్లోర్‌కు తీసుకెళ్లారు. రేవంత్ రెడ్డి ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో ఎమ్మెల్యేలు, అధికారులు, హోటల్ సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది.

# ESDPల కింద నైపుణ్యం కలిగిన యువత కోసం ni-msme ఉద్యోగ మేళా

- అన్ని రంగాల ఉద్యోగార్థులకు

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**
మైక్రో, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (MSME), భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని స్వయం పాలిత సంస్థ అయిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మిడియం ఎంటర్‌ప్రైజెస్ (ni-msme), 2025 ఏప్రిల్ 16న ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు యూసుఫ్‌గూడలోని తమ క్యాంపస్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని అసిస్టెన్స్ టు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ (ATI) స్కీమ్ కింద నిర్వహించే ఉద్యమశీలత మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల (ESDPs) భాగంగా నిర్వహిస్తున్నారు. దీని ముఖ్య ఉద్దేశ్యం నైపుణ్యం పొందిన యువతకు అర్హత కలిగిన ఉద్యోగ అవకాశాలను కల్పించడమే. ఈ ఉద్యోగ మేళా ప్రత్యేకత ఏమిటంటే, ఇది కేవలం ESDP శిక్షణార్థులకు మాత్రమే కాకుండా అన్ని రంగాల నిరుద్యోగ యువతకు కూడా అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో దిగ్గజ పరిశ్రమలకు చెందిన 22 ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. వీటిలో: సమాచారం సాంకేతికత (IT) మరియు IT ఎనేబుల్డ్ సర్వీసులు (ITeS) బ్యూటీ & వెల్నెస్ ఆహార ఉత్పత్తులు , వస్త్రాలు & దుస్తులు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ & ఇన్సూరెన్స్ (BFSI) మీడియా & వినోదం ఈ సంస్థలు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మరియు NSQF ప్రమాణాలకు అనుగుణమైన నైపుణ్యాలతో కూడిన వివిధ ఉద్యోగాల కోసం నియామకాలు చేస్తాయి. ఈ వేడుకలో శిక్షణ పొందిన అభ్యర్థులు, తాజా పట్టభద్రులు, ఉద్యోగార్థులు మరియు పరిశ్రమ నిపుణుల నుండి ఉత్సాహభరితమైన పాల్గొనడం కనిపించనుంది. ఇది ఉద్యమశీలతను, ఉపాధిని మరియు MSME అభివృద్ధిని ప్రోత్సహించడంలో ni-msme పాత్రను మరోసారి నిరూపిస్తుంది. వివరాలకు సంప్రదించండి: వి. స్వప్న, స్కిల్ ట్రైనింగ్స్ ఇన్‌చార్జ్, ఫోన్: 040–23633218/61

## జపాన్ దేశ పర్యటనకు సీఎం ప్రతినిధి బృందం

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 15:**



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జపాన్ పర్యటనకు బయలు దేరుతోంది. ఈ నెల 16 వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు ఈ బృంద పర్యటన కొనసాగుతుంది. టోక్యో, మౌంట్ ఫ్యూజీ, ఒసాకా, హిరోషిమా తదితర నగరాల్లో పర్యటన ముఖ్య మంత్రి పర్యటన సాగుతుంది. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక సాంకేతిక రంగాల్లో సహకారం ప్రధాన ఉద్దేశంగా సాగుతున్న ఈ పర్యటనలో పలు సంస్థలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం చర్చలు జరుపుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన అధికారుల బృందం ముఖ్యమంత్రి పర్యటనలో ఉంటారు. జపాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, ప్రతినిధులతో ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమవుతుంది. 'ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో – 2025' లో తెలంగాణ పెవీలియన్‌ను ప్రారంభిస్తారు.

## రాష్ట్రంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

- అనేకకార్యక్రమాలు అమలుచేసి చూపాం
- సిఎల్‌పి సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క



**హైదరాబాద్,ఏప్రిల్15( వెలుతురు):**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తోందని, లబ్ధిదారులు ఈ పథకాలను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ (సీఎల్పీ) సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం కోసం చేపట్టిన చరిత్రాత్మక నిర్ణయాల గురించి వివరించారు. 21 వేల కోట్లతో రైతు రుణమాఫీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, 56 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకం, 8 వేల కోట్లతో యువతకు అవకాశాలు, సన్న ధాన్యంపై రూ.500 బోనస్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకొస్తున్నాయని అన్నారు. సంక్షేమం ఒక ఎత్తైతే, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చరిత్రాత్మక నిర్ణయాలు మరో ఎత్తని ఆయన పేర్కొన్నారు. 'ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన వంటి అంశాలను మేము పకడ్బందీగా పూర్తి చేశాం. ఈ రెండు అంశాలు గత దశాబ్దాలుగా ఎందరో గొప్ప నాయకులు సాధించలేనివి. మన ప్రభుత్వం ధైర్యంగా, అందరితో చర్చించి, పారదర్శకంగా ఈ లక్ష్యాలను నెరవేర్చిందని విక్రమార్క గర్వంగా చెప్పారు. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని, ఇప్పటికే బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ మొదలైందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును ఆమోదించాం. ఇది సామాజిక న్యాయం దిశగా కాంగ్రెస్ చేసిన గొప్ప అడుగని ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో భూసంస్కరణల వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని, అందుకే దేశంలో సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిందని విక్రమార్క గుర్తు చేశారు. అయితే, బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలు గతంలో పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలకు రుచించడం లేదని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయాలు వారి అస్తిత్వానికే సవాల్ విసురుతాయి. అందుకే బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్రలు చేస్తూ, ఉన్నది లేనట్టు–, లేనిది ఉన్నట్టు–చిత్రీకరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. కంచ గచ్చిబౌలి వివాదంపై కూడా ఆయన స్పందిస్తూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఆర్టిఫిషియల్ ఇం–టె–లిజెన్స్‌ను ఉపయోగించి అసత్య ప్రచారం చేస్తున్నాయి. వారు ఏనుగులు, పులులు తిరుగుతున్నాయని చెప్పినా, ప్రజలు సత్యాన్ని గుర్తిస్తారని వ్యాఖ్యానించారు. చివరగా, బహుజన వర్గాలను చైతన్యం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ కుల సర్వే మీ కోసం, మీ హక్కుల కోసం కాంగ్రెస్ చేసింది. మాతో కలిసి నడవండి, బహుజన శక్తిని చాటి చెప్పండని ఆయన కోరారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ. 20.19 కోట్లు విడుదల

- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**
బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ. 20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు 12 మంది లబ్ధిదారులకు మంగళవారం నాడు లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు.




**చేరువెనుక అశ్విని భర్త సురేష్**
**కప్పహాడ్ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా**

మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్ధిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్ ఎఫ్ టి కి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.




ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని ధర్మ తండాలో ఇందిరమ్మ ఇల్లు బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న నూనావత్ స్వప్న కుటుంబం




ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చినగోపతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న లింగాల నీలిమ కుటుంబం

# కాళేశ్వరం సరస్వతి పుష్కరాల యాప్, వెబ్ పోర్టల్ ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు

### పాల్గొన్న ఉన్నతాధికారులు శైలజా రామయ్యర్, శ్రీధర్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**
2025 మే 15 నుండి 26 వరకు తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరగనున్న 'సరస్వతీ పుష్కరాలు' కోసం, అందుకు సంబంధించిన ఏర్పాట్ల వివరాలు భక్తులకి సమగ్రంగా తెలిపేందుకు వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, ప్రరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హైదరాబాదులోని తెలంగాణ సెక్రటేరియట్ లో ప్రారంభించారు. పుష్కరాలకి




వచ్చే భక్తులు, యాత్రికులకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు వీటిని ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎండోమెంట్స్) శైలజా రామయ్యర్(ఐఏఎస్), కమిషనర్ శ్రీధర్(ఐఏఎస్), ధార్మిక పరిషత్ అడ్వైజర్ గోవింద హరి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఆలయ ఈవో మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు. 'సరస్వతీ పుష్కరాలు' పండుగకు స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టినట్టు మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో సరస్వతి పుష్కరాలు నిర్వహించామని, ఇప్పుడు కూడా అవకాశం మాకు రావడం ఆ భగవంతుడి ఆశీస్సులున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ...తమ ప్రభుత్వం దేవాలయాల విషయంలో చాలా క్రీయాశీలకంగా పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వం దేవాదాయ శాఖ సంబంధిత వ్యవహారాలను పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. తాను దేవాదాయ శాఖ మంత్రి అయ్యాక పలు అంశాన్ని, ప్రతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్టు చెప్పారు. సమ్మక్క సారక్క జాతర, కొమురవెల్లి కళ్యాణం, భద్రాచలం కళ్యాణం తదితర అన్నీ ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు వివరించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చేసినట్టు వివరించారు. యాదగిరి టెంపుల్ కు పాలక మండలి చట్ట సవరణ చేపట్టినట్టు చెప్పారు. అయితే, ఈ సరస్వతీ పుష్కరాలకు రోజుకు 50 వేల నుంచి లక్ష దాకా వస్తారని అంచనా వేస్తున్నట్టు వివరించారు. అక్కడ 17 అడుగుల రాతి సరస్వతి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చలువ పందిళ్ళ, శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. వెబ్ సైట్, యాప్ ద్వారా అన్ని వివరాలు తెలుపుతామని చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అమలు పరిచిన ఫ్రీం బస్ పథకం ద్వారా దేవాదాయ శాఖకు లాభం సముకూరినట్టు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తు సంఖ్య టెంపుల్ లకు వస్తున్నట్టు కొండా సురేఖ చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు.

ఉత్తరాన ప్రయాగ వద్ద, దక్షిణ భారతంలో కేవలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. పవిత్ర సరస్వతీ పుష్కరస్థానం చేసిన వారికి సమస్త పాపములు తొలగిపోవునని భక్తుల ప్రగాఢ



విశ్వాసం.
జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహించు చున్నందున కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో గతంలో తేది 30.05.2013 నుండి 10.06.2013 వరకు కాళేశ్వరం లో సరస్వతి నదికి పుష్కరములు నిర్వహించడం జరిగినది ప్రస్తుతం తేదీ 15.05.2025 నుండి 26.05.2025 వరకు "12" రోజులు సరస్వతి నది పుష్కరాలు నిర్వహించబడుచున్నవి.
సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు ఒక పీఠాధిపతి పుష్కర స్నానం చేయనున్నారు. పుష్కర ప్రారంభం మే 15 రోజున శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుండి శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారు. మూడవ రోజు మే 17 న తుని తపోవనం పీఠాదిపతి శ్రీ శ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి గారు మే18, పుష్పగిరి పీఠాదిపతి శ్రీ శ్రీ శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి వారు, మే 19 న నాసిక్ త్రయంబకేశ్వర్ శ్రీ శ్రీ శ్రీ మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్ గారు మరియు మే 23 న హంపి విరుపాక్ష పీఠాదిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి గారు పుష్కర స్నానం ఆచరిస్తారు.
సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేల నుడి లక్ష వరకు భక్తులు వచ్చి పుష్కర స్నానం చేసి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్ల దర్శనం చేసుకుంటారని అంచనా వేసి తెలంగాణ ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.35 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినది.
పుష్కరాల నిధులతో ప్రస్తుతం ఉన్న ఘాట్ యొక్క వెడెల్పు పెంచుతూ అధునాతనంగా అన్ని సౌకర్యాలతో నూతన ఘాట్ నిర్మాణం చేసి దానిని సరస్వతి ఘాట్ గా నామకరణం చేయుటకు ఏర్పాట్లు జరుగుచున్నవి.
సరస్వతి పుష్కర ఘాట్ పైన 17 అడుగుల ఏకశిల సరస్వతి అమ్మవారి రాతి విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుంది. అలాగే రెండు ఘాట్ల వద్ద స్వాగత తోరణంల నిర్మాణం కూడా జరుగుతుంది.
పుష్కరాలకు వచ్చే భక్తుల వసతి కొరకు దేవస్థానం వద్ద 100 రూముల వసతి గృహం, డార్మేటరి భవనం, నూతనముగా అందుబాటులోనికి తీసుకొనిరావడం జరిగింది. అంతేకాకుండా ఘాట్ వద్ద 100 గదులతో కూడిన టెంట్ సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుంది.
భక్తుల స్నానాల కొరకు షవర్లు ఏర్పాటు, దుస్తులు మార్చుకొనే గదులు, వేసవి కావడముతో దేవాలయం చుట్టూ మరియు ఘాట్ల వద్ద చలువ పందిర్లు, OHSR వాటర్ ట్యాంకులు నిర్మించి త్రాగు నీటి ఏర్పాటు, దేవాలయం చుట్టూ సి.సి. రోడ్ల నిర్మాణం, పిండ ప్రధాన మండపం, శాశ్వత మారుగుదొడ్లు, స్నానం గదుల నిర్మాణం తదితర పనులు చేపట్టడం జరిగింది.
పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కొరకు రాష్ట్రము లోని వివిధ ప్రాంతాల నుండి. కాళేశ్వరమునకు ఆర్..టి.సి యాజమాన్యం ప్రతేక బస్సులు నడుపుటకు నిర్ణయించినది. మరియు కాళేశ్వరము లో వివిధ ప్రాంతల వద్ద పార్కింగ్ స్థలాలను గుర్తించి చలువ పందిర్లు, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరుగుచున్నది.
శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద భక్తులకు సరిపోను విధముగా లడ్డు, పులిహోర ప్రసాదములను అందుబాటులో ఉంచడం జరుగుతుంది. అంతేకాకుండా భక్తులకు అన్నదానం మరియు ఉచిత ప్రసాదం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది.
అదేవిధముగా త్రివేణి సంగమం వద్ద పుష్కరాలు జరిగే పన్నెండు రోజులు సరస్వతి ఘాట్ వద్ద కాశీ నుండి వచ్చే పురోహితులచే ప్రత్యేక హారతి కార్యక్రమం నిర్వహిచడం జరుగుతుంది
దేవాలయము వద్ద పుష్కరాలు జరిగే 12 రోజులు ప్రత్యేక హెూమాలు, సాంస్కృతిక కార్యక్రమాల కొరకు ఏర్పాట్లు చేయడం జరిగింది.
పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వద్ద , పుష్కర ఘాట్ ల వద్ద బస్టాండ్ మరియు పార్కింగ్ స్థలాల వద్ద డాక్టర్లు , వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండే విధముగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది.
పుష్కరాల పనులు అన్నీ ప్రారంభమై చురుగ్గా జరుగుచున్నాయి. జిల్లా కలెక్టర్ గారి అధ్వర్యంలో జిల్లా యంత్రాగం మొత్తం పుష్కర ఏర్పాట్ల పనులలో నిమగ్నమై ఉన్నారు. పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో అన్ని శాఖల అధికారులు పనిచేస్తున్నారు.

## సంపాదకీయం..

# రష్యా బాటలోనే.. ట్రంప్ యుద్ధం !

ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ముగియనే లేదు...ట్రంప్ రూపంలో మరో యుద్ధం మొదలయ్యింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఇది ఇంకా కొనసాగు తుండగానే గాజాపై ఇజ్రాయిల్ దాడులు కూడా ప్రభావం చూపాయి. ఇలా అంతర్జాతీయంగా జరుగుతున్న దాడుల కారణంగా ప్రపంచ మార్కెట్లు కుదుపునకు గురవుతున్నాయి.

తాజాగా ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే మరో రకమైన యుద్ధానికి తెరతీసారు. సుంకాలతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థపై దాడి మొదలు పెట్టారు. ఇది తమకూ వర్తిస్తుందని గుర్తించడం లేదు. అందుకే చైనా ధీటుగానే స్పందిస్తోంది. కొన్ని వస్తువులపై అమెరికాకు పోటీగా సుంకాలు విధించడంతో పాటు, మరికొన్న వస్తువులను అమెరికాకు సరఫరా చేయడం ఆపేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడితో ఒక్క ఉక్రెయినే కాకుండా రష్యా కూడా కోలుకోలేని విధంగా దెబ్బతింది. అంతేగాకుండా యుద్ధానికి దిగితే విరమించుకోవడం అంత ఈజీ కాదని తెలిసి వచ్చింది. ఈవ్యవహారం సమసిపోక ముందే ఇప్పుడు ట్రంప్ తీరుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక విధాలుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అంతకుమించి అమెరికాలో కూడా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతు న్నారు. రోడ్డెక్కి ధర్నలు చేస్తున్నారు. ట్రంప్ విధానాలను తూర్పారా బడుతున్నారు. అయినా ట్రంప్‌లో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించడం లేదు. ప్రపంచ దేశాలు అన్నిటినీ ట్రంప్ వచ్చీరాగానే ఆందోళనలో పడేశాడు. అమెరికాలో చదువుకుంటున్న వారిని, అక్కడికి వెళ్లి ఉంటున్న వారిలో సైతం కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ప్రపంచ దేశాల ప్రజలు ట్రంప్ చర్యలు చూసి నవ్వుకుంటున్నారు. సకల దేశాలపై విధించిన సుంకాల వివరాలను ట్రంప్ ప్రకటించారు. కొన్ని దేశాల విషయంలో మాత్రం కొంత ఉదారతను చూపారు. నిరుద్యోగం భారీగా పెరగడం, ద్రవ్యోల్బణం కట్టడి చేయడం లక్ష్యంగా సమస్యలను తొలగిం చేందుకు ట్రంప్ సంకల్పించారు. అమెరికా మహా సంపన్న దేశం. మహాశక్తిమంతమైన దేశం. వైజ్ఞానిక, సాంకేతిక నవకల్పనలు అన్నీ ఆ దేశ ప్రతిభా ఫలాలే. ప్రపంచ అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ప్రయోగ శాలలు, ఉత్కృష్ట కంపెనీలు అమెరికా లోనే ఉన్నాయి. అమెరికా డాలర్ రిజర్వ్ కరెన్సీగా ప్రపంచ దేశాల ఆమోదం పొందింది. అమెరికా గ్రీన్ కార్డ్, అమెరికా పాస్‌పోర్ట్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందిని ఆకర్శిస్తోంది. ఉద్యోగం దొరికితే చాలు అక్కడే స్థిరపడి పోవాలనుకునే భారతీయులు ఎందరో. చైనా, ఇండియాతో సహా అనేక దేశాలు తమ విదేశ మారక ద్రవ్య నిల్వలలో అత్యధిక భాగాన్ని అమెరికా బాండ్ల రూపంలో భద్రపరచుకుంటున్నాయి. ప్రపంచంలో ద్రవ్యలోటు లేని ఏకైక దేశం అమెరికాయే గనుక ఆ దేశ బాండ్లు తమకు ఆర్థిక భద్రత సమకూరుస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. దురదృష్ట వశాత్తు తమకు ఎలాంటి లబ్ధిని సమకూర్చడం లేదని ట్రంప్‌ను గెలిపించిన అమెరికా ప్రజలు భావిస్తున్నారు. ఆయన ఏ ఉద్దేశ్యంతో ఈ సుంకాల యుద్ధం మొదలు పెట్టారో కానీ...అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి గెలిచిన తరువాత డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, చర్యలు సంచలనం కలిగిస్తున్నాయి. వాటి పర్యవసానాలు సుదీర్ఘకాలం ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నాయి. దేశదేశాల నుంచి ప్రతిభావంతుల వలసలు అమెరికాకు నిలిచిపోతాయన్న ఆందోళనలను ట్రంప్ పట్టించుకోవడం లేదు. సరుకుల వాణిజ్యానికి గణనీయమైన విఘాతం కలుగుతుంది. సరఫరా చైన్ ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. ట్రంప్ విధానాల పర్యవసానాలను ఎదుర్కోవడంలో చాలా సంపన్న దేశాలు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ట్రంప్ ఏవో భ్రమలతో దబాయిస్తున్నారని అందరికీ అర్థమవుతుంది. అమెరికాలోకి దిగుమతి అవుతున్న సరుకులపై భారీ సుంకాలతో సంభవించే ధరల పెరుగుదలను అమెరికా ప్రజలు భరించలేరు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. లక్షలాది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమున్నది. ట్రంప్ చర్యల కారణంగా అక్కడ ప్రస్తుతం నిత్యావసర వస్తువులు ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితులను అమెరికా ప్రజలు సహించరు. అమెరికా ఫస్ట్ నినాదాన్ని స్వాగతిస్తూనే ట్రంప్ తీరును ఎండగడుతున్నారు. అమెరికన్లు కూడా ద్రవ్యోల్బణం తాకిడికి తీవ్రంగా గురవుతారు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా అన్ని పెద్ద నగరాలలోను వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పెరిగినప్పుడు ఈ ఆందోళనలు మరింత తీవ్రం కాక తప్పవు. అమెరికా ప్రజల ఆగ్రహావేశాలకు ట్రంప్ ఎలా ప్రతిస్పందిస్తారన్నది తెలియాల్సి ఉంది. అనవసరంగా తేనెతుట్టెను కదిపిన ట్రంప్, తనకూ పుతిన్‌కు పెద్దగా తేడా లేదని నిరూపించుకున్నారు. ఆధునిక యుద్ధాలు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తాయని అనుభవంలోకి వచ్చింది. అమెరికా బాండ్లపై వడ్డీ రేట్ల తీరుతెన్నులను ఆయన తప్పక పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ట్రంప్ సుంకాల దెబ్బను కొన్ని దేశాలు తీవ్రంగానే ప్రతిఘటిస్తున్నాయి. స్పందిస్తున్నాయి. ప్రతీకార సుంకాలను చైనా విధించింది. నీ బెదిరంపులను పట్టుకోబోమని తేల్చింది. కెనడా, యూరోప్ గట్టిగా ప్రతిఘటిస్తున్నాయి. సుంకాల సమరాన్ని అమెరికా అనివార్యం చేస్తే, చైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. రాజీ లేని పోరుకు బీజింగ్ సమాయత్తమై ఉన్నది. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంపై భారత్ ఆచితూచి అడుగేస్తోంది. మోదీ ప్రభుత్వం ఈ విషయమై జాగరూకతతో వ్యవహరించడం కూడా ముఖ్యమే. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో అందరూ సంతోషిస్తున్నారు. ఈ యుద్ధ విరామంతో, ఆయనను ఆర్థిక వివేకం కలిగి ఆలోచన చేస్తే ఆయనతో పాటు..ప్రపంచ దేశాలకు కూడా మంచిదే. కానీ ఇలాగే సుంకాల యుద్ధం కొనసాగిస్తే...దానికి ఫలితం కూడా అనుభవించక తప్పదు. ట్రంప్ విధానాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక మాంద్యం ముంచుకు వస్తోందని కూడా పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు.

# పర్యావరణ విధ్వంసం పట్టని ప్రజలు

- పెరుగుతున్న ఎండలతో జనం అవస్థలు
- మొక్కలు నాటాలన్న స్పృహ లేని సమాజం



**న్యూఢిల్లీ,ఏప్రిల్15( వెలుతురు):** పర్యావరణ విధ్వంసంపై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగి పోతున్నాడు. ఎండ వేడిమి, వడ గాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉత్తరభారతం అయితే క్రమంగా నిప్పుల కొలిమిలా తయారవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే.. ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుండ టంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగ నుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పరిశుభ్రత, పారిశు ద్ధ్యానికి పెద్దపీట వేయాల్సిఉంది. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో ఉండడం వల్లనే చెట్లను నరికేస్తున్నా చోద్యం చూశారు. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటి కాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. ఇకపోతే ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు ఇందుకు కారణ మయ్యాయి. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటి లే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికే స్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతు న్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు రెండు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవుతుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇంతకాలం మనం చేసిన విధ్వంసం కారణంగానే అన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వైరస్‌లు ఇకముందు కూడా దాడి చేస్తాయని గుర్తించాలి. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నద అలవాటు కావాలి. మొక్కలను పెంచడం మన బాధ్యత కావాలి.

# పెరుగుతున్న విద్యుత్ వినియోగం


### మండుటెండలతో అధిక వాడకం



**అమరావతి,ఏప్రిల్15( వెలుతురు):** ఎపిలో ఇటీవల విద్యుత్ కోతల కారణంగా ఉత్పత్తి కూడా తగ్గడంతో సరఫరాలో తీవ్రిబ్బందులు తప్పడం లేదు. నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సదరన్ డిస్కం పరిధిలోని జిల్లాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతేడాది మార్చితో పోల్చుకుంటే ఈ ఏడాది మార్చిలో యూనిట్లు అధికంగా వినియోగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఉష్ణోగ్రతలు పెరుగు తూ వచ్చాయి. మార్చిలో గణనీయంగగా పెరిగిన ఎండలతో ఇనియోగం ఆ మేరకు పెరిగింది. దీంతో ప్రజలు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం పెంచారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టే పనిలో ఉన్నారు. కోతలతో పాటు వినియోగం తగ్గించాలని సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ వినియోగం పెరిగినందున గ్రామీణ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచకపోతే సరఫరాలో ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. గతంలో ఎన్నడూ ఇంతగా వినియోగంలేదని విద్యుత్‌శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, సరఫరా బాగానే ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను తగినంతగా పెంచుకోకుంటే అవి తరచూ పేలిపోయే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర వేడి కొనసాగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల 40 డిగ్రీలకు చేరువవుతోంది. మరో రెండుమూడు రోజులు ఎండ తీవ్రత పెరగనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పుడే ఇలా ఉంటే ఇక మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ రోడ్లపై జనసంచారం కనిపించట్లేదు. భూగర్భజలాలు అడుగంటడం, భూతాపం పెరిగిపోవడంతో మంచినీటిసమస్య కూడా అధికం అవుతున్నది. బోర్లువేసి నీటిసమస్య కొంత తగ్గించాలని భావించినా ఎంత లోతుకు తవ్వినా నీళ్లు రాని పరిస్థితులు దాపురించాయి. వేసవి తాపంనుంచి ఉపశమనం పొందేందుకు ప్రభుత్వాలపరంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేవు. రాష్ట్రంలోని జలాశయాల్లో కూడా నీటివనరులు వేసవి తాపానికి ఆవిరి అవుతున్నాయి. మండుతున్న ఎండలు అటు శారీరక అస్వస్థతలు పెంచడంతో పాటు ప్రజల దాహార్తిని కూడా పెంచుతున్నాయి. ఉష్ణోగ్రతకు పక్షులు, పశువులు అసువులు బాస్తున్నాయి. ఉదయం పదిగంటలు దాటినప్పటినుంచీ రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రత ప్రభావం, వడగాడ్పులు తీవ్రతరం కావడంతో రాష్ట్రంలో రేడియేషన్ ప్రభావం కూడా పెరుగుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# నేడు సంఘసంస్కర్త వీరేశలింగం పంతులు జయంతి

### వితంతు పునర్వివాహం కోసం పోరాడిన మహానుభావుడు



**రాజమండ్రి,ఏప్రిల్15( వెలుతురు):** కందుకూరి వీరేశలింగం పంతులు ఎన్నో సామాజిక రుగ్మతలను నిలదీశారు. వాటిని అడ్డుకున్నారు. ప్రజల్లో ఉన్న మూఢాచారాలను నిలదీసారు. తనవంతుగా సంస్కరణలతో ముందుకు సాగారు. వింతతు వివాహాలను ప్రోత్సహించి సమజాంలో ఆడపిల్లలకు రోణగా నిలిచారు. వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. వీరి పూర్వీకులు ఇప్పటి ప్రకాశం జిల్లా లోని కందుకూరు గ్రామం నుండి రాజమండ్రికి వలస వెళ్ళడం వలన వారికి ఈ ఇంటి పేరు స్థిరపడిపోయింది. ఆయన సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహితీ వ్యాసారంగంలో ఎక్కువగా కృషి చేసాడు. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడుగా ప్రసిద్ధి. వీరేశలింగం స్త్రీవిద్యకై ఉద్యమించి, ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించాడు. మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాడు కూడా. అంటరాని కులాలకు చెందిన పిల్లలను కూడా చేర్చుకుని మిగతా పిల్లలతో కలిపి కూర్చోబెట్టేవాడు. వారికి ఉచితంగా చదువు చెప్పడంతో పాటు పుస్తకాలు, పలకా బలపాలు కొనిచ్చేవాడు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని ప్రచారం చేయటమే కాకుండా ఎన్ని కష్టాలెదురైన ఆచరణలో పెట్టాడు. వీరేశలింగానికి నాలుగేళ్ళ వయసులో తండ్రి చనిపోయాడు. పెదతండ్రి, నాయనమ్మల పెంపకంలో అల్లారుముద్దుగా పెరిగాడు. ఐదో యేట బడిలో చేరి, బాలరామాయణం, ఆంధ్ర నామ సంగ్రహం, అమరం, రుక్మిణీ కళ్యాణం, సుమతీ శతకం, కృష్ణ శతకం మొదలైనవి నేర్చుకున్నాడు. పన్నెండో యేట రాజమండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు చదువులో చేరాడు. చిన్నప్పటినుండి, అన్ని తరగతులలోనూ, ప్రథమ శ్రేణిలోనే ఉండేవాడు. తన పదమూడో యేట బాపమ్మ (కందుకూరి రాజ్యలక్ష్మమ్మ) అనే ఎనిమిదేళ్ళ అమ్మాయితో బాల్యవివాహ మయింది. పెరిగి పెద్దయ్యాక వీరేశలింగం ఇటువంటి దురాచారాల నిర్మూలనకే కృషి చేసాడు. చదువుకునే రోజుల్లో కేశుబ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు. విగ్రహారాధన, పూజలు మొదలైన వాటి మీద నమ్మకం తగ్గడమే కాక, దయ్యాలు, భూతాలు లేవనే అభిప్రాయానికి వచ్చాడు. ప్రజలకు అది నిరూపించడానికి అర్ధరాత్రి శ్మశానానికి వెళ్ళేవాడు. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతో పాటు, సంఘ సంస్కరణ భావాలను బోధించాడు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చెయ్యడానికి 1874 అక్టోబరులో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించాడు. ఆంధ్ర దేశంలో బ్రహ్మసమాజం స్థాపించాడు. యువజన సంఘాల స్థాపన కూడా వీరేశలింగం తోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేసాడు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పనిచేసాడు. ఆయన 130 కి పైగా గ్రంథాలు వ్రాసాడు. అన్ని గ్రంథాలు వ్రాసిన వారు తెలుగులో అరుదు. రాజశేఖర చరిత్ర అనే నవల, సత్యరాజా పూర్వ దేశయాత్రలు ఆయన రచనలలో ప్రముఖమైనవి. అనేక ఇంగ్లీషు, సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. బడి పిల్లల కొరకు వాచకాలు వ్రాసాడు. స్వీయ చరిత్ర వ్రాసాడు. ఆంధ్ర కవుల చరిత్రను కూడా ప్రచురించాడు.

## ఈ నెల 21 న తెలంగాణ ఉద్యమ కారుల ప్లీనరీ

- సీతాఫల్ మండి లో జరుగనున్న ప్లీనరీ పోస్టర్ల ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి




(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో,ఏప్రిల్ 15:**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో ఏప్రిల్ 21వ తేదీన సికింద్రాబాద్ సీతాఫల్‌మండి జి.హెచ్.ఎం.సి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ప్లీనరీ సమావేశానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ ను ఎల్బీనగర్ టిఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చేశారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి "మీ పోరాట పటిమ ప్రశంసనీయము. మీరు లేవనెత్తిన న్యాయమైన అంశాన్ని అసెంబ్లీలో చర్చకు తీసుకురావడం కోసం ప్రయత్నిస్తాను" అని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్ గౌడ్, దక్షిణ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ దుగ్గాణి శ్యామల, తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు అందేకార్ బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.



**కూకట్ పల్లి ఏప్రిల్ 15 వెలుతురు:** కొత్త ప్రభాకర్ రెడ్డి మాటల వెనుక కుట్ర కోణం ఉందని దీనిపై వెంటనే విచారణ జరిపించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. రియల్ ఎస్టేట్ కంపెనీలు తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చడానికి సిద్ధంగా ఉన్నాయని ఎమ్మెల్యేలను కొనడానికి ఎంత డబ్బు అయిన ఖర్చుపెట్టడానికి పారిశ్రామిక వేత్తలు మమల్ని కలుస్తున్నారని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎక్కువ కాలం నిలబడదు, త్వరలోనే కూల్చబోతున్నాం అని బిఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అధికారం పోయిందన్న అహంకారంతో కల్వకుంట్ల కుటుంబానికి కడుపు మండుతుంది అని అన్నారు. ప్రజలతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలగొట్టే నైతిక హక్కు, రాజ్యాంగాన్ని ఖుని చేసే హక్కు మీకు ఎక్కడిదని అన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడినా మాటలు అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి ఓర్వలేక బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న కుట్ర అని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చే దమ్ము బిఆర్ఎస్ వాళ్ళకి లేదన్నారు. పదేళ్లు చేసిన అరాచక పాలనలో చేసిన పాపాలు గుర్తుకు లేవా, ఎక్కడపడితే అక్కడ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని పేర్కొన్నారు. అబద్దాల బ్రాండ్ అంబాసిడర్ గా కేటీఆర్, పూటకో అబద్ధం, మోసమే బిఆర్ఎస్ నైజం అని, అబ్ధపు ప్రచారాలతో ప్రజలను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నంలో నిమగ్నమైన కేటీఆర్ అధికారం కోల్పోయిన క్షణం నుడి సీఎం రేవంత్ రెడ్డిని బద్నామ్ చేసే పనులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రోజుకో డైవెర్షన్ చేస్తున్నారనీ మండిపడ్డారు. ఎక్కడ తమ అక్రమాలు, అన్యాయాలు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి చూస్తున్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాటల వెనుక కుట్ర కోణం ఉందన్నారు. కేసీఆర్ ఫార్మ్ హౌస్ లో పడుకొని ఇవాళ ప్రజాప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ ని కూలదోయడానికి కుట్రలు చేస్తున్నారు. కేసీఆర్ ఆత్మ అయినటువంటి కొత్త ప్రభాకర్ రెడ్డి తో మాట్లాడించిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలి అన్నారు.

## యాష్కీ అనసూయ వర్ధంతి లో పాల్గొన్న న్యాయవాదులు



**వెలుతురు, హయత్ నగర్,ఏప్రిల్ 15:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కీ గౌడ్ మాతృ మూర్తి యాష్కీ అనసూయ సంవత్సరీకానికి హాజరైన న్యాయ వాదులు బొడ్డు బిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు , ఈ సందర్భంగా వారు మధు యాష్కీ గౌడ్ మాతృ మూర్తి అనసూయ సంవత్సరీకానికి బొడ్డు బిక్షపతి గౌడ్ హయత్నగర్ కోర్టు మరియు టీపీసీసీ లీగల్ సెల్ రంగారెడ్డి జిల్లా ఛైర్మన్ తో పాటు సహాయ కార్యదర్శి బండి నరేష్ లు యాష్కీ అనసూయ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు, అలాగే మధు యాష్కీ అమ్మ ఆశీస్సుల త్వరలోనే ఆయనకు అత్యున్నత పదవి దక్కుతుందని వారు ఆశాభావం వ్యక్తంచేశారు,

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోండి

- రైతులకు ఎమ్మెల్యే వివేక్ సూచన

**మంచిర్యాల,ఏప్రిల్15( వెలుతురు):**

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను అమ్ముకొని మద్దతు ధర పొందాలని కాంగ్రెస్ సీనియర్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. మంగళవారంచెన్నూర్ మండలంలోని ముత్తరావు పల్లె గ్రామంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు- చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన ముచ్చటించారు. రైతుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే రాష్ట్రంలో రైతులు ఆర్థికంగా బలపడుతున్నారని ఈ సందర్భంగా రైతులు ఎమ్మేలకు వివరించారు. రైతులు అందరికీ 500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చొరవతోనే.. మూడు సార్లు సీసీఐ పత్తి కొనుగోళ్ళు నిలిపివేసిన మళ్ళీ ప్రారంభించి రైతుల కష్టాలను దూరం చేశారని కృతజ్ఞతలు తెలిపారు.

## ఎం.వి ఫౌండేషన్‌లో గత 20 సంవత్సరాలుగా

# మొండ్యాగు శ్రీనివాస్ సుదీర్ఘ సేవలు

*గత 20 సంవత్సరాలుగా ఎం.వి ఫౌండేషన్ లో పనిచేస్తూ తన అనుభవంతో బాల కార్మిక నిర్మూలన, బాలల హక్కులపై, పిల్లల ఆరోగ్యముపై, బాల్య వివాహాలపై, సుదీర్ఘ విశ్లేషణచేసి తన సేవలను మేధావులు, జర్నలిస్టులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, రాజకీయ పార్టీలు, వారందరూ గుర్తించారు అని సోషల్ ఆడిట్ ఫౌండేషన్ సర్వే రిపోర్ట్ తెలిపింది. మరియు ఇకముందు స్థానిక సంస్థల గ్రామపంచాయతీ మరియు ఎంపీటీసీ ఎలక్షన్లలో కూడా రాజకీయ వ్యూహకర్తగా మొండ్యాగు శ్రీనివాస్ అతని బృందం తమ యొక్క పాత్రలను సమగ్రంగా నిర్వహిస్తారు.*

ఈ సందర్భంగా మొండ్యాగు శ్రీనివాస్ రాజకీయ వ్యూహకర్త పాత్ర ఏ విధంగా ఉంటుందో వివరిస్తూ.......



ప్రతి కదలికను నిశితంగా పరిశీలించే మరియు వాటాలు ఎక్కువగా ఉండే రాజకీయాల సంక్లిష్ట దృశ్యంలో, రాజకీయ వ్యూహకర్తలు విజయవంతమైన ప్రచారాల వెనుక సూత్రధారులుగా ఉద్భవిస్తారు. ఎన్నికల విజయాల ఈ రూపశిల్పులు కథనాన్ని రూపొందించడంలో, ఓటర్లను సమీకరించడంలో మరియు వారి అభ్యర్థి విజయం సాధించేలా చూసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తారు. ఈ బ్లాగ్ పోస్ట్‌లో, రాజకీయ వ్యూహకర్తల బహుముఖ పాత్ర మరియు ఎన్నికల ఫలితంపై వారు చూపే ప్రభావాన్ని మనం పరిశీలిస్తాము.

ప్రతి విజయవంతమైన రాజకీయ ప్రచారం యొక్క గుండె వద్ద చక్కగా రూపొందించబడిన వ్యూహం ఉంటుంది. అభ్యర్థి దృక్పథానికి అనుగుణంగా మరియు ఓటర్లతో ప్రతిధ్వనించే సమగ్రమైన మరియు డైనమిక్ ప్రణాళికను అభివృద్ధి చేయడానికి రాజకీయ వ్యూహకర్తలు బాధ్యత వహిస్తారు. ఇందులో పోలింగ్ డేటాను విశ్లేషించడం, జనాభా గణాంకాలను అధ్యయనం చేయడం మరియు ఓటర్లను ఆకర్షించే మరియు వారిని ఆకర్షించే కీలక అంశాలను గుర్తించడం ఉంటాయి.

ఏదైనా విజయవంతమైన రాజకీయ ప్రచారానికి బలవంతపు సందేశం ఒక మూలస్తంభం. ఓటర్ల ఆందోళనలను పరిష్కరించే స్పష్టమైన మరియు ప్రతిధ్వనించే సందేశాన్ని వ్యక్తీకరించడానికి రాజకీయ వ్యూహకర్తలు అభ్యర్థులతో దగ్గరగా పని చేస్తారు. అభ్యర్థి కమ్యూనికేషన్ వ్యూహం ప్రభావవంతంగా మరియు స్థిరంగా ఉండేలా చూసుకోవడం ద్వారా వారు విభిన్న జనాభా మరియు వేదికలకు అనుగుణంగా సందేశాలను రూపొందించడంలో నిష్ణాతులు.

24/7 వార్తా చక్రాలు మరియు సోషల్ మీడియా ఆధిపత్య యుగంలో, మీడియాలో అభ్యర్థిని ఎలా చిత్రీకరిస్తారనేది వారి ప్రజా ఇమేజ్‌ను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. రాజకీయ వ్యూహకర్తలు మీడియా నిర్వహణలో నైపుణ్యం కలిగి ఉంటారు, అభ్యర్థులు ప్రెస్‌తో ఎప్పుడు, ఎలా పాల్గొనాలో మార్గనిర్దేశం చేస్తారు. సంభావ్య సంక్షోభాలను తగ్గించడానికి, కథనాన్ని నియంత్రించడానికి మరియు సానుకూల కవరేజీని పెంచడానికి కూడా వారు పని చేస్తారు. రాజకీయ వ్యూహకర్తలు విజయానికి కీలకమైన కీలక యుద్ధభూమిలు మరియు జనాభా అంశాలను గుర్తించడానికి డేటా విశ్లేషణలను ఉపయోగిస్తారు. వారు లక్ష్య ప్రచార వ్యూహాలను అభివృద్ధి చేస్తారు, ప్రభావాన్ని పెంచడానికి వనరులను సమర్థవంతంగా కేటాయిస్తారు. ఇంటింటికీ ప్రచారం అయినా, టెలివిజన్ ప్రకటనలు అయినా లేదా సోషల్ మీడియా ప్రచారం అయినా, వ్యూహకర్తలు ప్రచారం సరైన ప్రేక్షకులను చేరుకునేలా చూస్తారు.

విజయవంతమైన రాజకీయ ప్రచారంలో పొత్తులను ఏర్పరచడం మరియు సంకీర్ణాలను నిర్మించడం ముఖ్యమైన భాగాలు. రాజకీయ వ్యూహకర్తలు రాజకీయ సంబంధాల సంక్లిష్ట వెబ్‌ను నావిగేట్ చేస్తారు, ప్రభావవంతమైన వ్యక్తులు మరియు ఆసక్తి సమూహాల నుండి ఆమోదాలు మరియు మద్దతును కోరుకుంటారు. బాగా నిర్మించబడిన సంకీర్ణం అభ్యర్థి ఆకర్షణను విస్తృతం చేస్తుంది మరియు వారి విజయ అవకాశాలను పెంచుతుంది.

రాజకీయాలు అనూహ్యమైనవి మరియు ఊహించని సవాళ్లు ఏ క్షణంలోనైనా తలెత్తవచ్చు. రాజకీయ వ్యూహకర్తలు చురుగ్గా మరియు సంక్షోభ నిర్వహణలో నైపుణ్యం కలిగి ఉండాలి. కుంభకోణానికి ప్రతిస్పందించడం, ప్రజాభిప్రాయంలో ఆకస్మిక మార్పును పరిష్కరించడం లేదా ప్రత్యర్థి దాడులను ఎదుర్కోవడం వంటివి ఏదైనా, వ్యూహకర్తలు రాజకీయాల తుఫాను సముద్రాలను నైపుణ్యంతో నావిగేట్ చేయాలి.

ఏ ప్రచారంలోనైనా ఓటును ప్రయోగించడం కీలకమైన అంశం. రాజకీయ వ్యూహకర్తలు సాంకేతికత, కమ్యూనిటీ ఆర్గనైజింగ్ మరియు అట్టడుగు స్థాయి చొరవలను ఉపయోగించి ఓటర్ల సమీకరణ ప్రయత్నాలను రూపొందించి అమలు చేస్తారు. వారు స్థావరాన్ని శక్తివంతం చేయడం, నిర్ణయం తీసుకోని ఓటర్లను ఒప్పించడం మరియు ఎన్నికల రోజున బలమైన ఓటర్ల సంఖ్యను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాజకీయ చదరంగం ఆటలో, రాజకీయ వ్యూహకర్తలు గ్రాండ్‌మాస్టర్లు, అభ్యర్థుల విధిని నిర్ణయించగల మరియు దేశాల గమనాన్ని రూపొందించగల ఎత్తుగడలను రూపొందించారు. ఆకర్షణీయమైన కథనాన్ని రూపొందించడంలో, ఆధునిక మీడియా యొక్క సంక్లిష్టతలను నావిగేట్ చేయడంలో మరియు ఓటర్లను సమీకరించడంలో వారి సామర్థ్యం చాలా అవసరం. నిరంతరం అభివృద్ధి చెందుతున్న రాజకీయాల దృశ్యాన్ని మనం చూస్తున్నందున, ప్రజాస్వామ్య ప్రక్రియను రూపొందించడంలో రాజకీయ వ్యూహకర్తల పాత్ర కీలకమైనదిగా మాత్రమే కాకుండా మరింత ప్రభావవంతంగా ఉంటుంది.

# ప్రజా (కాంగ్రెస్) ప్రభుత్వాన్ని కూలుస్తామన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి...

- కూలదోయడానికి ఆర్థిక వనరులు ఇస్తామన్న వారిపై సైతం చర్యలు తీసుకోవాలి...
- రాజ్యాంగాన్ని అవమానించిన ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి అనర్హుడు...
- కేసు నమోదు చేయాలని కోరుతూ ఏసిపికి ఫిర్యాదు చేసిన కూకట్ పల్లి కాంగ్రెస్ నేతలు..




**కూకట్ పల్లి ఏప్రిల్ 15 వెలుతురు:**

తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కూకట్ పల్లి ఏసిపికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం జరిగిన నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద పలువురు వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ డీలర్లు తనను సంప్రదించి, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారని మాట్లాడడం పై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి, తమ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం ఉందని ప్రభాకర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి ప్రకటనలు ఒక సీనియర్ ప్రజా ప్రతినిధి చేయడం ప్రజాస్వామ్యానికి శత్రుత్వంగా భావించాలన్నారు. ఇలాంటి ప్రకటనలు అవినీతిపరమైన నల్లధనం మాఫియా, మనీ లాండరింగ్ మాఫియా వలయాల ప్రమేయాన్ని సూచిస్తున్నాయని, ఇది రాష్ట్రంలో చట్టబద్ధమైన పరిపాలనకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తో పాటు ఆయన ను కలిసిన పేరులేని వ్యాపారులు, రియల్టర్లు మీద కూడా కేసులు నమోదు చేయాలని, నల్లధనం మాఫియా, మనీ లాండరింగ్ ద్వారా ప్రోత్సహించబడుతున్న ఈ కుట్రపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే పదవిలో ఉంటూ రాజ్యాంగాన్ని అవమానించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పై అనుచిత వ్యాఖ్యలు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై త్వరలోనే స్పీకర్, గవర్నర్ లకు ఫిర్యాదు చేస్తామని శేరి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాదు ప్రతాపరెడ్డి, మేకల మైకల్, కొండల్ రెడ్డి, విట్టల్ రెడ్డి, సాయి రెడ్డి, దేవ సహాయం, అక్బరుద్దీన్, రాజు ముదిరాజ్, కొమ్ము బాబు, గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన బండారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్





**చేవెళ్ళ వెలుతురు ఏప్రిల్ 15**

చేవెళ్ళ మండలం ప్రాథమిక పాఠశాల మన్మర్రిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 134 జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మరియు స్థానిక అంబేద్కర్ సంఘ నాయకులు సురేష్, అర్జునయ్య, వెంకటేష్,పాఠశాల లైబ్రరీకి అంబేద్కర్ గారి జీవిత చరిత్ర పుస్తకాలను వితరణ చేయడం జరిగింది.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉపాధ్యాయులు వెంకటమ్మ,మర్పల్లి అశోక్ మరియు అంబేద్కర్ సంఘం నాయకులు అర్జునయ్య, వెంకటేష్, ఆంజనేయులు, రాజ లింగం మాట్లాడుతూ ప్రపంచ మేధావి, విశ్వ రత్న, ఆధునిక భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు దేశ ప్రజల హక్కుల కోసం, అణిచివేతకు గురైన అణగారిన బహుజన వర్గాల చైతన్యం కోసం తన జీవితాన్ని ధారపోసారని,తాను అనుభవించిన వివక్షత మరెవరు అనుభవించకూడదని రాత్రింబవళ్ళు కష్టపడి చదువు కొని ఉన్నత విద్యను అభ్యసించి, మన దేశ పరిస్థితులకు అనుకూలమైనటువంటి ఆధునిక భారత రాజ్యాంగాన్ని రూపొందించాలని, యావత్ ప్రపంచం మొత్తం అంబేద్కర్ గారిని కీర్తించే విధంగా తన రచనల ద్వారా, ఉద్యమ త్యాగాల ద్వారా సమసమాజ నిర్మాణానికి చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని, విద్యార్థులకు, యువతకు, మహిళలకు, సబ్బండ ప్రజానీకానికి అంబేద్కర్ రూపొందించిన చట్టాలు రక్షణ కవచాలుగా ఉన్నాయని అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,అంబేద్కర్ సంఘం నాయకులు బి రామచంద్రయ్య, నిరంజన్, కె రామచంద్రయ్య, అంగన్వాడి టీచర్ సుగుణమ్మ, ఆయా చైతన్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## కందుకూరు లో జరిగిన సహపంక్తి భోజనకార్యంలో పాల్గొన్న కేఎల్ఆర్



**వెలుతురు, ఎల్ బి నగర్,ఏప్రిల్ 15:**

సన్నబియ్యం – సహపంక్తి భోజనం.. కందుకూరులో బీసీ నేత ఇంట్లో విందు భోజనం చేసిన కేఎల్ఆర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. రేషన్ దుకాణం ద్వారాసన్నబియ్యం పొందిన బీసీ నాయకులు ఎడ్ల మహేందర్ ముదిరాజ్, రాములు ముదిరాజ్ ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేశారు.ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ ధనికుడు తినే అన్నం పేదోడు సైతం కడుపు నిండా తినాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లు సన్నబియ్యం పథకాన్ని తెచ్చారని తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసేలా కాంగ్రెస్ నేతలు , కార్యకర్తలు కృషి చేయాలని లక్ష్మారెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో కందుకూరు మండల నాయకులు సహా అన్ని విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం సాధికారత సాధించాలి

- **పద్మశ్రీ డాక్టర్ ఏ.ఎస్.నారాయణ**

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు ఏప్రిల్ 15:** మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి, సాధికారత సాధించాలని పద్మశ్రీ డాక్టర్ ఏ ఎస్ నారాయణ సూచించారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రంలో సర్టిఫికెట్లు పొందిన 45 మంది మహిళలకు రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి రూ.3 లక్షలు విలువైన కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఏ ఎస్ నారాయణ మాట్లాడుతూ, మానవత్వం సమానత్వం ప్రేమ తత్వం బోధించిన సాయినాథుని స్ఫూర్తితో సేవా కార్యక్రమా లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్లోరోసిస్ బాధితులకు పలు రకాలుగా సేవలు అందించినట్టు చెప్పారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంతంలో ఆపన్నులను, దీనులను, నిరుపేదలను నిరాశ్రయులను ఆదుకునేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. 2013లో ట్రస్టును ప్రారంభించామని చెప్పారు. మహిళలు తాము నేర్చుకున్న కుట్లు అల్లికలతో స్వయంగా ఉపాధి పొందుతూ మరి ఎంతో మందికి మార్గదర్శక నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సంపాదించిన దాంట్లో కొంత అవసరమైన వారికి అందించాలని కోరారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ వృత్తులను మరింత నవీకరించుకునేందుకు తమ సంస్థ ద్వారా రాష్ట్రంలో 50 విస్తరణ కేంద్రాలు లు నిర్వహిస్తున్నామని చెప్పారు. వేల మందికి శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాన్ని జీవనోపాధిని పెంచుకునేలా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. శిక్షణను ఉచితంగా అందిస్తున్నామని యువత వినియోగించుకోవాలని కోరారు. సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురం లోని శిక్షణ కేంద్రంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 75 మంది మహిళలకు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్ కిషోర్ రెడ్డి, పద్మశ్రీ డాక్టర్ ఏ ఎస్ నారాయణ చేతుల మీదుగా సర్టిఫికెట్లను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్ హా ల్ లో నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రధానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ కృష్ణమూర్తి, పోలీస్ ఎస్ఐ జగన్, సెర్ప్ ఏపీఎం యాదయ్య, సామాజిక కార్యకర్తలు పర్ని శివారెడ్డి, సుక్క సుదర్శన్, సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధి చిలువేరు హరిప్రసాద్, ప్రవాస భారతీయ విద్యార్థులు తేజ, త్రిష, శ్రీరామలక్ష్మి, శిక్షకురాలు వినోద తదితరులు పాల్గొన్నారు.











# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మరియు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 15**

మహనీయుల విగ్రహాలను నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం , మునిపంపుల వాస్తవ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ఎల్బీనగర్ శాసనసభ్యులు సంయుక్తంగా ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు స్త్రీ జనోద్ధారకుడు ,సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే గార్ల విగ్రహాలను మునిపంపుల గ్రామంలో ఆవిష్కరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి మునిపంపుల ఎంప్లాయిస్ అండ్ రిటైరీస్ అసోసియేషన్ అధ్యక్షులు గంటెపాక నర్సింహ్మ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహనీయుల గొప్పతనాన్ని వాళ్ళు చేసిన కృషిను గూర్చి అదే విధంగా మునిపంపుల గొప్పతనాన్ని మునిపంపుల ప్రజల చైతన్యాన్ని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తెలియజేయడం జరిగింది. మునిపంపుల నుండి ఒక గొప్ప వ్యక్తి ఎల్బీనగర్ ను అభివృద్ధి పదంలో నడిపిస్తూ, మూడుసార్లు ఎమ్మెల్యేగా వ్యవహరించారని అందువల్లనే ముని పంపుల గొప్ప గ్రామమని తెలిపారు . డాక్టర్ బీఆర్అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శ భావాలు పునికి పుచ్చుకొన్నఅంటువంటి ముని పంపుల గ్రామంలోనే విజ్ఞులైన ఉద్యోగస్తులు ఉంటారని తెలియజేశారు. అదేవిధంగా ఎల్బీనగర్ శాసనసభ్యులు మునిపంపుల ముద్దుబిడ్డ దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మన నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా మన గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేయించుకుందామని, నేను కూడా చేయూతనందిస్తానని అదేవిధంగా ఎమ్మెల్యే సహాయంతో ఏ విధమైన పనులైన చేస్తానని తాను పుట్టి పెరిగిన మునిపంపుల చైతన్యాన్ని అదేవిధంగా ప్రజల నడవడి ఎలా ఉంటుందో తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మునిపంపుల ఎంప్లాయిస్ అండ్ రిటైరీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉయ్యాల బిక్షమయ్య ,రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మిర్యాల ప్రభాకర్ , పెద్ది సుధాకర్ ,రచ్చ ఎల్లయ్య ,రచ్చ మహేష్ ,లెల్లెల బాలచందర్ , పబ్బు అంజయ్య ,ముజాహిద్ అలీ ఖాన్ , పిల్లి సురేష్, గాదె రవి,గంటెపాక చిన్న నరసింహ ,జోగుల వెంకట్ ,సిరసనగండ్ల ఉప్పల్ ,సూరపల్లి అంజయ్య ,మహమ్మద్ జాకీర్ హుస్సేన్ ,ఖయ్యూం, గ్రామ మాజీ సర్పంచులు ఉయ్యాల లక్ష్మినర్సు మామిండ్ల శేషాద్రి , కట్ట యాదయ్య ,మాజీ ఎంపీటీసీలు మేకల కృష్ణయ్య , కన్నెగంటి వెంకటేశ్వర చారి, గాదె పారిజాత, వివిధ పార్టీల గ్రామ శాఖల అధ్యక్షులు , మరియు మునిపంపుల ఉద్యోగులు,రిటైరీస్ పేరు పేరున పాల్గొనడం జరిగింది.




# దేశ సమైక్యతను విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

- **గ్రామాల్లో స్థానిక ప్రజా సమస్యలు పరిష్కరించాలి**
- **సిపిఎం మాజీ కేంద్ర కమిటి సభ్యులు చెరుపల్లి**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16**

దేశ సమైక్యత, ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో జల్లెల పెంటయ్య అధ్యక్షతన జరిగిన సిపిఎం జిల్లా కమిటి సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరయ్యి మాట్లాడుతూ, దేశంలో మూడోసారి అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వం దేశంలో విచ్ఛిన్నకర పాలన కొనసాగిస్తుందని అన్నారు. గవర్నర్ వ్యవస్థను ఆసరా చేసుకొని బిజిపియేతర ప్రభుత్వాలను కూల్చేందుకు ప్రయత్నిస్తుందని తమిళనాడు గవర్నరే దానికి నిదర్శనం అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న ట్రంప్ వ్యవహారం పట్ల ఎందుకు మోడీ ప్రభుత్వం మౌనంగా వ్యవహరిస్తుందన్నారు. భారత్ పై సుంకాలు విదిస్తూ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందని విమర్శించారు. కేంద్రం పెట్టిన బడ్జెట్ లో పేదలకు ఒరిగిందేమిలేదని అన్నారు. వర్ఫ్ బోర్డు చట్టం తీసుకొచ్చి ఆర్.ఎస్.ఎస్ వ్యక్తిగత ఏజండాను అమలు చేస్తుందనారు. కేంద్ర ప్రభుత్వం అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై అధికార దృష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్ అన్నారు. గత నెల జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సిపిఎం పోరుబాట కార్యక్రమంలో అనేక సమస్యలు వెలికితీసి ప్రభుత్వ అధికారులకు విన్నవించడం జరిగిందనారు. కాలయాపన చేయకుండా రేషన్ కార్డులను ఇందిరమ్మ ఇండ్లను అందివ్వాలని, వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించి గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంకై సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు బారీ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, గుంటుజు శ్రీనివాస చారి, జిల్లా కమిటి సభ్యులు ఎండీ పాషా, కోమటిరెడ్డి చంద్రరెడ్డి, అవ్వారు రమేశ్వరి, బొడ్డుపల్లి వెంకటేశం, మాయ కృష్ణ, సిరిపంగి స్వామి, బోలగాని జయరాములు, బొల్లు యాదగిరి, గంగాదేవి సైదులు, కోట రామచంద్రారెడ్డి, మద్దెల రాజయ్య, గోషిక కరుణాకర్, రాములమ్మ,దయ్యాల నర్సింహ, వనం ఉపేందర్, బలగూరి అంజయ్య,గణపతి రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




## గడ్డం యాదగిరికి దళితరత్న అవార్డు

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16**

మండలం చిందు కులానికి చెందిన గడ్డం యాదగిరి కి దళిత రత్న అవార్డు దక్కింది. నిన్న హైదరాబాద్ రవీంద్ర భారతి లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలలో భాగంగా దళితుల్లో అట్టడుగు వర్గాలకు అందించిన సేవలను గుర్తించి, ఈ అవార్డు ప్రటించినట్లు వారు తెలిపారు. ఈమెరకు నిన్న రవీంద్రభారతి లో ఎస్సీ 57 ఎంబి ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ అవార్డు నా యొక్క భాద్యతను మరింత పెంచిందని ఇకపై దళితుల్లో అత్యంత వెనుకబడ్డ కులాల హక్కులకోసం నిరంతరం కృషిచేస్తానని తెలిపారు. ఎంబి ఎస్సీ కులాల నాయకులకు, చిందు కళాకారులకు, చిందు కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.




# అమ్మ నాన్న అనాథ ఆశ్రమం సందర్శించిన బాబు మోహన్



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 15 :** పట్టణ కేంద్రంలో మంగళవారం రోజున అమ్మ నాన్న అనాధ ఆశ్రమానికి విచ్చేసిన సినీ ప్రముఖులు మాజీ మంత్రి బాబు మోహన్ సందర్శించడం జరిగింది మొదట శివాలయం లో ఘనంగా పూజలు నిర్వహించి ఆ తరువాత నూతనంగా నిర్మిస్తున్నటువంటి శివాలయానికి ఇటుక అందజేసి ఆనాధలు ఉన్నటువంటి భవనానికి చేరుకొని అనాధల పలకరింపు చేసి వారిని చూసి చలించిపోయి ఇలా తను కూడా సేవలు ముందు ముందు ఇంకా చేస్తానని చెప్తూ ఆశ్రమం యొక్క పరిసరాలు అన్నీ విక్షించి అతనికి చాలా నచ్చి ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు శంకర్ అభినందించారు తర్వాత పునర్జన్మ కార్యక్రమం లో భాగంగా ఒక అనాధ కి పూర్తి గా పునర్జన్మ తన చేతుల మీదగా జరిపించారు తాను ఇలాంటి సేవ చేసే భాగ్యం కల్గినందుకు పూర్వజన్మ సుకృతంగా భవిస్తున్నాను అని అన్నారు, అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు శంకర్ వారికీ దన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో గట్టు శ్రావణి, శ్యామ్, విరాహత్ అలీ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

# అకాల వర్షానికి ఆగమైన రైతన్నలు

- **నీర్నంల గ్రామంలో వడగండ్ల వాన**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 15**



మండలం నీర్నంల గ్రామంలో సాయంకాల వేళ అనుకోకుండా వడగండ్ల వాన రావడం ద్వారా అప్పటిదాకా ఎండలు ఉన్న మార్కెట్ పరిసర ప్రాంతాలు ఒక్కసారిగా వడగండ్ల వాన రావడంతో ఉక్కిరిబిక్కిరై అటు వడ్లను కుప్పపోసుకోలేక పంట పొలాన్ని కాపాడుకోలేక ఆ రాళ్ల వానకు వడ్లు కాస్త రాలిపోయినాయి. ఆరుకాలం కష్టం చేసిన రైతన్న నోట్లో వానదేవుడు వలగండ్ల వాన కురిపించాడు ఎన్ని కష్టాలు ఉన్నా ఎన్ని నష్టాలు ఉన్న రైతుకు మాత్రం పంట చేతికి వచ్చి అమ్ముడుపోయిన దాకా కూడా బాధలు తప్పవు వడ్లు రాలిన రైతులు వారి యొక్క బాధలను ఎవరికి చెప్పుకోవాలో, అర్థం కాక ప్రభుత్వాన్ని ఆదుకోవాలని, చేతులు జోడించి దండం పెడుతున్నారు.

# మృతురాలి కుటుంబని కి ఆర్థిక సహాయం అందజేత



**చౌటుప్పల్ మండలం వెలుతురు ఏప్రిల్ 15:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామానికి చెందిన డీలర్ జెల్లా పుల్లమ్మ గత కొద్దిరోజుల క్రితం అనారోగ్య కారణంతో మరణించారు వారి కుటుంబానికి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వారి కుటుంబసభ్యులకి రూ పాయలు 50,000 ఆర్థిక సహాయం ని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కందుల శంకర్ జిల్లా అధ్యక్షుడు ఎలుగల రాజయ్య చేతుల మీదుగా అందజేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యలగూడెం వెంకటేష్, జిల్లా కోశాధికారి ఎడ్ల దర్శన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఐతరాజు యాదయ్య, చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నారాయణపురం మండల అధ్యక్షుడు దూడల బుచ్చయ్య, ఐఎంజి పాయింట్ అధ్యక్షుడు శ్రీ సూర్వి వెంకటేష చౌటుప్పల్ డీలర్లు రేవల్లి సత్యం, వెన్ రెడ్డి సురేష్,గుమ్మడి రాజశేఖర్ రెడ్డి, పబ్బు శ్రీనివాస్ తెలుకుంట్ల రాజేశ్వర్, బొజ్జ వెంకటయ్య, చిలుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ మండల నూతన కమిటీ ఎన్నిక



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఏప్రిల్ 15:** మంగళ వారం రోజు సంస్థాన్ నారాయణపూరం మండలం కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ మండల సమావేశాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు శ్రీ తిరందాసు ధనుంజయ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఇట్టి సమావేశం నందు మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో మండల అధ్యక్షునిగా ఇడుకుల సురక్షితం గుప్తా ఉపాధ్యక్షులుగా ఈ రాము, ప్రధాన కార్యదర్శిగా జింకల లింగస్వామి,కోశాధికారిగా తేలుకుంట్ల భాస్కర్ గుప్తా లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే మండల అడ్వైజర్ గా గట్టు జగన్నాథం గుప్తా ఎన్నుకున్నారు ఇట్టి సమావేశానికి జిల్లా జాయింట్ సెక్రెటరీ వీరమల్ల ఓంకార్ గుప్తా,ఈసీ మెంబర్ నరసింహ,చౌటుప్పల్ మండల ప్రెసిడెంట్ శ్ ప్రతాపరెడ్డి నారాయణపూర్ మండల కెమిస్ట్ సోదరులందరూ పాల్గొనడం జరిగింది.

## సిఎం ఆర్ ఏఫ్ నిధి పేదలకు ఒక వరం

- ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు...






**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**
ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జహీరాబాద్ పట్టణములోని వివిధ వార్డ్ లకు చెందిన 13 మంది లబ్దిదారులకు గాను రూ. 3,30,000 ల విలువ గల చెక్కులను పట్టణ బిఆర్ఎస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ రోజు చెక్కులు అందుకొన్న వారి పూర్తి వివరాలు: 1.నేతాజీ నగర్ కి చెందిన పుష్పాలతకి రూ. 10,500 లు, 2.రాంనగర్ కి చెందిన ఎల్లన్నకి రూ. 27,000లు, 3.హౌసింగ్ బోర్డుకి చెందిన ముస్కాన్ అజ్రీన్ కి రూ. 12,000లు, 4.ఏపిహెచ్బి కాలనీకి చెందిన అజ్మత్ కి రూ. 16,000లు, 5.అల్లిపూర్ కిచెందిన షరీఫ్ బి కి రూ. 34,500లు, 6.ఖాన్ మొహళ్ళ కి చెందిన శిరీష కి రూ. 24,000లు, 7.నాగమణి కి రూ. 18,500లు, 8.అహ్మద్ నగర్ కి చెందిన రషేదా బేగంకి రూ. 25,500లు, 9.రంజోల్ కి చెందిన రాముకి రూ. 54,000లు, 10.హౌతి కె కి చెందిన శామ్యూల్ కి రూ. 15,000లు, 11.రాచ్చన్న పేట్ కి చెందిన వేణుగోపాల్ రెడ్డికి రూ. 60,000లు, 12.హమాలీ కాలనీ కి చెందిన గుండన్న కి రూ. 33,000లు, 13.పస్తాపూర్ కి చెందిన మన్సూర్ కి రూ. 15,500లు యున్నారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాణిక్ రావు కి, స్థానిక నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమలో పట్టణ పార్టీ సీనియర్ నాయకులు నామ రవికిరణ్, మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్ , మోహీఉద్దీన్, మాజి కౌన్సిలర్ అబ్దుల్లా, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, తులసి దాస్, యువ నాయకులు మిథున్ రాజ్, గణేష్, శంకర్, దీపక్, పురుషోత్తం రెడ్డి, ఇబ్రహీం, హోషం, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో మూడు బోర్లు వేయించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉజ్వల్ రెడ్డి





**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**
జహీరాబాద్ పట్టణంలో పలు కాలనీలో నీటి సమస్య ఉందని స్థానిక ప్రజలు తన దృష్టికి తేవడంతో నేను ఉన్నాను మీ సమస్య పరిష్కారం చేస్తానని ఇచ్చిన మాటకి కట్టుబడి ఉండి స్వయం కృషితో జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్ లో రెండు బోర్లు,గాంధీనగర్ లో ఒకటి బోర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి వేయించారు. ముందుగా డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి బోరు వెయ్యడానికీ పూజా నిర్వహించి కొబ్బరికాయ కోట్టి బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. దీంతో వివిధ కాలనీలకు సంబంధించిన ప్రజలు హర్షవ్యక్తం చేస్తూ డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయాలి.

- జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**



విద్య హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేట్ పాఠశాలల్లో బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఉచిత విద్యకు 25 శాతం సీట్లు కేటాయించేలా ఈ విద్యా సంవత్సరం నుంచే రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించాలనే నిబంధనలు ఉన్న కార్పొరేట్ మరియు ప్రైవేట్ సంస్థలు వాటిని అమలు చేయకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల రెగ్యులేషన్ కమిటీ ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని అన్నారు ఫీజులు కూడా అడ్డగోలుగా వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రైవేటు విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయని అన్నారు. ఫీజుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని లింగం గౌడ్ విజ్ఞప్తి చేశారు

# కిసాన్ క్రెడిట్ కార్డు ప్రయోజనాల పై అవగాహన



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం రంజోల్ గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు తమ గ్రామీణ ఉద్యాన పని అనుభవ శిక్షణ కార్యక్రమం లో భాగంగా"సమాచార చేరవేత "అంశం ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డు ప్రయోజనాల పై రైతులకు అవగాహన కల్పించారు. సాగు భూమి ఉన్న వారు కౌలు రైతులు చేపల పెంపకం,పశు పోషణ ఉద్యాన పంటలు సాగు చేసే వారు వ్యవసాయ అనుబంధ రంగంలో కల వారందరూ కూడా ఈ కిసాన్ క్రెడిట్ కార్డు పొందేందుకు18 నుండి 75 సంవత్సరాల వయో పరిమితి కల వారందరు అర్హులు అని అన్నారు. దరఖాస్తు కొరకు పట్టాదారు పాసు పుస్తం ఆధార్ కార్డు 2 ఫోటోలు ఇంకా ఏదైనా గుర్తింపు కార్డు తదితర పత్రాలతో అన్ని జాతీయ బ్యాంకులు లేదా ఆన్లైన్ లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఒక లక్ష రుణం పొందిన వారు సంవత్సరం లోపు చెల్లిస్తే కేంద్రం 3 శాతం వడ్డీ రాయితీని ఇస్తుంది మిగిలిన 4శాతం వడ్డీ నీ రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపునిస్తుంది ఆ విధంగా లక్ష వరకు రుణం పొందిన వారికి పూర్తి వడ్డీ రాయితీని పొందే అవకాశం ఉందని తెలిపారు. అదే లక్ష పై రుణం పొందిన వారికి రాష్ట్రానికి చెల్లించాల్సిన 4 శాతం మాత్రమే వర్తిస్తుంది. అదే 2 లక్షల పై రుణం పొందడానికి ఎలాంటి పూచి కతు అవసరం లేదు.చాలా మంది రైతులు పంట రుణం క్యాష్ క్రెడిటా?తాలోజమ కాగానే పొదుపు ఖాతా లోకి మళ్లిస్తున్నారు. ఆ విధంగా చేయకుండా లక్ష రుణం పొందిన వారు అవసరం ఉన్న 25 వేలు మాత్రమే పొదుపు ఖాతాలోకి మళ్లిస్తే ఆ 25 వేలకు మాత్రం వడ్డీ పడుతుంది ఈ విషయాన్ని అందరూ గమనించి జాగ్రత్తగా ఉండాలని తెలియచేశారు.ప్రతి సంవత్సరం వ్యవసాయ రంగ నిపుణులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆర్ బీ ఐ ఏ పంటకు ఎంత రుణం ఇవ్వాలో నిర్ణయిస్తుంది ఆ విధంగా అన్ని బ్యాంకులు రుణాలు ఇస్తారని కొన్ని సందర్భాలలో 50 వేల వరకు భీమ పొందే అవకాశం కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. విద్యార్థులు కాత్యాయని స్నేహ సాత్విక నవ్య చందన సభిహా రైతులు మనీష్ రాములు నాగన్న రవి వీరేశం మాణిక్ మల్లన్న రంజిత్ కుమార్ మహిపాల్ సునీల్ సీను తదితరులు పాల్గొన్నారు

# త్రాగునీటి సరఫరాలో ఆటంకాలు... పరేషాన్ అవుతున్న జహీరాబాద్ ప్రజలు

- జీతం చెల్లించాలంటున్న మిషన్ భగీరథ కార్మికులు..
- సమస్యను పరిష్కరించాలని అప్పం శ్రావణ్ డిమాండ్




**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 119 గ్రామాల ప్రజలు త్రాగునీటి సరఫరా జరగక ఇబ్బందులు పడుతున్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కూడా నీరు సరఫరా కాకపోవడంతో త్రాగునీటి కోసం మున్సిపల్ వాసులు దిక్కులు చూస్తున్నారు. నేడో రేపో సమస్య పరిష్కారం అవుతుందని ఎదురు చూడడం తప్ప వేరే దారి కనిపించడం లేదని అంటున్నారు. అయితే నీటి సరఫరా నిలవడానికి ప్రధాన కారణంగా మిషన్ భగీరథ కార్మికుల జీతాలు చెల్లించకపోవడమే అని సమాచారం. ప్రభుత్వం వారికి గత 14 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో విధులను బహిష్కరించినట్లు పలువురు చెబుతున్నారు. కార్మికుల సమ్మెతో నియోజకవర్గ వ్యాప్తంగా త్రాగునీటి కోసం ప్రజలు అల్లాడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే దీనిపై అధికార యంత్రాంగం మిషన్ భగీరథ కార్మికులతో చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకవేళ చర్చలు విఫలమైతే పరిస్థితి ఏమిటనే ఆందోళనలు నియోజకవర్గవాసుల్లో నెలకొంది. ఈ విషయమై బిజెపి జహీరాబాద్ పట్టణ ఉపాధ్యక్షుడు అప్పం శ్రావణ్ కుమార్ మంగళవారం స్పందించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు కనీస మౌలిక వసతులను సక్రమంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకు అధికార యంత్రాంగం కూడా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మిషన్ భగీరథ కార్మికుల సమ్మెను విరమింపజేసి త్రాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అప్పం శ్రావణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేసవి కాలం కాబట్టి పిల్లలు, సీనియర్ సిటిజన్లు అవస్థలు పడుతుంటారని, ప్రతిఒక్కరూ మినరల్ వాటర్ కొనుక్కొని తాగలేరని అధికారులకు విన్నవించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.

# జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి కి ఉగాది పురస్కారం

### సుప్రీం కోర్టు 48వ మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:**
తెలుగు జర్నలిస్ట్ ల సంక్షేమ సంఘం ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారాలను పలు విభాగలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జర్నలిస్ట్ లకు అవార్డుల ప్రదానం చేస్తుంది. (2024-2025)సంవత్సరానికి గాను ఈ అవార్డుల జాభితాను టి జె ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు తాజాగా ప్రకటించారు. ఈ సంవత్సరానికి గాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అర్హులైన పలువురు జర్నలిస్టుల 100 మంది పేర్లను ప్రకటించగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ కు చెందిన జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త రాపోలు లింగస్వామిని మనవీయ కోణాన్ని ఆవిష్కరించిన జర్నలిస్ట్ గా ఎంపిక అవ్వడం జరిగింది. విజయవాడ లో తుమ్మలపల్లి కలక్షేత్రంలో తెలుగు జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ (మాజీ) హాజరై నిర్వాహకులతో కలిసి రాపోలు లింగస్వామి కి ఉగాది పురస్కారం, ప్రశంశ పత్రం, 5000 రివార్డు, శాలువా తో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విలువలరో కూడిన పాత్రికేయులకు సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందన్నారు. అప్పట్లో తాను కూడా పాత్రికేయు రంగంలో పనిచేసిన అనుభవాలతో కూడిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.పాత్రికేయ రంగం పై ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలల్లో విలువలతో కూడిన ఉత్తమ జర్నలిస్ట్ లకు ఉగాది పురస్కారం తో సత్కరించిన తెలుగు జర్నలిస్ట్ ల సంక్షేమ సంఘం భవిష్యత్లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాక్షించారు. సామాన్య మధ్య తరగతి కుటుంబం లో పుట్టిన రాపోలు లింగస్వామి హైదరాబాద్ లో జర్నలిస్ట్ గా పని చేస్తూనే ఆర్ టి ఐ, సామజిక కార్యకర్తగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు నిరంతరం కృషి కి ఫలితంగా గతంలో పలు అవార్డులు, ప్రముఖుల నుండి ప్రశంసలు, సమాజంలో తన కంటూ ఒక ప్రత్యేకత ను చాటుకుంటున్న రాపోలు లింగస్వామి కి తాజగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ జర్నలిస్ట్ ల జాభితాలో మానవీయ కొణాన్ని ఆవిష్కరించిన జర్నలిస్ట్ గా ఉగాది పురస్కారం ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ (మాజీ)చేతుల మీదుగా అందుకోవడం తో అతని సేవలను గుర్తు చేస్తూ పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

# దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకరరెడ్డి పై బేగంబజార్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

### టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి , నిరుద్యోగ జేఏసి చైర్మన్ మానవతా రాయ్

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు,హైద్రాబాద్ బ్యూరో, ఏప్రిల్ 15:**
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకరరెడ్డి ని తక్షణమే అరెస్ట్ చేసి విచారణ జరిపి ఎమ్మెల్యే లను కొనుగోలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలన్న పారిశ్రామిక వేత్తలు &బిల్డర్ల ను గుర్తించి చట్ట ప్రకారం శిక్షించాలని మంగళవారం నాడు నగరంలోని బేగంబజార్ పోలీస్ స్టేషన్లో టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శ & నిరుద్యోగ జెఏసి చైర్మన్ కోటూరి మానవతా రాయ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగ జెఏసి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్,కాంగ్రెస్నాయకులు &నిరుద్యోగ జెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి నరేష్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు &నిరుద్యోగ జెఏసి హైద్రాబాద్ అధ్యక్షులు హేమంత్ చౌదరి తదితరులు ఫిర్యాదు చేశారు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వెనుక దాగి వున్న కుట్ర కోణం గురించి ఆరా తీస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని వారు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు లో పేర్కొన్నారు,



## నేడు ఉదోగ్య సమస్యల పై సమావేశం: రవి ప్రకాష్

**వెలుతురు,మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా,ఏప్రిల్ 15:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TGE-JAC) కార్యాచరణ ప్రణాళిక ను ప్రకటించిందనీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు బి. రవి ప్రకాశ్ కీలక ప్రకటన చేశారు. ఈ నెల 16 మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసుల సముదాయంలో జరగనున్న సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధి బృందాన్ని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షత వహించనున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల సంఘాల నేతలు ఇందులో పాల్గొననున్నారు.దసంవత్సరాలుగా పరిష్కారం కానీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్లేందుకు TGEJAC ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం పాటుపడుతున్నదనీ, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని రవి ప్రకాశ్ తెలిపారు .అదేవిధంగా, మే 2025 నుండి ప్రభుత్వం పై కార్యాచరణ ప్రారంభించే అంశాన్ని కూడా ఈ సమావేశంలో నిర్ణయించనున్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం అవసరమైన కార్యాచరణ రూపొందించేదుకు సన్నద్ధం కానున్నారనీ రవి ప్రకాశ్ తెలిపారు,

## ఏసీబీ వలలో అవినీతి అధికారి



(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 15

ఒక వ్యక్తి జీహెచ్ఎంసీ కి సరఫరా చేసిన మొక్కల రసాయనిక పదార్థాల బిల్లులను ఆమోదించి బిల్లులను చెల్లించేం దూకు రూ.2,20,000/- లంచం డిమాండ్ చేసి మొదటి విడత రూ.1,50,000/- తీసుకొని మిగిలిన రూ.70,000/- ను తీసుకుంటుండగా తెలంగాణ అనిశా అధికారులకు పట్టుబడిన జీహెచ్ ఎంసీ శేరిలింగంపల్లి & చార్మినార్ జోన్ల అర్బన్ బయో డైవర్సిటీ ఉప సంచాలకులు విప్పర్ల శ్రీనివాస్. ఆయన పై ఏసీబీ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు, అలాగే ఏ ప్రభుత్వ సేవకుడు అయినా లంచం అడిగితే ప్రజలు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ , టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు డయల్ చేయండి. అంతే కాకుండా వివిధ సామజిక మధ్యమాలయిన వాట్సాప్ (9440446106) ఫేస్ బుక్ (Telangana ACB) మరియు ఎక్స్ (TelanganaACB) ద్వారా కూడా తెలంగాణ అనిశాను సంప్రదించవచ్చునని పేర్కొంటూ ఫిర్యాదుధారుల / బాధితుల వివరములు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు వెల్లడించారు,.

## లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

- మాజీ ఎంపి విజయసాయికి సిట్ నోటీసులు

అమరావతి,ఏప్రిల్15( వెలుతురు):

వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు- చేసుకుంది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 18వ తేదీన విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. విజయవాడ సీపీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. గతంలో లిక్కర్ స్కామ్ కేసుపై సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సాక్షిగా వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలంటూ సిట్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.ఇదిలా ఉండగా.. మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బంధువు, వైసీపీ ప్రభుత్వ ఐటీ- సలహాదారు రాజ్ కసిరెడ్డి కోసం పోలీసులు, సిట్ అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. విచారణకు హాజకావాలని హైకోర్టు చెప్పినా.. ఆదేశాలను లెక్కచేయకుండా కసిరెడ్డి తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం నాడు ఏకకాలంలో 15 చోట్ల సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న కసిరెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. అలాగే అతని బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల ఇళ్లలోనూ సోదాలు చేశారు.ఏక్తా హైట్స్, కసిరెడ్డి భార్య డైరెక్టర్‌గా ఉన్న అరేటి ఆస్పత్రి, అలాగే అతని అత్త ఇంట్లోనూ దాడులు నిర్వహించారు. మద్యం కుంభకోణంలో ప్రతి నెలా రూ.60 కోట్ల చొప్పున ఐదేళ్లపాటు- దాదాపు రూ.3 వేల కోట్లు- వసూలు చేయడంలో కసిరెడ్డి ప్రధాన ప్రాతధారిగా ఉన్నట్లు- అధికారులు గుర్తించారు. ఈ మేరకు విచారణ హాజరుకావాలని కోరగా.. ఇటీ-వల హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ చుక్కెదురు కావడంతో తప్పించుకుని తిరుగుతున్నాడు. మరోవైపు అతను దేశం విడిచి పారిపోకుండా అధికారులు లుక్ అవుట్ నోటీ-సులు సైతం జారీ చేశారు.

## నిబంధనలను ఉల్లంఘించే మిల్లర్లను ఉపేక్షించం

- ధాన్యం సకాలంలో మద్దతు ధరలకు కొనాల్సిందే
- ధాన్యం కొన్న 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ,ఏప్రిల్15( వెలుతురు):

రైతుకు కష్టం.. నష్టం కలిగితే సహించేది లేదని.. నిబంధనలు ఉల్లంఘించే మిల్లులను డీ ట్యాగ్ చేస్తామని.. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఇతర జిల్లాల మిల్లర్ల ద్వారా సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. వివిధ మార్కెట్‌యార్డుల్లోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యపు రాశుల్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖరీఫ్‌లో కనీవిని రీతిలో దాదాపు 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ. 8,300 కోట్లతో ఆరు లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రణాళికాయుతంగా వ్యవహరించి ధాన్యం సేకరణ చేసినట్లు తెలిపారు. 24 గంటల్లోపే ధాన్యం సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమయిందన్నారు. చిన్నచిన్న లోటుపాట్లు- ఉన్నా సరిదిద్దుకొని ముందడుగు వేయడం జరిగిందని, గౌరవ ముఖ్యమంత్రి తరఫున ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మార్చి 31న ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పూర్తయిన వెంటనే రబీ సీజన్‌కు సంబంధించి మొట్టమొదట నెల్లూరు జిల్లాపై దృష్టిసారించినట్లు తెలిపారు. గత రెండేళ్ల కాలంలో ఆ జిల్లా నుంచి ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదన్నారు. అక్కడి రైతులు, స్థానిక ప్రజాప్రతినిధుల కోరిక మేరకు తొలిసారిగా 1,30,000 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని.. ఖరీఫ్ నుంచి రబీకి వచ్చినందున ఇంకా కొనుగోళ్లు జరుగుతున్నాయని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మేరకు మిల్లర్లు ధాన్యం సేకరించడం లేదని, అదేవిధంగా తరుగు పేరిట అధిక కోతలు విధిస్తున్నట్లు కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే మిల్లర్లపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని, ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం రైస్ మిల్లర్లకు అండగా నిలిచిందని, గత ప్రభుత్వం వదిలివెళ్లిన రూ. 400 కోట్ల బకాయిలను కూడా చెల్లించడం జరిగిందన్నారు. రైతులు ఇబ్బందిపడేలా మిల్లర్లు వ్యవహరించొద్దన్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో లక్ష మెట్రిక్ టన్నులు అయినా రెండులక్షల మెట్రిక్ టన్నులు అయినా సేకరిస్తామని, రైతులు ఆందోళనతో తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. ఆర్ఎస్‌కే ద్వారా తమ ధాన్యాన్ని మద్దతు ధరకే అమ్ముకోవచ్చని.. ట్రక్ షీట్ ఆధారంగా 24 గంటల్లోపే ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో పడుతుందని మంత్రివర్యులు భరోసా కల్పించారు. ఎన్‌టీఆర్ జిల్లాకు సంబంధించి బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన రైతులకు సంబంధించి దాళ్వా పంట ఆలస్య మైనందున ఈ-పంటలో నమోదైన ఖరీఫ్ రబీలోకి వచ్చేలా వెసులుబాటు కల్పించాలని శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారని.. ఈ మేరకు వెంటనే అధికారులను అప్రమత్తం చేసి ఆ మేరకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. రబీ కొనుగోళ్లు ప్రారంభమైనా అకాల వర్షాల వల్ల రైతులు కొంత ఇబ్బందికర పరిస్థితుల్లో తడిసిన ధాన్యం పాడవుతుందనే ఉద్దేశంతో త్వరిత్వరగా మిల్లులకు పంపించాలనుకోవడం.. దాన్ని ఆసరాగా చేసుకొని కొందరు మిల్లర్లు రైతులను ఇబ్బందిపెడుతున్నారని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, బుడమేరు వల్ల నష్టం వాటిల్లినా ఈసారి చాలా ఎక్కువ దిగుబడి వచ్చిందని, ప్రకృతి సహకరించిందని పేర్కొన్నారు. ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేయడం జరుగుతుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని శాసనసభ్యులు స్పష్టం చేశారు.

## రంగారెడ్డి కలెక్టరేట్ లో జరిగిన "భూ భారతి" పై కార్యక్రమం : కలెక్టర్

- ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయండి
- అధికారులకు ఆదేశాలు

వెలుతురు, రంగారెడ్డి జిల్లా,ఏప్రిల్ 15:

మంగళవారం రంగారెడ్డి జిల్లా సమీకృత సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన 'భూ భారతి'ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డిఆర్‌డిఓ సంగీత, ఆర్డీఓలు అనంతరెడ్డి, చంద్రకళ , జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి లతో, మున్సిపల్ కమీషనర్లతో, మండలాల ఎమ్మార్వోలతో, భూ భారతి, కొత్త ఆర్ ఓఆర్ చట్టం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్.ఓ.ఆర్)- భూమి హక్కుల రికార్డు, భూ భారతి - కీలక అంశాలు, భూ భారతి - ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు, ఆర్.ఓ.ఆర్. లో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ %ం% మ్యుటేషన్, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, న్యాయ సహాయం, గ్రామ రెవిన్యూ రికార్డులు వంటి పలు అంశాలపైన రెవెన్యూ అధికారులకు ప్రొజెక్టర్ కలెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. భూమిపై



ఎవరికి, ఎలాంటి హక్కులు ఉన్నాయో వివరాలు, గ్రామ వారిగా గ్రామంలో ఉన్న భూమి యజమానులు, వారు కలిగి ఉన్న భూమి వివరాలను తెలిపే రికార్డు అని అన్నారు. అంతే కాకుండా దీన్ని భూయజమానులు రికార్డు కూడా అన్నవచ్చన్నారు. నేటి నుండి ప్రతి భూముల రిజిస్ట్రేషన్ ఈ రికార్డు ఆధారంగానే జరుగుతుందన్నారు. ప్రభుత్వం రైతులకు చేసే మేలు ఏదైన దీని ప్రకారమే అందబడుతున్నాయన్నారు. ఈ రికార్డులో పేరు ఉన్న వారికే భూ యాజమాన్య హక్కు పత్రం, పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో వివాద రహిత భూ విధానాలు ఉండాలన్నదే ప్రభుత్వ ప్రయత్నమని స్పష్టం చేశారు. ఆధార్ తరహాలో భవిష్యత్‌లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని అన్నారు. ప్రజా పోరాటాల నుంచి పుట్టుకొచ్చిన రెవెన్యూ చట్టాలు, ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం కావున ప్రతి ఒక్క రైతులకు, పౌరులకు ప్రణాళిక రూపంలో వివరించాలన్నారు. పైలట్ ప్రాజెక్టుగా భూ భారతిని జిల్లాలో చేపట్టడానికి ముందుగా 8 నియోజకవర్గాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని, రెవెన్యూ అధికారులను ప్రజలకు చేరువ చేయాలనేదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు.. ప్రతి నియోజకవర్గం, రెవెన్యూ డివిజన్ పరిధి, మండలాల పరిధిలో, ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పూర్తి స్థాయిలో రైతులకు అవగాహన చేయించాలన్నారు. రెవెన్యూ శాఖపైన సృష్టించిన అపోహలను తొలగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.. గ్రామాలు, మండలాల్లో ప్రజా దర్బార్లు, రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ద్వారా అవగాహన కల్పించాలి. ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు సహకారంతో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం కోసం కలిసి పని చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు,

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదాకు కేబినెట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి..)

కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఉరుస క్లస్టర్‌కు కాపులుప్పాడలో 56 ఎకరాల భూమిని కేటాయింపునకు అంగీకరించింది. బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణాలపై ఒడిశా పవర్ కన్సార్టియమ్‌కు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 30 మెగావాట్ల సామర్థ్యంతో 2 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదం ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పవన విద్యుత్, సౌర విద్యుత్ ఎ+-లాట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం ఇచ్చింది. సచివాలయంలో జరిగిన భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రిమండలి చర్చించి ఆమోదించింది. ఎస్సీ వర్గీకరణ , సీఆర్డీఏ, అసెంబ్లీ, హైకోర్టు నూతన భవనాలు వంటి 24 ప్రధాన అంశాలే అజెండాగా క్యాబినెట్ చర్చలు జరిపింది. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి వచ్చిన ఎస్సీ వర్గీకరణ నివేదికపై మంత్రివర్గంలో పూర్తిస్థాయి చర్చ జరిగింది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను చంద్రబాబు సర్కార్ నియమించిన సంగతి తెలిసిందే. ఆయన ఇచ్చిన నివేదికను ఏపీ శాసనసభలో ఆమోదించి జాతీయ ఎస్సీ కమిషన్‌కు పంపించారు. దాన్ని పరిశీలించిన జాతీయ ఎస్సీ కమిషన్ తిరిగి ఏపీ ప్రభుత్వానికి నివేదించింది. దీనిపై చర్చించిన మంత్రులు ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే సీఆర్డీఏ 46వ అథారిటీ- నిర్ణయాలకు సైతం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, హైకోర్టు శాశ్వత భవనాల టెండర్ల అంశాలపైనా మంత్రులు పూర్తిస్థాయిలో చర్చించి ఆమోదం తెలిపారు. ఎల్ వన్‌గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఇచ్చేందుకు క్యాబినెట్ అంగీకరించింది. అలాగే రూ.30,667 కోట్ల పెట్టుబడులతో 16 సంస్థల ఏర్పాటుకు ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో సమావేశంలో నిర్ణయించారు. వీటి ద్వారా 32,133 మందికి ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. కాగా, ఈ పనులకు కూడా ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయాలను నిమ్మల రామానాయుడు మీడియాకు వివరించారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 26న మత్స్యకార భరోసా సాయం కింద లబ్ధిదారులకు రూ.20వేలు పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలో టీసీఎస్ విస్తరణకు భూమి కేటాయించాలని నిర్ణయించాం. ఐటీని విస్తరించేందుకు మంత్రి లోకేశ్ ప్రయత్నిస్తున్నారు. భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రికి ఉచితంగా భూమి ఇవ్వాలని నిర్ణయించాం. గ్రేహౌండ్స్ విభాగానికి కొత్తవలసలో భూమి కేటాయిస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా మంచి రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజలకు సామాజిక న్యాయం జరిగిందని నిమ్మల రామానాయుడు తెలిపారు. సామాజిక న్యాయం కోసం టీడీపీ పని చేసింది.. ఇప్పుడు ఎన్డీయే కూడా కట్టు-బడి ఉందన్న ఆయన.. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కు కేబినెట్ ఆమోదం తెలిపింది.. జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ జరిగింది.. ఆర్డినెన్స్ రెండురోజుల్లో వస్తుంది.. ఆ తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందన్నారు.. ఇక, ఎన్డీఏ కూటమి వేట నిషేధ సమయంలో మత్స్య కారుల సాయాన్ని పది వేల నుంచి 20 వేలకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుందంటూ మత్స్యకారులకు శుభవార్త చెప్పారు మంత్రి నిమ్మల.. ఈ నెల 26వ తేదీన మత్స్యకారులకు రూ.20 వేల చొప్పు సాయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు అందిస్తారని తెలిపారు.. ఐటీ-సెక్టార్ కి భూములు ఇచ్చే విషయంలో విధానాలు సరళంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నాం.. రాజధాని పనులు త్వరితగతిన ప్రారంభించేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు.. రాష్ట్రంలో వైసీపీ కులాలు.. మతాలు.. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తోందని మండిపడ్డారు.. మాజీ సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో మతాల మధ్య చిచ్చు పెట్టే కార్యక్రమం జరుగుతోంది. వక్ఫ్ బిల్ పేరుతో ముస్లిం.. పాస్టర్ పేరుతో -క్రైస్తవులు.. గో మరణాల పేరుతో హిందువులను రెచ్చగొట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. రాజ్యసభ లో వక్ఫ్ సవరణ బిల్లుకు అనుకూలంగా ఓటు- వేసి.. బయటకు వచ్చి డబుల్ స్టాండ్ రాజకీయం చేశారని దుయ్యబట్టారు. డిక్లరేషన్ ఇవ్వడానికి నిరాకరించిన వ్యక్తి టీటీడీపై మాట్లాడతారు.. భూమన చరిత్ర ఎవరికి తెలియదు.. ఆయన నాస్తికుడు.. బిడ్డ వైసీపీ పాలనలో గోవులు చనిపోవడంపై నిన్న టీటీడీ ఈవో వివరించారని తెలిపారు మంత్రి నిమ్మల.. ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఎస్సీ ఉపవర్గీకరణలో 200 పాయింట్ల రోస్టర్ అమలుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ఫలాలు సమానంగా అందేలా చర్యలు తీసుకుంటాం. ఎస్సీ ఉపవర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1శాతం రిజర్వేషన్ రానుంది. గ్రూప్-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం రిజర్వేషన్ అమలు కానుంది. గ్రూప్-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ వర్తించనుంది. అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో మతకలహాలు సృష్టించాలని కుట్రలు చేస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు అనేక కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. తిరిదే ప్రైస్‌గా పని చేసిన వ్యక్తి చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. తిరిదేపై బురద జల్లి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైకాపా నేత భూమన కరుణాకర్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. తిరిదేపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఈవో శ్యామలరావు కూడా చెప్పారు. పాస్టర్ ప్రవీణ్ అంశంపై కొందరు కుట్రలు పన్ని ఆరోపణలు చేశారు. సీసీటీవీ ఫుటేజీలను బయటపెట్టేసరికి నోళ్లు మూసుకున్నారని అనిత అన్నారు.

## అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం

పెట్టుకున్నట్లు వివరించారు ఇంఛార్జ్ మంత్రులు పర్యటనల్లో మూడు పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.. రెవెన్యూ సమస్యల్లో పోలీసుల జోక్యం అంశాలను పరిష్కరించాలన్న సీఎం.. సూర్యఘర్ పథకం అమలు మరింత వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు.. వచ్చే నెల 2వ తేదీన ఏపీకి ప్రధాని నరేంద్ర మోదీ వస్తారని ఈ సందర్భంగా మంత్రులకు వివరించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కాగా, కేబినెట్ భేటీ-ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కొన్ని విషయాల్లో ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. తిరుపతిలో గోవుల మృతిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టడంలో మంత్రులు వైఫల్యం చెందారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా అమలు చేయలేని సంక్షేమ కార్యక్రమాలు మనం అమలు చేస్తుంటే.. ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు విఫలం అవుతున్నారని దుయ్యబట్టారు.. జిల్లాలు యూనిట్‌గా తీసుకొని పార్టీ.. ప్రభుత్వం.. మంత్రులు సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలన్నారు. అంతేకాదు.. ఎన్నిసార్లు చెప్పినా మంత్రుల తీరులో మార్పు రావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు.. వ్యక్తిగత కార్యదర్శులు, ఓఎస్‌డీలు చేస్తున్న తప్పులు ప్రభుత్వంపై పడుతున్నాయి.. వాటిని సరిదిద్దుకోవాలని హెచ్చరించారు సీఎం చంద్రబాబు.

## ప్రభుత్వాన్ని కూలుస్తామని ఎక్కడా అలేదు

- ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోందని చెప్పాం
- తామంతా కెసిఆర్ ఆత్మలేమన్నన్న కొత్త ప్రభాకర్ రెడ్డి

సిద్దిపేట,ఏప్రిల్15( వెలుతురు):

రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూలుస్తామంటూ తాను ఎక్కడా చెప్పలేదని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయా వర్గాల వారు తమ దృష్టికి తెచ్చిన అంశాలను తమ కార్యకర్తల సమావేశం లో మాట్లాడుకున్నామని ఆయన వివరించారు. మంగళవారం సిద్దిపేటలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి..మీడియాతో మాట్లాడుతూ.. ఏదిఏమైనప్పటికీ అన్ని రంగాల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని.. దాని ఫలితమే ప్రభుత్వంపై ఈ అసంతృప్తి అని ఆయన అభివర్ణించారు. అయితే తాను బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆత్మనే.. తానే కాదు పార్టీలోని శ్రేణులంతా కేసీఆర్ ఆత్మేనని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు ఉండాలని తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆకాంక్షించారన్నారు. ఎందుకంటే.. వారిపై వచ్చే వ్యతిరేకత మరో పదిహేను, ఇరవై ఏళ్ళ వరకు బీఆర్ఎస్ అధికారానికి ఎటువంటి ఢోకా ఉండదని తమ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పారని వివరించారు. తమ బాస్ కాంగ్రెస్ పార్టీ నేతలను ఐదేళ్ల పాలించాలని కోరుకుంటే తాము మాత్రం కూలుస్తామని ఎందుకంటామని ఆయన ఎదురు ప్రశ్నించారు. గజ్వేల్ ఇంచార్జ్‌గా తాను ఏడేళ్లు ఉన్నాను.. దీంతో ఆ సమయంలో సీఎం కేసీఆర్ సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో భూ అక్రమాలపై ఎలాంటి చర్యలకైనా తాను సిద్ధమని ఈ సందర్భంగా రేవంత్ ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. ప్రభుత్వం మీద.. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రి పొంగులేటి సహా, అందరు మంత్రుల అవినీతి వెలికితీయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మంచి చేస్తే అభినందిస్తాం.. కృతజ్ఞతలు చెబుతాం.. మాకు నిధులు ఇవ్వకుంటే మాత్రం నిలదీస్తామని ప్రభాకర్ రెడ్డి కుండ బద్దలు కొట్టారు. మల్లన్నసాగర్ నిర్మాణానికి త్యాగం చేసిన తమ దుబ్బాక నియోజకవర్గ ప్రజలని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 14 గ్రామాల వారు నిండా మునిగాయని.. తమకు నెత్తిమీద నీళ్ళు కుండా ఉన్నా తాగు, సాగు నీళ్ళు మాత్రం రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి కాలువలు తవ్వకుని వేరే ప్రాంతాలకు, జిల్లాలకు నీరు తీసుకుంటుంటే తాము మాత్రం చేతులు ముడుచుకొని కూర్చుంటామా ? అని ప్రశ్నించారు. అభివృద్ధి నిధులు బడ్జెట్ సమయంలోనే ప్రతి నియోజకవర్గానికి కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఇదే అంశాన్ని అసెంబ్లీలో తమ లాంటి ఎమ్మెల్యేలమంతా నిలదీస్తామని స్పష్టం చేశారు.



## వేసవి దాహార్తి కోసం చలివేంద్రాలు

- మంత్రి సీతక్క ఆదేశాలతో పలు చోట్ల ఏర్పాటు

హైదరాబాద్,ఏప్రిల్15( వెలుతురు):

వేసవి దాహార్తి తీర్చేందుకు పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, మండల కేంద్రాల్లో భారీ సంఖ్యలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 8,090 చలివేంద్రాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. వేసవి కాలంలో పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ చర్యలు చేపట్టబడ్డాయి. మంత్రి సీతక్క స్పష్టమైన ఆదేశాలతో పీఆర్‌ఆర్‌డీ అధికారులు గ్రామాల నుంచీ రద్దీ ప్రాంతాల వరకు ప్రతి చోట చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు విరివిగా ఈ సేవలను వినియోగించుకుంటుండగా, మంత్రి సీతక్క విస్తృతంగా చలివేంద్రాల ఏర్పాటు-పై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా పీఆర్‌ఆర్‌డీ శాఖ ముందస్తుగా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని 31 జిల్లాల కలెక్టర్లకు ఒక్కో జిల్లాకు రూ. కోటి చొప్పున పీఆర్‌ఆర్‌డీ సొంత నిధుల నుండి ప్రత్యేక నిధులు కేటాయించబడ్డాయి. ఈ నిధులను అత్యవసర తాగునీటి అవసరాల కోసం ఖర్చు చేయాలని, మిషన్ భగీరథ నుండి నీరు అందని సందర్భాల్లో ప్రజలకు సమస్యలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఫైనాన్స్ శాఖ నుండి ప్రత్యేక నిధుల మంజూరుపై అనుమతులు ఇచ్చినప్పటికీ, వాస్తవంగా నిధులు విడుదల జరగలేదని అధికారులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం పీఆర్‌ఆర్‌డీ సొంత నిధుల ఆధారంగా తక్షణ అవసరాలను తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగునీటిలో ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పీఆర్‌ఆర్‌డీ స్పష్టం చేసింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

సిద్దిపేట, ఏప్రిల్15( వెలుతురు):
రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పెద్ద సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ప్రతి గింజనూ సర్కారే కొంటుందని స్పష్టం చేశారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తీసుకురావాలని రైతులకు సూచించారు.

## పోలవరంలో నేడు కేంద్రబృందం పర్యటన

- డయాఫ్రమ్ వాల్ నాణ్యతను పరిశీలించనున్న నిపుణులు

ఏలూరు, ఏప్రిల్15( వెలుతురు):
నేటినుంచి పోలవరంలో కేంద్ర నిపుణుల బృందం పర్యటించనుంది. గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో నిర్మిస్తున్న డయాఫ్రమ్ వాల్ పనుల నాణ్యత ఈ బృందం పరిశీలించనుంది. అల్లూరి జిల్లా దండంగి గ్రామం వద్ద స్పిల్‌వే సమీపంలో ఉంచిన మట్టి నిల్వల నుంచి శాంపిల్స్ సైతం సేకరించనున్నారు. ఈ బృందంలో కేంద్ర మెటీరియల్ అండ్ సాయిల్ రిసెర్చ్ సెంటర్ నిపుణులు బి.సిద్ధార్థ్ హెడావో, సైంటిస్టు, ఏఆర్వో విపుల్ కుమార్ గుప్తాలు ఉన్నారు. త్వరలోనే మరోసారి ప్రాజెక్టు ప్రాంతంలో విదేశీ నిపుణుల బృందం కూడ పర్యటనకు రానుంది. అయితే, పోలవరం పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే కొత్తగా నిర్మిస్తున్న డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థలు వేగవంతం చేశాయి. గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో నిర్మిస్తున్న డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో తీసుకుంటు-న్న జాగ్రత్తలను కేంద్ర నిపుణుల బృందానికి వివరించనున్నారు. తన హాయంలోనే ఈ పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే ప్రాజెక్టు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

- తెలుగు విద్యార్థిని పరిస్థితి విషమం



గుంటూరు, ఏప్రిల్15( వెలుతురు):
అమెరికా టెక్సాస్‌లోని డెంటన్ నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలుగు విద్యార్థినిలు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గత శనివారం తెల్లవారుజామున జరిగింది. ఎన్.బోనీ బ్రే స్ట్రీ డబ్ల్యు. యూనివర్సిటీ డ్రైవ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన దీప్తి వంగవోలు, ఆమె స్నేహితురాలు కలిసి గత శనివారం తెల్లవారుజామున కాలినడకన ఇంటికి చేరుకోబోతుండగా, వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వారిద్దరినీ ఢీకొట్టింది. వెంటనే ఆ వాహనం డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. దీప్తి తలకు లోతైన గాయం అయిందని, ఆమెకు శస్త్ర చికిత్స జరుగుతోందని స్థానిక మీడియా తెలిపింది. మరో విద్యార్థిని కూడా తీవ్రంగా గాయపడిందని అయితే ఆమెకు ప్రాణాపాయం లేదని అమెరికా మీడియా నివేదికలు తెలిపాయి. డెంటన్ పోలీసులు ఈ హిట్ అండ్ రన్ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న డ్రైవర్‌ను, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడానికి ప్రజల సహాయం కోరుతూ అధికారులు ప్రకటన విడుదల చేశారు.

## హెలికాప్టర్ విడంఓ షీల్డ్‌కు క్రాక్

- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్15( వెలుతురు):
శ్రీ సత్యసాయి జిల్లాలోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి సమీపంలో మాజీ ముఖ్యమంత్రి, వైస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రయాణించిన హెలికాప్టర్ విండో షీల్డ్ కు ఎయిర్ క్రాక్ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ సంఘటనపై మరిన్నీ వివరాలు తెలియజేయాలని పైలెట్, కోపైలెట్ కు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. దీనికి సంబంధించి 16న విచారణకు హాజరు కావాలని చెప్పినట్లు తెలుస్తుంది. రెండు రోజుల క్రితం నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. అయితే, రామగిరిలోని పాపిరెడ్డిపల్లిలో టీడీపీ నేతల దాడుల్లో మరణించిన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి బెంగళూరు నుంచి ప్రత్యేక హెలీకాప్టర్ లో వైఎస్ జగన్ రామగిరి వెళ్లారు. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించిన తర్వాత తిరుగు ప్రయాణంలో జగన్ హెలికాప్టర్ లో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో రోడ్డు మార్గంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ కారులో తిరిగి వెళ్లి పోయారు.

## డబ్బుల కోసం పోలీసుల వేధింపులు

- రౌడీషీటర్ ఆత్మహత్యాయత్నం




పల్నాడు, ఏప్రిల్15( వెలుతురు):
పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో దారుణం చోటు చేసుకుంది. పోలీసుల వేదింపులు తాళలేక రౌడీ షీటర్ ఖాసీ సైదా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓ కేసులో సత్తెనపల్లి టౌన్ సీఐ బ్రహ్మయ్య, రైటర్ రవీంద్ర మామూళ్లు డిమాండ్ చేశారని రౌడీ షీటర్ ఆరోపించారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు దగ్గర ఆత్మహత్యా యత్నంకు పాల్పడ్డాడు. ప్రస్తుతం బాధితుడు సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి రౌడీ షీటర్, పోలీస్ స్టేషన్ రైటర్ రవీంద్ర మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. బాధితుడు ఖాసీ సైదా వడ్డీకి తెచ్చి డబ్బులు ఇవ్వాలని ఫోన్ లో రైటర్ రవీద్ర డిమాండ్ చేశారు. గతంలో రౌడీ షీటర్ పై నమోదు అయినా ఎస్సీ, ఎస్టీ కేసు కొట్టి వేయాలంటే డబ్బులు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఇక, ఈ ఘటనకు సంబంధించి వివాదం చెలరేగడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. రౌడీ షీటర్ ఖాసీ సైదా చేసిన ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేసి సీఐ, స్టేషన్ రైటర్ రవీంద్రపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా ఇలాంటి వసూల్లకు పాల్పడిన తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని తేల్చి చెప్పారు.

# గ్రూప్ వన్ వివాదాలు...

## ఫుల్ స్టాప్ ఎప్పుడు




హైదరాబాద్, ఏప్రిల్15( వెలుతురు):
తెలంగాణలో 2024 అక్టోబర్‌లో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ పరీక్షల్లో 563 పోస్టుల కోసం 31,383 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. అయితే, ఫలితాల్లో అనేక అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయని, ఇది భారతదేశంలోనే అతిపెద్ద పరీక్షా కుంభకోణంగా ఉండవచ్చని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు ఆరోపిస్తున్నారు. ఒకే హాల్ టికెట్ వరుసలో ఉన్న వందలాది మంది అభ్యర్థులకు ఒకే మార్కులు రావడం, కొన్ని పరీక్షా కేంద్రాల నుంచి అసాధారణ సంఖ్యలో టాపర్‌లు రావడం వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి.తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలు 2025 ఏప్రిల్‌లో విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఒకే హాల్ టికెట్ వరుసలో ఉన్న 654 మంది అభ్యర్థులకు ఒకే మార్కులు, మరో వరుసలో 702 మందికి ఒకే మార్కులు రావడం సంచలనం రేపింది. ఈ అసాధారణ ఫలితాలు పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత లోపించిందని, సాంకేతిక లేదా మానవ తప్పిదాలు జరిగి ఉండవచ్చని అనుమానాలకు దారితీశాయి.హైదరాబాద్‌లోని కొన్ని పరీక్షా కేంద్రాల నుంచి అసాధారణ సంఖ్యలో టాపర్‌లు రావడం మరో వివాదాస్పద అంశం. కేవలం రెండు కేంద్రాల నుంచి 74 మంది టాపర్‌లు రావడం, 15 కేంద్రాల నుంచి అన్ని ర్యాంకులు రావడం సందేహాలను రేకెత్తించాయి. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణల ప్రకారం, 563 పోస్టుల్లో టాప్ 500 ర్యాంకుల్లో ఒక్క తెలుగు మీడియం విద్యార్థి కూడా చోటు సంపాదించలేదు, ఇది మూల్యాంకనంలో పక్షపాతం ఉందనే అనుమానాలను బలపరిచింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ ఫలితాలను "భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద పరీక్షా కుంభకోణం"గా అభివర్ణించారు. ఆయన ఈ అనుమానాస్పద ఫలితాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులకు తెలంగాణ యువత పట్ల చిత్తశుద్ధి ఉంటే, వారు వెంటనే ఈ కుంభకోణంపై సీబీఐ విచారణకు మద్దతు ఇవ్వాలని ఆయన సవాలు విసిరారు.మూల్యాంకనంలో మూడవ దశ తనిఖీ జరగలేదని, రెండవ దశ మూల్యాంకనం కాంట్రాక్ట్ సిబ్బంది చేతిలో జరిగిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇది ప్రొఫెసర్‌లు లేదా శాశ్వత సిబ్బంది చేయాల్సిన పనిని అనధికార వ్యక్తులకు అప్పగించినట్లు చెప్పారు. పరీక్షలకు సంబంధించిన డేటా లీక్ అయినట్లు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు అవసరమని డిమాండ్ చేశారు. ఈ వివాదాస్పద ఫలితాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో వందలాది గ్రూప్-1 అభ్యర్థులు నిరసనలు చేపట్టారు. ఈ ఫలితాలను రద్దు చేసి, పారదర్శకంగా మళ్లీ మూల్యాంకనం చేయాలని వారు డిమాండ్ చేశారు. అశోక్ నగర్, సివిల్ సర్వీసెస్ కోచింగ్ కేంద్రాలకు కేంద్రంగా ఉండడంతో, ఈ నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కొందరు అభ్యర్థులను నిర్బంధించి, వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు, దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందించారు.రాజకీయ మద్దతు: బీఆర్ఎస్‌తో పాటు, బీజేపీ నాయకులు కూడా అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. గతంలో బీజేపీ నాయకుడు బండి సంజయ్ కూడా గ్రూప్-1 అభ్యర్థుల నిరసనలకు మద్దతు ప్రకటించారు, అయితే సీబీఐ విచారణపై బీజేపీ నుంచి స్పష్టమైన స్పందన ఇంకా రాలేదు.తెలంగాణ గ్రూప్-1 పరీక్షల చుట్టూ గతంలో కూడా అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. 2022, 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరీక్షలు పేపర్ లీక్ ఆరోపణలతో రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో, 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలపై కూడా అనుమానాలు రావడం రాష్ట్రంలో యువతలో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. 2024లో జరిగిన గ్రూప్-1 పరీక్షలకు ముందు జీవో 29పై కూడా తీవ్ర వివాదం చెలరేగింది. ఈ జీవో రిజర్వేషన్ నిబంధనలను మార్చిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై సుప్రీం కోర్టులో కేసు కొనసాగుతోంది. గతంలో జరిగిన పేపర్ లీక్ ఘటనలు, ఇప్పుడు ఫలితాల్లో అనుమానాస్పద అంశాలు టీజీపీఎస్సీ నిర్వహణలో పారదర్శకత లోపించిందనే ఆరోపణలను బలపరుస్తున్నాయి. ఈ విషయాన్ని రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది. అదే సమయంలో, బీజేపీ కూడా ఈ వివాదంపై స్పందించాల్సిన ఒత్తిడిలో ఉంది, ఎందుకంటే అభ్యర్థులు బీజేపీ మద్దతు కోరుతున్నారు. ఈ వివాదం రాష్ట్రంలో ఉద్యోగార్థులను నిరాశపరిచింది. గత 13 ఏళ్లలో గ్రూప్-1 పరీక్షలు కేవలం రెండుసార్లు మాత్రమే జరగడం, ప్రతీసారి వివాదాలు తలెత్తడం వల్ల యువతలో ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతోంది.

# పెద్దపల్లిలో నేతల సైలెంట్...




కరీంనగర్, ఏప్రిల్15( వెలుతురు):
పెద్దపల్లి జిల్లా అంటే గుర్తొచ్చేది ఇద్దరు నేతలు. ఒకరు గతంలో పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దాసరి మనోహర్ రెడ్డికాగా.. మరొకరు ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ రమణారావు.. గతంలో ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా వ్యవహరించేవారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచేది.నీ అవినీతి బాగోతం బయటకు తీస్తా అంటే..నీ అవినీతి అవినీతి బాగోతం కూడా బయటకు తీస్తానంటూ ఇద్దరు నిత్యం ఉప్పు-నిప్పులా ఉండేవారు. వీరిద్దరి మధ్య ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో జిల్లా రాజకీయాలు హీటెక్కేవి. ఇదంతా 2023కు ముందు ఇద్దరి మధ్య జరిగిన పొలిటికల్ వార్. సీన్ కట్ చేస్తే.. 2023లో గులాబీ పార్టీ దారుణంగా ఓడిపోయింది.పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా జిల్లాను ఏకచక్రాధిపత్యంగా ఏలిన దాసరి మనోహర్ రెడ్డి ఓడిపోయారు. కాంగ్రెస్ నేత చింతపల్లి విజయ రమణారావు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. కాలం మారింది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ గెలుపుతో పెద్దపల్లి జిల్లా రాజకీయాలు కూడా ఒక్కసారిగా మారిపోయాయి.అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కయ్యానికి సై అంటూ కత్తులు దూసుకున్న ఇద్దరు నేతలు ఇప్పుడు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డి ఒక్కసారిగా దూకుడు తగ్గించారు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారట. ఏదైనా పార్టీ ప్రోగ్రామ్స్ ఉంటే అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారంట. అంతేకాదు క్యాడర్ కు సైతం అందుబాటులో ఉండడంలేదట. రాజకీయంగా మునుపటిలా దూకుడును ప్రదర్శించడంలేదట.ప్రత్యర్థులపై చేసే విమర్శల్లో వాడీవేడి లేకుండా చప్పగా సాగుతున్నాయంట ఆయన ప్రెస్ మీట్లు. కనీసం పార్టీ కార్యక్రమాల్లో అయినా యాక్టీవ్ గా ఉంటున్నారంటే అదికూడా లేదట. ఒక్క ఓటమితో మనోహర్ రెడ్డి తీరులో ఇంతలా మార్పు వచ్చిందేంటి అంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పదేళ్ల పాటు రాజ్యమేలిన మనోహర్ రెడ్డి.. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పైన గానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపైగాని పల్లెత్తు మాట కూడా అనకుండా ఎందుకు సైలెన్స్ గా ఉంటున్నారనేదే ఇప్పుడు ఎవరికీ అంతుచిక్కడంలేదట.మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ పైనే పార్టీ నేతలు తలా ఒకరకంగా చర్చించుకుంటున్నారట. 2023కు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డిపై.. చింతపల్లి విజయ రమణారావు నిత్యం ఏదో ఒక ఇష్యుపై ఆరోపణలు చేస్తుండేవారు.. భూ ఆక్రమణలు, అక్రమ దందాలపై బహిరంగంగానే విమర్శలు చేశారు. అయితే ఎన్నికల తరువాత ఇప్పుడు ఒక్కసారిగా సీన్ మారి పోయింది. పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతపల్లి విజయ రమణా రావు పెద్దపల్లి గెలవడంతో.. మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మౌన ముద్రలోకి వెళ్లారు. అందుకు కారణం కూడా లేకపోలేదు అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కూడా మనోహర్ రెడ్డి భూ ఆక్రమణల భాగోతం బయట పెడతానంటూ ఎమ్మెల్యే విజయ రమణా రావు హెచ్చరించారు. బంధంపల్లి చెరువుతో పాటు, మనోహర్ రెడ్డికి సంబంధించిన స్కూళ్లు, హాస్టళ్ల లెక్కలు తీస్తానంటూ బహిరంగంగానే ప్రకటించారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే..తనకే నష్టం జరుగుతుందని భావించి మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ అయ్యారనే గుసగుసలు జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తున్నాయి.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మనోహర్ రెడ్డి భూ ఆక్రమాణలు బయట పెడతా.. విద్యా సంస్థలను కొలిపిస్తానంటూ హాట్ కామెంట్స్ చేసిన ఎమ్మెల్యే విజయ రమణరావు కూడా ఒక్కసారిగా సైలెన్స్ అయ్యారంట. మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే మౌనంపై వహించడం వెనుక ఏం జరిగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడి నుండి అధికారం చేపట్టే వరకు విజయ రమణ హెచ్చరికలకే పరిమితమవడం వెనుకున్న మతలబు ఏంటనే సందేహాలు జిల్లా రాజకీయ నేతల్లో వ్యక్తమవుతున్నాయంట.ఇద్దరి మధ్య రాజీ ఏమైనా కుదిరిందా అంటూ రకరకాల పొలిటికల్ గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయంట. మరి భూ ఆక్రమణదారుల భరతం పడతానంటూ ఎమ్మెల్యే చేసిన శపథం.. మాజీ ఎమ్మెల్యే సైలెన్స్‌గా ఉండేంత స్థాయికి వెళ్లడం వెనుక ఏదో మతలబు జరిగే ఉంటుందంటూ పెద్దపల్లి రాజకీయ వర్గాలు సెటైర్లు వేసుకుంటున్నారట. మరి రాబోయే రోజుల్లో కూడా వీరిద్దరి మధ్య ఇలాగే సైలెన్స్ వాతావరణం కంటిన్యూ అవుతుందా లేక ఏదైనా వ్యవహారం బెడిసికొట్టి మళ్లీ మొదటికొస్తుందా అనేది వేచి చూడాలి.

## ఆచితూచి అడుగుల్లో గులాబీ దళపతి

హైదరాబాద్, ఏప్రిల్15( వెలుతురు):
కేసీఆర్‌కు రాజకీయాలు అనగా చెరువులో చేపలకు ఈత నేర్పడం వంటిది. అంత సహజం, అంత సులభం! తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి, రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఆయన, 2014 నుంచి2023 వరకు తెలంగాణను ముఖ్యమంత్రిగా నడిపించారు. అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారు. అలాంటి నాయకుడికి ఎప్పుడు, ఎలా రాజకీయం చేయాలో బాగా తెలుసు. అందుకే ఇప్పుడు ఆయన జనంలోకి రాకుండా, నీడలో నిశ్శబ్దంగా తన వ్యూహాలను రచిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచాయి. ఇంకా నాలుగేళ్లకు పైగా అధికారం వారి చేతిలోనే ఉంది. అయితే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ కొంత వెనుకబడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని పథకాలు అమలైనప్పటికీ, ఇంకా చాలా హామీలు నెరవేరాల్సి ఉంది. అంతేకాదు, కాంగ్రెస్‌లో అంతర్గత గ్రూప్ రాజకీయాలు, నాయకుల మధ్య సమన్వయ లోపం కూడా బయటకు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులను కేసీఆర్‌దూరం నుండి గమనిస్తున్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల అసంతృప్తి క్రమంగా పెరుగుతుందని, అది తమకు రాజకీయంగా లాభిస్తుందని ఆయన ఆశిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పాలన "పక్వానికి" చేరే వరకు వేచి చూడాలని కేసీఆర్ భావిస్తున్నారట.ఇప్పుడే జనంలోకి వెళ్లి కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉండదని కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. బదులుగా, సరైన సమయంలో, ప్రజల్లో అసంతృప్తి గరిష్ట స్థాయికి చేరినప్పుడు బయటకు వచ్చి మాట్లాడితే, ఆ మాటలు జనంలో బలంగా ప్రతిధ్వనిస్తాయని ఆయన నమ్ముతున్నారు. ఈ వ్యూహంతోనే ఆయన ఇప్పట్లో బహిరంగ సభలు, ర్యాలీలకు దూరంగా ఉంటున్నారు. అయితే, నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, ఆయన రాజకీయంగా నిష్క్రియంగా లేరు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ, బీఆర్ఎస్‌ను బలోపేతం చేసే వ్యూహాలను రూపొందిస్తున్నారు. అదే సమయంలో, తనకు ఇష్టమైన వ్యవసాయాన్ని కూడా పర్యవేక్షిస్తూ సమయాన్ని గడుపుతున్నారు.ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంజరగనుంది. ఈ సందర్భంగా కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఈ సభలో ఆయన తమ పార్టీ బలాన్ని చాటడంతో పాటు, కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైన తీరును ఎత్తిచూపవచ్చు. అయితే, ఈ సభ తర్వాత ఆయన మళ్లీ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యే అవకాశం ఉందని అంటున్నారు.కాంగ్రెస్‌కు ఇంకా 45 నెలలకు పైగా అధికారం ఉంది. ఈ సమయంలో వారు చేసే తప్పిదాలే బీఆర్ఎస్‌కు రాజకీయంగా లాభిస్తాయని కేసీఆర్ ఆలోచిస్తున్నారు. ఆయన దృష్టి 2026 లేదా అంతకు మించి ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అప్పటి వరకు పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం, యువ నాయకులను ప్రోత్సహించడం, కాంగ్రెస్ బలహీనతలను జనంలోకి తీసుకెళ్లడం వంటి వ్యూహాలపై ఆయన దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.కేసీఆర్‌కు రాజకీయం ఒక పని అయితే, వ్యవసాయం ఒక అభిరుచి. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఆయన వ్యవసాయ కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షిస్తారు. రైతు సంక్షేమం కోసం తీసుకొచ్చిన రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు ఆయన వ్యవసాయం పట్ల అభిమానానికి నిదర్శనం. ఈ విశ్రాంతి సమయంలో కూడా ఆయన తన రైతు మనసును తామరాకు మీద నీటిబొట్టులా ఉంచుకున్నారని సన్నిహితులు చెబుతున్నారు.కేసీఆర్ ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండొచ్చు, కానీ ఆయన రాజకీయ ఆటలో ఎప్పుడూ ఆచితూచి అడుగు వేస్తారు. సమయం కోసం వేచి ఉంటూ, పార్టీని బలోపేతం చేస్తూ, కాంగ్రెస్ తప్పిదాలను ఎత్తిచూపే అవకాశం కోసం ఎదురుచూస్తు న్నారు. 2026 తర్వాత ఆయన రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి.

# అడవిపందుల దాడితో పంటలకు నష్టం

**ఆదిలాబాద్,ఏప్రిల్15( వెలుతురు):**

ఆదిలాబాద్ జిల్లాలో అడవి పందుల బెడద రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చేతికొచ్చే పంటలను పందుల మంద ధ్వంసం చేస్తోంది. ప్రధానంగా మక్కపంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పంటల రక్షణతో పాటు ప్రమాదాలను నివారించడానికి అటవీశాఖ అధికారులు పంటలపై దాడి చేస్తున్న అడవి పందులను కాల్చివేతకు చర్యలు చేపట్టారు. పందుల బారి నుంచి పంటలను కాపాడు కునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో రైతులు వేరుశనగ, శనగ, జొన్న పంటలను సాగు చేస్తున్నారు. చేతికి వచ్చిన పంటలపై అడవి పందులు దాడి చేసి నాశనం చేస్తున్నాయి. ఫలితంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. దీంతో రైతులు పంటలకు విద్యుత్తీగలను అమర్చుకుంటుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

# సంక్షేమంలో మనమే నంబర్‌వన్

- దేశానికి ఆదర్శంగా పథకాలు :ఎమ్మెల్యే



**యాదాద్రి,ఏప్రిల్15( వెలుతురు):**

తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఆలేరు శాసన సభ్యుడు బీర్ల ఐలయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవన్నారు. దరణి స్థానంలో భూభారతి తీసుకుని రావడం విప్లవాత్మకమని అన్నారు. సన్నబియ్యం పంపిణీ తదితర కార్యక్రమాలు పేదలకు వరం లాంటివని అన్నారు. బిఆర్ఎస్, బీజేపీ నాయకులు విమర్శించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీల దుష్ప్రచారాలను ప్రజలు తిరస్కరించబోతున్నారని అన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఇలాంటి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకోవాలని నాయకులకు సవాల్ విసిరారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందజేసేందుకు గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. గిరిజన గ్రామాలకు, తండాలకు సైతం బీటీ రోడ్లు నిర్మించామన్నారు.

# పెరుగుతున్న ఎండలతో అప్రమత్తం

**కొత్తగూడెం,ఏప్రిల్15( వెలుతురు):**

జిల్లా అధికారులంతా వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై దృష్టి పెట్టాలని, ఇప్పటికే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలకు చేరువయ్యిందని తెలిపారు. ప్రధానంగా కొత్తగూడెంలో ఎండలు ఎక్కువ కాబట్టి వడదెబ్బ మృతులను నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, వైద్య శాఖ అధికారులు ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ప్రజలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలనికోరారు. వేసవి ఉష్ణోగ్రతలపై అధికారులకు సూచనలను చేశారు. ప్రయాణం చేసేటప్పుడు గొడుగులు లేదా, తలకు వస్త్రాన్ని చుట్టుకొని వెళ్లాలని, ధరించే దుస్తులలో తెలుపురంగు దుస్తులను వాడాలన్నారు. వీలైనంత వరకు అందుబాటులో ఉన్న నిమ్మరసం, లేదా మజ్జిగను తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రాథమిక అరోగ్య కేంద్రాలలో, వైద్య శిబిరాలలో తప్పక ఉంచాలని స్పష్టం చేశారు. పిల్లలు గర్భిణులు, వృద్ధులు వేసవిలో ఎక్కువగా తిరగకుండా చూడాలన్నారు. కార్‌పార్కింగ్‌లు చేసేటప్పుడు కారులో ఎవ్వరినీ ఉంచరాదని, చెట్ల నీడలోనే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

# ఇసుక అక్రమ రవాణాకు చెక్



**కరీంనగర్,ఏప్రిల్15( వెలుతురు):**

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై దొంగతనం కేసులు నమోదు చేస్తామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. పట్టుబడిన వాహనాల డ్రైవర్లు, యజమానులపై కూడా కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేయొద్దనీ, అలా చేస్తే సంబంధిత భూ యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి, ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో ఇసుక నిల్వలపై గడ్డి కప్పి ఉంచేవారని, ప్రస్తుతం ఎవరికీ అనుమానం రాకుండా ఇసుకపై ఎర్రమట్టి నింపుతున్నారని చెప్పారు. స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, క్యూఆర్‌టీ విభాగాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

**ఏలూరు,ఏప్రిల్15( వెలుతురు):**



జిల్లాల్లో ఈ వేసవిలో ఎక్కడా కూడా తాగునీటి ఇబ్బంది అనే మాట లేకుండా చర్యలకు ఉపక్రమించారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైతే ప్రత్యేక మోటర్లు ద్వారా నీటిని చెరువుల్లోకి మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో తహశీల్దార్లు ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రత్యేక చలివేంద్రాలు నెలకొల్పాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో సాధ్యమైనంత వరకు ప్రజలు సుదూర ప్రయాణాలను ఉదయం వేళల్లో, లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే చేయాలి తప్ప మండు వేసవిలో ప్రయాణాలు చేయవద్దని సూచించారు. జిల్లాలో రబీ పంట చేతికొచ్చిన దృష్ట్యా రైతులకు పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధర కల్పించడానికి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అగ్నిమాపక యంత్రాలు పూర్తి కండీష

# నిర్దోషి అయితే కాకాణి ఎందుకు పారిపోయినట్లు?

- మోహిల్ ఛోక్సీని మించిన మోసగాడు కాకాణి
- మండిపడ్డ మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్

**నెల్లూరు,ఏప్రిల్15( వెలుతురు):**

మాజీ మంత్రి కాకణి గోవర్ధన్ రెడ్డి మోసాలకు వ్యతిరేకంగా పోరాడిన తనపై అక్రమ కేసులు పెట్టించారని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. తాను నిర్దోషినని చెప్పుకునే కాకణి నెల్లూరు నుంచి ఎందుకు పారిపోయారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. కరోనా ఆనందయ్య మందు కేసులో మంగళవారం నెల్లూరు రైల్వే కోర్టుకు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరయ్యారు. నర్మదా రెడ్డి ఆనందయ్య మందును ఆన్‌లైన్లో అమ్మకాలు పెట్టారని చెప్పారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాకణి లాంటి పనికిమాలిన వ్యక్తులను మంత్రులుగా, జిల్లా అధ్యక్షుడిగా జగన్ చేశారని మండిపడ్డారు. వైఎస్ భారతి గురించి మాట్లాడిన టీడీపీ నాయకులను పార్టీ నుంచి తీసేసిన నేత చంద్రబాబు అని చెప్పారు. వల్లభనేని వంశీ, కాకణి లాంటి నేతలు ఇళ్లల్లో ఆడవాళ్లను తిడితే జగన్ అసెంబ్లీలో నవ్వుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెహుల్ చొక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసగాడు, బాంబు బ్లాస్టింగ్ కేసులో ఉన్నా వారిని సైతం పోలీసులు పట్టుకున్నారని.. కానీ కాకణి మాత్రం పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నారంటే అంతకుమించిన ఘనుడు కాకణి అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శలు



గుప్పించారు. కాకణి తన మీద 17 కేసులు పెట్టించారని అన్నారు. తాను కాకణిపై చేస్తున్న విమర్శలకు తనను, తన తల్లిదండ్రులను సైతం అసభ్యంగా తిట్టారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనను కాకాని తిట్టించిన వైసిపీ మాజీ ఎమ్మెల్యే భాషా, ఎమ్మెల్సీలను ఇలానే తిట్టిస్తాను బరిస్తారా అని ప్రశ్నించారు. పట్టపగలు అనుమతులు లేకుండా క్వాడ్జిని కాకణి దోచుకున్నారని ఆరోపించారు. రౌడీలు, హిజ్రాలను పంపి తనను బద్నామ్ చేయాలని చూశారని అన్నారు. అలాంటి వ్యక్తిని జిల్లా అధ్యక్షుడిగా పెట్టిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచించాలని అన్నారు. తప్పుచేసిన కాకణి పోలీసులకు దొరకకుండా పారిపోయి తిరుగుతున్నారని ఆరోపించారు. మీడియా ముందు మాట్లాడే వైసీపీ నేతలు.. కాకణి తప్పు చేయకపోతే పోలీసులకు అప్పగించాలని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సవాల్ విసిరారు. కాకణి చేసిన పాపాలకు తానే అనుభవిస్తున్నాడని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. తన మీద కాకణి తప్పుడు కేసులు పెడితే పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు సహకరించానని తెలిపారు. కాకాణి, వంశీ వంటి నేతలను జగన్ అదుపు చేయలేదని.. అందుకే వైసీపీ 11 సీట్లకు మాత్రమే పరిమితమైందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. 61వేల టన్నుల క్వార్ట్జ్ అక్రమంగా తవ్వేశారని 2003లోనే మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేశారని.. అప్పట్లో పోలీసులు పట్టించుకోలేదన్నారు. నేదురుమల్లి, ఆనం బ్రదర్స్‌తో తాను ధీటు-గా పోరాడానని గుర్తుచేశారు. ఎన్నడూ లేని విధంగా కాకాణి తనపై 17 అక్రమ కేసులు పెట్టించారని మండిపడ్డారు. తాను ధీటు-గా ఎదుర్కొన్నానని..కాకాణిలా పారిపోలేదని.. పోలీసులకు సహకరించానని తెలిపారు. వైసీపీ నేతలు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టిటిడి గోశాలపై అసత్య ఆరోపణలు

- మాజీ చైర్మన్ భూమనపై చర్యలు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బోర్డు సభ్యుడు భాను

**తిరుపతి,ఏప్రిల్15( వెలుతురు):**

వైసీపీ నేత, టిటిడి బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపై తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు అధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఎస్వీ గోశాలలో గోవులు మృతి చెందాయని అసత్య ప్రచారాలపై భూమనపై ధర్మకర్తల మండలి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదు చేశారు. ఎస్వీ గోశాలలో 100 గోవులు మరణించాయని, పవిత్రమైన గోశాలను గోవధ శాలగా మార్చారంటూ కరుణాకర్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని భాను ప్రకాష్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి నిరాధార ఆరోపణలు చేసిన భూమన కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలిసులను లిఖితపూర్వకంగా కోరారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా భూమన కరుణాకర్ రెడ్డి వ్యవహరించారని భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఎస్వీ గోశాలపై అసత్య, అబద్ధపు ప్రచారాన్ని చేశారు.. కరుణాకర్ రెడ్డి దృష్టికి లోపం ఉంది ఏమో.. ఇష్టం



వచ్చినట్లుగా అసత్య ప్రచారం చేస్తున్నారు.. నోరు ఉంది కదాని ఇష్టం వచ్చినట్లు- మాట్లాడారు.. నిరాధార ఆరోపణలు చేసిన భూమనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయామని కోరాం.. కరుణాకర్ రెడ్డి చైర్మన్ గా ఉన్నప్పుడు పెద్ద సంఖ్యలో గోవులు చనిపోయాయి.. గతంలో మేము వైసీపీ హాయంలో జరిగిన అక్రమాలపై ఆధారాలతో బయట పెట్టామని తేల్చి చెప్పారు. వైసీపీ హాయంలో పురుగులు పట్టిన ఆహారాన్ని గోవులకు పెట్టారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. అలాగే టిటిడిలో జరుగుతున్న అక్రమాలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది అని భాను ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు వైసీపీ చేసినా అక్రమాల అన్నిటి పైనా చర్యలు తీసుకుంటుందన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి ఒక్కడే కాదు.. అందరి అవినీతిని బయటకు తీస్తానని చెప్పుకొచ్చారు. తాను స్థానికుడిని కావడంతో టిటిడి కన్నా తనవద్దే ఎక్కువ సమాచారం ఉంటుంది.. భవిష్యత్తులో టీటీడీపై ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ప్రచారాలు చేసినా, మాట్లాడినా ఏ స్థాయి వ్యక్తి పైనా అయినా సరే కఠినమైన చర్యలు తీసుకుంటాం.. ఆ దిశగా బోర్డులో నిర్ణయం తీసుకుంటామని భాను ప్రకాష్ రెడ్డి వెల్లడించారు.

# చిత్తూరులో పరువు హత్య

- మతాంతర వివాహం చేసుకున్న యువతి మృతి
- కూతురును కుటుంబమే కడతేర్చిందన్న అనుమానం
- ఆ దిశగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**చిత్తూరు,ఏప్రిల్15( వెలుతురు):**

చిత్తూరు నగరంలో దారుణం జరిగింది. మతాంతర వివాహం చేసుకున్న ఓ యువతి పుట్టింట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో పరువు హత్యగా పోలీసులు భావిస్తున్నారు. తన భార్యను పుట్టింటి వారికి అప్పగించి.. తిరిగి వచ్చిన మరుసటి రోజే చనిపోయిందని, ఇది పరువు హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిత్తూరు పట్టణానికి చెందిన యాస్మిన్ భాను అనే యువతి.. చిత్తూరు జిల్లాలోని పూతలపట్టుకు చెందిన సాయితేజను ప్రేమించింది. ఈ విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాలు వారి వివాహానికి ఒప్పుకోలేదు. దీంతో గత ఫిబ్రవరిలో ఇద్దరూ ఇంట్లో నుంచి వెళ్ళిపోయి నెల్లూరులో ప్రేమ వివాహం చేసుకొని అక్కడే నివాసం ఉంటున్నారు. కాగా ఇటీవల యువతి తండ్రికి సీరియస్‌గా ఉందని కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయడంతో యాస్మిన్ కన్నవారింటికి వచ్చింది. అయితే మారుసటి రోజు యాస్మిన్ అనుమానాస్పదరీతిలో మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టగా.. ప్రేమ వివాహం చేసుకొని పరువు తీసావని తండ్రి తిట్టడంతో, మనస్తాపం చెంది రాత్రి తన గదిలో ఉరి వేసుకుందని ఆమె తల్లి పోలీసులకు తెలిపింది. దీంతో పోలీసులు ఆ గదిలో పరిశీలించారు. ఉరి వేసుకున్న ఆనవాళ్ళు ఏమీ లేకపోవడంతో అనుమానించి యాస్మిన్ తల్లిని, సోదరిని అదుపులోకి తీసుకున్నారు. తండ్రితో పాటు పలువురు బంధువులు పరారీలో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ కేసును పరువు హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అయితే విషయం



తెలుసుకున్న భర్త.. తన భార్యను కన్నవారే చంపేసి, మార్చురీలో శవాన్ని చూపించారంటూ తీవ్రంగా విలపించాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది.పోలీసుల కథనం ప్రకారం.. చిత్తూరు స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన యాస్మిన్‌బాను (26) ఎంబీఏ పూర్తి చేసిందని, బీటె-క్ చదివిన సాయితేజ్‌తో కాలేజీ రోజుల్లోనే ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసిందని, ఈ క్రమంలో వారిద్దరూ వివాహానికి సిద్దమయ్యారన్నారు. అయితే సాయితేజ ఎస్సీ వర్గానికి చెందిన వాడు కావడంతో ముస్లిం అయిన యాస్మిన్ తల్లిదండ్రులు షౌకత్ అలీ, ముంతాజ్ అంగీకరించలేదన్నారు. దీంతో వారు ఈ ఏడాది ఫిబ్రవరి 9న నెల్లూరులో వివాహం చేసుకున్నారు. అయితే తమ తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని అదే నెల 13న తిరుపతి డీఎస్పీని కలిసి కోరారన్నారు. దీంతో పోలీసులు ఇరు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు చెప్పారు. కొద్ది రోజుల తర్వాత యాస్మిన్ కుటుంబ సభ్యులు ఫోన్‌లో కుమార్తెతో మాట్లాడటం మొదలుపెట్టారు. తండ్రి షౌకత్ అలీకి ఆరోగ్యం బాగాలేదని, ఒకసారి వచ్చి చూసి వెళ్లాలని యాస్మిన్‌ను పదేపదే కోరడంతో ఆదివారం ఉదయం సాయితేజ తన భార్యను తీసుకువచ్చి యాస్మిన్ కన్నవారింట్లో దించి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కాసేపటికే సాయితేజ తన భార్యకు ఫోన్ చేస్తే కలవలేదు. దీంతో అనుమానం వచ్చి నేరుగా వారింటికి వెళ్లగా.. యాస్మిన్ ఇంట్లో లేదని, ఆత్మహత్య చేసుకోవడంతో ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉందని సమాధానం చెప్పడంతో.. ఆసుపత్రికి వెళ్లి భార్య మృత దేహాన్ని చూసి బోరున విలపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వేలానికి గోల్కొండ రాయల్ డైమండ్..

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ( వెలుతురు)**

ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హెూటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.అప్పట్లో ఇండోర్ మహారాజు వద్ద ఈ ఉంగరం ఉండేదని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ జ్యుయెలరీ చీఫ్ రాహుల్ కడాకియా అన్నారు. ఇటువంటి ఉంగరం ఎన్నడూ వేలానికి రాలేదని తెలిపారు. వేలంలో ఇది రూ.300 కోట్లు - రూ.430 కోట్ల మధ్య అమ్ముడుపోవచ్చని చెప్పారు.ఇలాంటి చాలా అరుదైన, విలువైన వజ్రాలు జీవితకాలంలో ఒకసారి మాత్రమే వేలానికి వస్తాయని రాహుల్ కడాకియా అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ అయిన తమ క్రిస్టీస్ 259 సంవత్సరాలుగా పనిచేస్తోందని తెలిపారు. ఇన్నేళ్లుగా క్రిస్టీస్ ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ, ముఖ్యమైన వజ్రాలను విక్రయించిందని అన్నారు.తమ వేలంలో గతంలో అమ్ముడైన ప్రసిద్ధ గోల్కొండ వజ్రాలకు ఉదాహరణలుగా పలు డైమండ్ల పేర్లను ఆయన వివరించారు. ఆర్చ్‌డ్యూక్ జోసెఫ్ డైమండ్, ప్రిన్సీ డైమండ్, విట్టెల్స్‌బాచ్ డైమండ్ వంటివాటిని అమ్మామని చెప్పారు. రాజ వారసత్వం, అసాధారణ రంగు, పరిమాణంతో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ప్రపంచంలోనే అత్యంత అరుదైన నీలి రంగు వజ్రాలలో ఒకటని రాహుల్ కడాకియా ఒక ప్రకటనలో తెలిపారు.క్రిస్టీస్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ఒకప్పుడు ఇండోర్ మహారాజా యశ్వంత్ రావు హెూల్కర్ IIకు చెందింది. 1923లో మహారాజ తండ్రి ఈ వజ్రంతో కూడిన ఒక బ్రాస్లెట్‌ను తయారు చేయాలని ఫ్రాన్స్‌కు చెందిన ప్రసిద్ధ లగ్జరీ ఆభరణాల బ్రాండ్ చౌమెట్‌కి ఆర్డర్ ఇచ్చారు. అంతకు ముందు అదే ఆభరణాల సంస్థ నుంచి "ఇండోర్ పియర్స్" అనే రెండు గోల్కొండ వజ్రాలను ఆయన కొనుగోలు చేశారు.దశాబ్ద కాలం తర్వాత మహారాజు ప్రసిద్ధ ఫ్రెంచ్ లగ్జరీ ఆభరణాల కంపెనీ మౌబౌసిన్‌కు మరో ఆర్డర్ ఇచ్చారు.

ఈ కంపెనీ 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను రీడిజైన్ చేసి ఇండోర్ పియర్ వజ్రాలతో పాటు హారంలో చేర్చింది.న్యూయార్క్‌కు చెందిన హ్యారీ విన్‌స్టన్ అనే ప్రసిద్ధ ఆభరణాల వ్యాపారి 1947లో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను కొన్నారు. ఆయన ఈ నీలి వజ్రాన్ని అదే పరిమాణంలో ఉన్న మరొక తెల్ల వజ్రాన్ని వాడుతూ బ్రూచ్‌ను తయారు చేశారు. తరువాత ఆ బ్రూచ్ బరోడా మహారాజుకు చేరింది. కొంతకాలం తర్వాత ఆ బ్రూచ్ ఆ రాజకుటుంబం ఒక ప్రైవేట్ వ్యక్తికి అమ్మింది. ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హెూటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.

# విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా రామరామ సాంగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి కాంపౌండ్ నుంచి వస్తోన్న సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ విశ్వంభర బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆష్రిత వేముగంటి నందూరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఇటీవలే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ రమ రామను విడుదల చేశారని తెలిసిందే. ఈ పాటకు మ్యూజిక్ లవర్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ పాట యూట్యూబ్‌లో నంబర్ 1 ప్లేస్‌లో –టె–ండింగ్ అవుతోంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజ్ చేయగా.. శంకర్ మహదేవన్, ఐరా ఉడుపి, లిప్సికా భాష్యం పాడారు. రామ రామ సాంగ్ విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తాజా వార్త చెప్పకనే చెబుతోంది. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ చేసిన విశ్వంభర –టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనుండగా.. మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.






# అమీర్‌ను డైరెక్ట్ చేయనున్న వంశీ పైడిపల్లి

కొంతకాలంగా వంశీ పైడిపల్లి బాలీవుడ్ ఎంటర్‌పై దృష్టి సారించాడు. అమిర్ ఖాన్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించే క్రమంలో ఆయనకు స్టోరీ లైన్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమిళనాడులో విజయ్‌తో ఓ సినిమాచేసిన వంశీ పైడిపల్లి ఇప్పుడు హిందీలోకి అడుగు పెట్టాలని చూస్తున్నారు. దిల్ రాజు ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టు–గా చెబుతున్నారు. ఇటీవల ఆయన ప్రొడ్యూస్ చేసిన పాన్ ఇండియా లెవెల్‌లో మరో క్రేజీ ప్రాజెక్టు పట్టాలెక్కేలా కనిపిస్తోంది. బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆమిర్ ఖాన్ , టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లితో సినిమా వర్కవుట్ అయ్యేలా ఉందన్న టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న న్యూస్ ప్రకారం.. వంశీ చెప్పిన సింగిల్–లైన్ ప్లాట్ ఆమిర్‌ని ఫిదా చేసిందట. దీంతో పూర్తి స్క్రిప్ట్ కోసం ఆమిర్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడని తెలుస్తోంది. వంశీ తన రైటర్స్ టీమ్‌తో స్క్రిప్ట్‌ని డెవలప్ చేస్తున్న స్టైల్ ఆమిర్‌కి బాగా నచ్చిందట. స్క్రిప్ట్ రెడీ అయిన వెంటనే మేకర్స్ ఆయనకు చెప్పబోతున్నట్టుగా తెలుస్తోంది. కొంతకాలంగా వంశీ పైడిపల్లితో పాన్ ఇండియా ట్రావెల్ చేస్తున్న దిల్ రాజు నే ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబో తున్నట్టుగా చెబుతున్నారు.

# కథ కోసం నానా తంటాలు పడతా: నాగ్ అశ్విన్

'కల్కి'లో ప్రతి సన్నివేశానికి బ్యాక్‌గ్రౌండ్‌లో ఎంతో వర్క్ చేశాం. తెరపై చూశాక అది ఫైటింగ్ సీన్ అంటారు. కానీ, దాని వెనక ఎంతో కష్టం ఉంటుందని దర్శకుడిగా తన అనుభవాలను పంచుకున్నారు నాగ్ అశ్విన్. తాజాగా కాలేజ్ స్టూడెంట్స్‌తో ముచ్చటించిన ఆయన ఇండస్ట్రీలో తన అనుభవాలను పంచుకున్నారు. వారితో కొన్ని ఆసక్తికర విషయాలను చెప్పారు. చేసే పని ఏదైనా వందశాతం కష్టపడాలి. షార్ట్ ఫిల్మ్, సినిమా ఏదైనా ఇదే చివరిది అని భావించి తీయాలి. నేను బుక్స్ బాగా చదువుతాను. సినిమాల కంటే పుస్తకాలు మనపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. పరిశ్రమలో కొనసాగాలంటే పుస్తకాలు చదవడం కూడా ముఖ్యమే. మనం అనుకున్న కథను ప్రేక్షకులకు అర్థం అయ్యేలా రాయగలగాలి. ఒక సామాన్య కథను కూడా ఆసక్తిగా రాయాలి. ఆ సినిమా వెనక నా ఒక్కడి కష్టం మాత్రమే లేదు. అది ఒక టీమ్ కష్టం. టీమ్‌లోని అందరి సలహాలు వింటాను. చిన్నప్పటి నుంచి మహాభారతం గురించి తెలుసు. దాని ఆధారంగా సినిమా తీయాలంటే కొంచెం భయపడ్డానని చెప్పారు. నేను కొన్ని ప్రాజెక్ట్‌లకు ఎడిటర్‌గా కూడా వర్క్ చేశాను. సినిమా బాగా రావడానికి ఎడిటింగ్ ప్రధానం. మొదట స్టోరీ రాసుకుంటాను. అందులోని పాత్రల ఆధారంగా నటీనటులను ఎంపిక చేసుకుంటాను. కల్కిలో పాత్రలు రాసిన తర్వాత మొదట అమితాబ్ బచ్చన్‌ను, తర్వాత ప్రభాస్‌ను సెలక్ట్ చేసుకున్నాను. ది నేను డైరెక్ట్ చేస్తే బాగుండేది అని ఏ సినిమాకు అనిపించలేదు. కానీ, 'ఖలేజా 'డియర్ కామ్రేడ్' సినిమాలను నేను ఎడిట్ చేసి ఉంటే బాగుండేది అనిపించింది. నాకు కామెడీ సినిమాలు అంటే ఇష్టం. ముఖ్యంగా జంధ్యాల సినిమాలు నచ్చుతాయి. నేను ఏదైనా రాసుకున్న తర్వాత రెండు నెలలకు అదే ఐడియా వేరే సినిమా –ట్రైలర్‌లో కనిపిస్తుంది. దీంతో దాన్ని పక్కన పెట్టాల్సి వస్తుంది. 2008లో ఒక కథ రాసుకున్నాను. జ్ఞాపకాలు, కలలు ఈ రెండు అంశాలతో రాశాను. ఇదే కాన్సెప్ట్‌తో వచ్చిన హాలీవుడ్ సినిమా 'ఇన్‌సెప్షన్' ట్రైలర్ చూశాక వారం రోజులు డిప్రెషన్‌లోకి వెళ్లాను. ఎంతో కష్టపడి కొత్తగా ఒక కథను రాస్తే గుర్తించే వారికంటే.. గతంలో వచ్చిన లవ్‌స్టోరీనే మరోసారి తెరకెక్కిస్తే దాని గురించి మాట్లాడేవారు ఎక్కువమంది ఉంటారు. అందుకే ఎప్పుడూ కొత్తగా రాసుకోవాలి. ఎక్కడా రాని పాయింట్ గురించి సినిమాలు తీయాలని అన్నారు.




# కథను నమ్మితే... ఇక రంగంలోకి దిగిపోతా

## నటుడు విజయ్ సేతుపతి స్పష్టీకరణ

విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాను ప్రకటించినప్పటినుంచి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. పూరి ఫామ్‌లో లేరని ఆయన స్క్రిప్ట్‌ను ఎందుకు ఎంచుకున్నారంటూ విజయ్ సేతుపతిని ట్యాగ్ చేస్తూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా దీనిపై ఈ హీరో స్పందించారు. దీనికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. పూరి జగన్నాథ్‌తో నేను చేయనున్న సినిమా షూటింగ్ జూన్‌లో ప్రారంభం అవుతుంది. గతంలో వారు చేసిన సినిమాల ఫలితాల ఆధారంగా దర్శకులను జడ్జ్ చేయను. స్క్రిప్ట్ నచ్చితే సినిమా చేస్తాను. పూరి చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. అందుకే అంగీకరించాను. ఇలాంటి కథ ఇప్పటివరకూ చేయలేదు. నేను ఎప్పుడూ కొత్త వాటికి ప్రాధాన్యం ఇస్తాను. గతంలో చేసిన స్టోరీలు రిపీట్ కాకుండా చూసుకుంటాను. ఈ సినిమాలో టబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె గొప్ప నటి. టాలెంటెడ్ కోస్టార్. గతంలో ఎప్పుడూ ఆమెతో కలిసి స్క్రీన్ పంచుకోలేదు. ఈ సినిమాలో ఆమెతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. విజయ్ సేతుపతి: నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో 'మహారాజ' నాకు ప్రత్యేకమైనది. అందులోని పాత్ర కష్టమైనది. పిల్లలపై జరుగుతోన్న అఘాయిత్యాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వాటిలో నటించేటప్పుడు వణికిపోయాను. 'సూపర్ డీలక్స్, 'ఉప్పెన'లోని పాత్రలు కూడా కష్టమైనవే. కానీ 'మహారాజ' నా హృదయాన్ని హత్తుకుంది. ఎందుకంటే నేను నిజజీవితంలోనూ ఒక కుమార్తెకు తండ్రినే కదా. నేను బలమైన సందేశం ఉన్న సినిమాలు ఎంచుకుంటాను. అదే నా బలం. పూర్తిగా వినోదాత్మక చిత్రాలలో నటించకూడదని కాదు.. వినోదంతో పాటు సందేశం కూడా ఉండాలి. పూరి సినిమాతో పాటు– మరో రెండు తమిళ ప్రాజెక్టులు చేస్తున్నాను. మిస్కిన్ దర్శకత్వంలో 'ట్రైన్' చిత్రంలో నటిస్తున్నాను. ఇది యాక్షన్ చిత్రం. దీనితో పాటు మరో మర్డర్ మిస్టరీలో నటిస్తున్నాను.






# కొత్త చిత్రాలతో సందడి

## న్యూ ఇయర్ సందర్భంగా పలు ప్రాజెక్టులు


ఉగాదితో తెలుగువారందరికీ కొత్త సంవత్సరం ప్రారంభమైనట్టు– కేరళ, తమిళనాడు ప్రాంత వాసులకు ఏప్రిల్ 14తో నూతన సంవత్సరం మొదలైంది. ఈ విషును తారలంతా ఘనంగా సెలబ్రేట్ చేసారు. ఈ సందర్భంగా కోలీవుడ్, మాలీవుడ్ హీరోలు తమ రాబోయే చిత్రాలకు సంబంధించి అప్ డేట్స్ షేర్ చేసుకున్నారు. అమరన్ తో సూపర్ హిట్ కొట్టిన శివ కార్తికేయన్ తాజాగా మురుగదాస్ డైరెక్షన్ లో చేస్తున్నసినిమా మదరాసి రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేసింది యూనిట్. సెప్టెంబర్ 5కే థియేటర్లలో బొమ్మ రాబోతుంది. మాలీవుడ్ స్టార్ యాక్టర్.. నివిన్ పౌలీ విషు సందర్భంగా ఓ సినిమాను స్టార్ట్ చేశాడు. బేబీ గర్ల్ అనే మూవీకి ఏప్రిల్ 14న కొబ్బరి కాయ కొట్టారు. ఫస్ట్ కుంచికో బొబన్ హీరోగా అనుకుంటే ఆయనకున్న కమిట్‌మెంట్స్ వల్ల డేట్ అడ్జస్ట్ చేయలేకపోవడంతో ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ నివిన్ చెంతకు చేరింది. 2023లో మలయాళంలో వచ్చిన గరుడన్ ఫేం అరుణ్ వర్మ ఈ చిత్రానికి దర్శకుడు. ఫహాద్ ఫజిల్, కళ్యాణీ ప్రియదర్శన్ జంటగా నటిస్తోన్న మూవీ ఒదుం కుతిరా చదూం కుతిరా ఫస్ట్ లుక్ పోస్టర్ విషు సందర్భంగా రిలీజ్ చేశారు. రొమాంటిక్ కామెడీ జోనర్‌లో క్రేజీ వెడ్డింగ్ స్టోరీగా తెరకెక్కిస్తున్నాడు డైరెక్టర్ అల్తాఫ్ సలీమ్. అలాగే తెలుగులో ఈగ తరహాలో మలయాళంలో ÷–లపైతో సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. లవ్లీ అనే –టైటిల్‌తో తెరకెక్కుతోన్న మూవీ నయా అప్డేట్ వచ్చింది. ఈ సినిమాను గతంలో ఏప్రిల్ 4న విడుదల చేయాలనుకోగా ఇప్పుడు మే 4కు పోస్ట్ పోన్ అయిందని తెలుపుతూ పోస్టర్ రిలీజ్ చేసారు. మొత్తానికి పండగ కానుకాగా సినిమాల విశేషాలను ప్రేక్షకులతో షేర్ చేసుకున్నారు మేకర్స్.




# గుడ్ బ్యాడ్ అగ్లీలో ఇళయారాజా పాటలు రీమిక్స్

## మైత్రీ మూవీ మేకర్స్‌కు రాజా నోటీసులు

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా నోటీసులు పంపారు. తెలుగులో అగ్రగామి సంస్థగా సినిమాలు రూపొందిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో తమిళ సినిమా పరిశ్రమలో అడుగుపెట్టింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ హీరోగా యంగ్ డైరెక్టర్ ఆదిక్ దర్శకత్వంలో భారీ బడ్జెట్ పై ఏఇ÷ఖ సినిమాను నిర్మించారు. ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బెస్టర్ హిట్ టాక్ తెచ్చుకుని రికార్డ్ స్థాయి కలెక్షన్స్ రాబడుతోంది. అయితే ఈ సినిమాలో కొన్ని సీన్స్ లో ఒకప్పటి తమిళ్ సినిమాలలోని ఇళయరాజా సంగీతం అందించిన సాంగ్స్ ను గుడ్ బ్యాడ్ అగ్లీలో వారిని రీమిక్స్ చేసి ఉపయోగించారు. ఆ సదరు సీన్స్ థియేటర్స్ లో ఫ్యాన్స్ ఆ సాంగ్స్ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. అందుకు సంబందించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే తన పాటను అనధికారికంగా వాడుకోవటం పై ఇళయరాజా ఆగ్రహం వ్యక్తం చేసారు. సినిమాలో తన పాటలు వాడడం పై నోటీ–సులు ఇచ్చారు ఇళయరాజా. నష్టపరిహారం కింద తనకు ఐదు కోట్ల రూపాయలు చెల్లించాలంటూ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు నోటీ–సులు పంపారు ఇళయరాజా. అదే విధంగా గుడ్ బ్యాడ్ అగ్లీలోని మూడు పాటలను వెంటనే నిలిపివేయాలని మరియు 7 రోజుల్లోగా చిత్ర బృందం బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఇళయరాజా డిమాండ్ చేసారు. మరి ఇప్పుడు మైత్రి మూవీ మేకర్స్ ఈ నోటిసులపై ఎలా స్పందిస్తారో చూడాలి.



## కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి

- దళారులను నమ్మి మోసపోవద్దు



**నిజామాబాద్,ఏప్రిల్15( వెలుతురు):**
రైతులు దళారులను నమ్మి మోస పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం విక్రయించి పూర్తి మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ అధికారులు సూచించారు. తూకాల్లో మోసం జరుగకుండా డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేశాం. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యం విక్రయించాలన్నారు. ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకుంటోంది. ధాన్యం డబ్బును బ్యాంకు ఖాతాలో వేయడంతో పాటు తూకాల్లో ఎలాంటి మోసాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిని అన్నదాతలు అర్థం చేసుకుని ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి. ప్రతీ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల పంటను తరలించేందుకు అయ్యే ఖర్చును తగ్గిచ్చేందుకు కృషి చేస్తోంది. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. డిజిటల్ తూకం మిషన్, మద్దతు ధరతో పాటు సకాలంలో రైతులకు డబ్బులు అందిస్తున్నారు.ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోలు అమ్మకునేందుకు దళారులను ఆశ్రయించడంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. దీనిని గమనించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు వరి ధాన్యాన్ని పెద్ద ఎత్తున ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు చేరుస్తున్నారు. రైతుల వద్ద నుంచి పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ బుక్, ఆధార్ నంబర్లను సేకరించి తేమ 17 శాతం వరకు ఉంటేనే మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. రైతుల అకౌంట్లలో నాలుగైదు రోజుల్లో నగదు చేరేలా చర్యలు చేపడుతున్నారు.

## రైతులకు గుదిబండగా అప్పులు

- తీర్చలేక నానాయాతన పడుతున్న అన్నదాత



**జగిత్యాల,ఏప్రిల్15( వెలుతురు):**
వ్యవసాయం కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రధానంగా పంటపెట్టుబడుల కోసం నేటికీ వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుని అవస్థలు పడుతున్నారు. తీసుకున్న అప్పులకు వడ్డీలు తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. దీంతో సమస్య తాత్కాలిక ఉపశమనం కలిగిస్తోంది తప్ప సమస్యను శాశ్వతంగా దూరం చేయడం లేదు. ఇదే సమయంలో అప్పుల ఊబినుంచి బయటపడడానికి ఆత్మహత్యలను వీరు ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆయా రైతుల కుటుంబాలు మరింతగా ఊబిలో చిక్కుకుని పోతున్నాయి. తెలంగాణలో పరిస్థితిని మార్చేలా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నారు. రైతులకు పెట్టబడతో పాటు రాయితీ విత్తనాలు,ఎరువులు అందుతున్నాయి. అలాగే బీమా సౌకర్యం రాబోతున్నది. ఇకపోతే 24 గంటల ఉచిత కరెంట్ అందుతోంది. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి. అంతేగాకుండా బలవంతంగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ఇవన్నీ జాతీయస్థాయిలో జరగాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలుకూడా తెలంగాణ తరహాలో చొరవ తీసుకోవాలి. అప్పుడే మార్పు కనిపిస్తుంది. రైతులకు భరోసా దక్కి వ్యవసాయం ముందుకు సాగుతుంది. తెలంగాణలో రైతుబంధు సాయం అందడంతో ఇప్పుడు వీరిలో కొంత భరోసా పెరగింది. రైతు ఏ కారణంతో చనిపోయినా ఆ కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా బీమా పరిహారంలో రూ.5 లక్షలు అందజేస్తారు. గ్రామాల్లోని రైతు సమన్వయ సమితుల సభ్యులు అధికారులకు సహకారం అందిస్తున్నారు. గ్రామాల్లోని రైతులు అధికారులకు పట్టాదారు పాసుపుస్తకాల్లోని వివరాలు, ఆధార్‌కార్డు, నామినీ, ఇతర విషయాలను చెబుతున్నారు.

## ఉపాధి కూలీలకు రక్షణ

- పని క్షేత్రాల్లో మంచినీటి సౌకర్యం

**వరంగల్,ఏప్రిల్15( వెలుతురు):**
జిల్లాలో వేసవిలో తగు జాగ్రత్తలతో ఉపాధిహామీ పనులను చేపడుతున్నారు. పనిప్రదేశాల్లో రక్షణచర్యలు చేస్తున్నారు. పూర్తి రక్షణ చర్యలతో పనులకు హాజరయ్యేలా డీఆర్‌డీవో అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. మరోవైపు ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో కూలీలు పనిచేసే ప్రాంతాల్లో వసతులు కల్పిస్తున్నారు. నీడతో పాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గుర్తించిన పనులను చేపడుతూ స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటలు ముగియడంతో నెల రోజులుగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటిగుంటలు, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం, కందకాలు, చెక్‌డ్యాం కాలువల్లో పూడికతీత పనులు ఊటకుంటలు, టేకు నర్సరీలు, కిచెన్ షెడ్‌లు, గడ్డి పెంపకం, పశువుల నీటి తొట్టెలు, పండ్లతోటల పెంపకం, డంపిగ్‌యార్డులు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి నిల్వలకు సంబంధించిన పనులు, ప్రభుత్వ పాఠశాలలో వంటశాలల నిర్మాణాలను చేపడుతారు. కూలీల సంఖ్యను మరింత పెంచేందుకు ఎంపీడీవోలు, ఉపాధిహామీ ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జూన్ ముగిసే నాటికి కూలీలకు పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం అధికారులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తాయి. జూన్‌నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. వేసవిలో గ్రామాల్లోని పేదలు వ్యవసాయ కూలీలు పనులు లేకపోవడంతో ఎక్కువ మంది ఉపాధిహామీ పనులపై ఆధారపడుతున్నారు.

# అటకెక్కిన మొక్కల పెంపకం

- ఎక్కడా కానరాని నర్సరీల హడావిడి
- సామాజిక అడవుల బాధ్యతను విస్మరించిన మంత్రి

**నిజామాబాద్,ఏప్రిల్15( వెలుతురు):**
తెలంగాణలో చేపట్టిన హరితహారం మంచి ఫలితాలు ఇచ్చింది. అయితే అందులో మంచిచెడులను విశ్లేషించి ముందుకు సాగాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా ఎక్కడా ఆ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మొక్కలను నాటాలని సోషల్ ఫారెస్ట్, ఈజీఎస్ శాఖల అధికారులు దృఢనిశ్చయంతో గతంలో పనిచేశారు. కోతులు వాపస్ పోవాలన్న కెసిఆర్ నినాదాం కూడా బాఆనే పనిచేసింది. కానీ ఇప్పుడు అలా జరగడం లేదు. మానవజాతి మనుడగకు చెట్లు సజీవసాక్ష్యం. వృక్షాలు అంతరించడం వల్లనే సరైన వర్షాలు కురువడం లేదని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. వరుణ దేవుడు కరుణించడంతో చాలాచోట్ల నాటిన మొక్కలు జీవం పోసుకున్నాయి. అయితే ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇది నిరంతరాయంగా కొనసాగాలి. దీనికి పెద్దపీట వేయాలి. హరితహారాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాలని కెసిఆర్ సన్నాహాలు చేసారు. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేసారు. గత హరితహారంలో పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరుపట్టేలా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల



ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టింది. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టారు. ఈ నర్సరీల్లో పండ్ల విభాగంలో జామ, ఉసిరి, నిమ్మ, బొప్పాయి, కర్జూరా, ఫ్లవరింగ్, సాధారణ మొక్కలు కానుగ, చింత, నీలగిరి, కుంకుడు, వెదురు, వంటి మొక్కలు పెంచారు. నర్సరీలో ఉన్న మొక్కలకు నీరుపట్టి బతికించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటూ, ఆయా నర్సరీ బాధ్యులకు ఎప్పటి కప్పుడు సూచనలు ఇస్తూ, వాటిని సందర్శిస్తూ, మొక్కల ఎదుగుదల తీరును పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కాగానే జూలైలో కార్యక్రమం ప్రారంభం అయ్యేది. కానీ అటవీశాఖ మంత్రిగా కొండా సురేఖ అడవుల రక్షణ పెంపకంపై ఎక్కడా శ్రద్ధ పెట్టడం లేదు. నిరంతరాయంగా మొక్కలు పెంచే విధంగా కార్యాచారణ చేయడం లేదు. దీంతో మొక్కల పెంపకం అటకెక్కింది.

# విస్తరణకు బ్రేక్ ఇచ్చిన జానా లేఖ



**నల్గొండ, ఏప్రిల్ 15, ( వెలుతురు)**
కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ ఎప్పటికి జరుగుతుందో.. ఇప్పటికైతే క్లారిటీ లేదు. కానీ.. ఎప్పుడు కేబినెట్ విస్తరణ జరిగినా.. ఒక బెర్త్ మాత్రం తనకు పక్కా కావాలనే లెక్కల్లో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. నల్గొండలోని మెజారిటీ ఎమ్మెల్యేల మాట కూడా ఇదే. మంత్రి పదవికి రాజగోపాల్ రెడ్డికి అన్ని విధాలా అర్హుడైన నాయకుడే అనేది వాళ్ల వాదన. కానీ.. పెద్దలు జానారెడ్డి మాత్రం.. ఒక్క లేఖతో మొత్తం లెక్కే మార్చేశారనే చర్చ జరుగుతోంది. అసలు.. జానారెడ్డి లేఖలో ఉన్న లెక్కేంటి? అది వర్కవుట్ అయితే.. రాజగోపాల్ రెడ్డి మినిస్టర్ బెర్త్‌కు.. ఎర్త్ తప్పదా?అన్నయ్య.. ఆల్రెడీ మినిస్టర్. ఆయన.. ఎమ్మెల్యే. అయినా సరే.. అన్న లెక్క అన్నదే. నా లెక్క నాదే. ఇదే.. మంత్రి పదవిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లెక్క. అందుకోసమే.. మినిస్టర్ పోస్టు కోసం గట్టిగా అడిగేస్తున్నారు. మంత్రి పదవి అడుక్కుంటే వచ్చేది కాదని.. కెపాసిటీని బట్టి వస్తుందని.. ఆ కెపాసిటీ తన దగ్గర కావాల్సినంత ఉందని చెబుతూ ఉంటారు. కానీ.. ఒకే ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులెట్లా? అనేది కాంగ్రెస్‌లో జరుగుతున్న చర్చ. దీనికి కూడా దిమ్మతిరిగిపోయే ఎగ్జాంపుల్ ఒకటి చెప్పారు రాజగోపాల్ రెడ్డి.ఇండియన్ క్రికెట్ టీమ్‌లో ఒకప్పుడు యూసుఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్ ఇద్దరూ ప్రాతినిధ్యం వహించలేదా? వాళ్లకు లేనిది.. ఒకే ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులిస్తే తప్పా? అని కాస్త లాజికల్‌గానే అడిగారు. పైగా.. పదవి అనేది అలంకారం కాదని.. ఓ బాధ్యత అని.. ఆ బాధ్యతని గుర్తించి.. ప్రజలకు మంచి చేయాలని చెప్పారు. భువనగిరి ఎంపీ సీటు గెలిపిస్తే.. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ తనకు హామీ ఇచ్చింది నిజమన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తే కిరీటంగా కాదు.. బాధ్యతగా వ్యవహరిస్తానన్నారు. తనలాంటి వ్యక్తి.. మంత్రి పదవి ఇవ్వాలని పదే పదే అడుగుతుంటే బాధేస్తోందని.. మనసులో మాట బయటపెట్టేశారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో.. రాజకీయంగా కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఎంత పట్టు ఉందో వేరే చెప్పక్కర్లేదు. వాళ్లు ఫోకస్ పెడితే.. ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లు గెలిపించగలిగే సత్తా, స్థోమత ఉన్నోళ్లనే చర్చ ఎప్పట్నుంచో ఉంది. వాళ్ల స్టామినా ఏమిటో తెలుసు కాబట్టే.. కాంగ్రెస్ పార్టీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ముందే మంత్రి పదవి కట్టబెట్టేసింది. ఇప్పుడు.. ఆయన తమ్ముడు రాజగోపాల్ రెడ్డి కూడా మినిస్టర్ రేసులో ఉన్నారు. ఇప్పటికే.. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంత్రులుగా ఉన్నారు.రాజగోపాల్ రెడ్డి కూడా మినిస్టర్ పోస్టు ఆశిస్తున్నారు. ఇది.. ఎప్పట్నుంచో నడుస్తున్న వ్యవహారమే. కానీ.. ఇటీవలే.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డి రాసిన ఓ లేఖ.. నల్గొండ రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నల్గొండ జిల్లా నేత అయి ఉండి.. రంగారెడ్డి జిల్లా నేతకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానానికి లేఖ రాశారు. ఇదే.. ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.పొలిటికల్‌గా జానారెడ్డి ఇప్పుడు యాక్టివ్‌గా లేరు. ఆయన ఇద్దరు కుమారులు.. యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వచ్చేశారు. ఒక కుమారుడు ఎమ్మెల్యేగానూ గెలిచారు. తన కుమారుల రాజకీయ భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొనే.. జానారెడ్డి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి తెలివిగా చెక్ పెట్టారనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే.. కోమటిరెడ్డి బ్రదర్స్‌లో ఒకరికి మంత్రి పదవి ఉంది. మళ్లీ రాజగోపాల్ రెడ్డికి కూడా మినిస్టర్ పదవి దక్కితే.. జిల్లాలో తన ఫ్యామిలీ రాజకీయంగా ఎదగడం కష్టమవుతుందనే ఆలోచనతోనే.. జానారెడ్డి ఇలా చేశారనే చర్చ జరుగుతోంది.లేకపోతే.. 30 ఏళ్లు మంత్రి పదవి అనుభవించిన జానారెడ్డికి.. ఇప్పుడు రంగారెడ్డి జిల్లా నేతలకు మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచన ఎందుకొచ్చిందనేది.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే అడిగేస్తున్నారు. తన మంత్రి పదవి విషయంలో జానారెడ్డి లాంటివాళ్లు.. ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని చెప్పడంతో.. పెద్దాయన ఆ లేఖ ఎందుకు రాశారో ఇప్పుడిప్పుడే అందరికీ అర్థమవుతోంది.మరోవైపు.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి విషయంలో.. ఉమ్మడి నల్గొండ జిల్లా నేతల నుంచి మంచి మద్దతే ఉంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గానీ, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గానీ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సపోర్ట్ రాజగోపాల్ రెడ్డికే ఉంది. వాళ్లంతా.. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి కోసం ఎక్కడ సంతకం చేయమన్నా చేస్తామంటున్నారు. ఆయనకు మంత్రి పదవి ఇస్తే.. పార్టీ, ప్రభుత్వం మరింత బలపడుతుందని భావిస్తున్నట్లు బహిరంగంగానే చెబుతున్నారు. కానీ.. ఇప్పటికే ఈ విషయంలో జానారెడ్డి తన రాజకీయ చాణక్యం ప్రదర్శించేశారు. నల్గొండ జిల్లా నేతగా ఉండి కూడా.. రంగారెడ్డి జిల్లా నాయకుడికి ఓ మంత్రి పదవి ఇవ్వాలని పార్టీ అధిష్టానానికి లేఖ రాసి హాట్ టాపిక్‌గా మారారు.ఇది జరిగిన తర్వాత.. పార్టీలో సీనియర్ నాయకుడిగా జానారెడ్డి.. అన్ని జిల్లాల నేతలకు న్యాయం జరగాలనే.. లేఖ రాశారని అంతా అనుకున్నారు. కానీ.. నల్గొండలో తన కుమారులు రాజకీయంగా బలపడాలనే లెక్కలతోనే.. మంత్రి పదవి రంగారెడ్డి జిల్లాకు ఇవ్వాలని లేఖ రాయడం వెనకున్న రాజకీయమేంటే.. అందరికీ ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. ఓ రకంగా.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మినిస్టర్ బెర్త్‌కు.. జానారెడ్డి ఒక్క లేఖతో ఎర్త్ పెట్టేశారనే చర్చ సాగుతోంది.

# 1,213 ఎకరాల్లో గులాబీ సమావేశం

**వరంగల్, ఏప్రిల్ 15, ( వెలుతురు)**
14ఏళ్ల ఉద్యమం.. పదేళ్ల అధికారం.. ఇప్పుడు ప్రతిపక్షంగా కదనోత్సాహం.. మొత్తంగా గులాబీసేన 25వసంతాలు పూర్తి చేసుకుంటోంది. అధికార పార్టీగా పదేళ్లపాటు పండగలా ఆవిర్భావ వేడుకలు చేసుకున్న కారు పార్టీ.. ఇప్పుడు విపక్షంగా రజోత్సవ వేడుకలకు సిద్ధమవుతోంది. ఉద్యమకాలం నుంచి సెంటిమెంటల్‌గా కలిసొచ్చిన వరంగల్, కరీంనగర్ జిల్లాలనే.. ఈ వేడుకలకు వేదికగా ఎంచుకున్న గులాబీపార్టీ.. అక్కడి నుంచే మరో అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకుంది. ఉమ్మడి జిల్లాల మధ్య పొలిమేరల్లోనే మహాసభ నిర్వహణకు జోరుగా ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఈసారి బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు.. రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఉద్యమ పార్టీగా, అధికారపక్షంగా ఇంతకు ముందు ఒకెత్తు.. ఇప్పుడు ప్రతిపక్షంగా మరో ఎత్తు. అందులోనూ 25ఏళ్ల రజతోత్సవ పండగ. అందుకే, మహాసభ నిర్వహణ ద్వారా.. తెలంగాణ నలుమూలల నుంచి కార్యకర్తలను, ప్రజలను రప్పించాలని చూస్తోంది గులాబీ సేన. అధికారంలో ఉండి ఉంటే ఆ రేంజ్ వేరేలా ఉండేది. కానీ ఇప్పుడు ప్రతిపక్షంగా.. ఎన్నో అడ్డంకులను అధిగమించి అనుకున్న స్థాయిలో మహాసభను విజయవంతం చేయడం పెద్ద టాస్క్ అనే చెప్పాలి. అందుకే, బీఆర్ఎస్ సభ ఇప్పుడు అటు రాజకీయవర్గాల్లోనూ, ప్రజల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే అన్ని జిల్లాలోనూ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న గులాబీ హైకమాండ్.. అధికారం ఉన్నా, లేకున్నా.. బహిరంగసభల నిర్వహణలో మనల్ని



కొట్టేటోడు లేరన్నట్టుగా మనోధైర్యాన్ని పార్టీ శ్రేణుల్లో నింపే ప్రయత్నం చేస్తోంది.ఆవిర్భావం నుంచి నేటి దాకా.. ఎన్నో ఒడిదుడుకుల్ని చూసిన బీఆర్ఎస్‌కు.. ఓటములు కొత్తకాకపోవచ్చు. కానీ, ఇటీవల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన వరుస ఓటములు.. పార్టీ శ్రేణుల్లో తీవ్రనిరాశను నింపాయనే చెప్పాలి. అప్పట్నుంచి అధినేత కేసీఆర్ అడపాదడపా ఫామ్‌హౌజ్‌కు వచ్చిన నాయకులను ఉద్దేశించి మాట్లాడటమే తప్ప.. బయటకు మాత్రం రాలేదు. దీంతో ఏప్రిల్ 27న జరగబోయే పార్టీ 25 వసంతాల వేడుకలో ఆయన ఏం మాట్లాడబోతున్నారనే ఆసక్తి గులాబీ శ్రేణులతో పాటు, ప్రజలు, అటు ప్రత్యర్థివర్గాల్లోనూ వ్యక్తమవుతోంది.ఉద్యమ ఆరంభం నుంచి బీఆర్ఎస్‌కు వెన్నంటి నిలిచిన కరీంనగర్, వరంగల్ జిల్లాలంటే.. గులాబీసేనకు విపరీతమైన సెంటిమెంట్. ఏ ఉప ఎన్నికలు వచ్చినా.. ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా.. ఇక్కణ్నుంచే సింహనాదం పూరించేవారు కేసీఆర్. గతంలో ఇక్కడ బీఆర్ఎస్ నిర్వహించిన సభలు సక్సెస్ అయిన తీరు కూడా అదే రుజువు చేస్తున్నాయ్. అందుకే అదే సెంటిమెంట్‌ను కంటిన్యూ చేస్తూ.. వరంగల్ ౼ కరీంనగర్ జిల్లాల పొలిమేరల్లోనే ఈ మహా బహిరంగసభకు సన్నాహాలు చేస్తోంది బీఆర్ఎస్. దీని ఏర్పాటు మొదలు నిర్వహణవరకు.. అన్ని బాధ్యతలూ వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలకు అప్పగించిన అధినేత.. ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నారు. NH 563, ఎల్కతుర్తి గ్రామ శివారులోని 1,213 ఎకరాల్లో బీఆర్ఎస్ బహిరంగ సభ జరగనుంది. ఇందులో 159 ఎకరాల్లో సభా ప్రాంగణం ఉంటే.. మిగితా స్థలాన్ని పార్కింగ్, భోజనశాలలు, ఇతర సదుపాయాలను కల్పించేందుకు వాడుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలను, సాధారణ ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను, ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేస్తోంది బీఆర్ఎస్ అధినాయకత్వం. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతుండటంతో.. ఈ మహాసభ BRSకు మంచి బూస్టింగ్ అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సెంటిమెంట్ ప్లేసులో సభ.. కొత్తగా వచ్చిన కష్టాలనుంచి గట్టెక్కిస్తుందా అన్నది కూడా ఆసక్తిరపుతోంది. మరో భారీ విజయానికి ఇక్కడే నాందివేసుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఆ పార్టీ శ్రేణులకు.. అధినేత ఏం చెబుతారో, తదనంతర రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com